
ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
గురువారం 19, డిసెంబరు 2024



వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆపార్టీ నేతలు రెచ్చిపోయారు. పెద్దఎత్తున అక్రమాలకు తెగబడ్డారు. భూబకాసురులుగా మారి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాజేశారు. ఇదే కోవలో తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం కొండకు కూడా టెండర్ పెట్టారు. కొండభూమి వారసత్వ హక్కుగా సంక్రమించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారు. రెవెన్యూ ఉద్యోగుల సహాయంతో 1ఏ, 1బీ రికార్డుల్లో అక్రమంగా ఆరుగురి పేరుతో 60 ఎకరాల భూమిని నమోదు చేయించారు. జాతీయ రహదారి పనులకు కొండ నుంచి గ్రావెల్ తవ్వుకునేందుకు అనుమతి కోసం ఇటీవల ఓ సంస్థ దరఖాస్తు చేసుకోగా రికార్డులు పరిశీలిస్తున్న సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు అవాక్కయ్యారు.



వెలుగువారిపాలెం కొండ



1-బీ రికార్డుల్లో కొండకు వారసత్వ ఆస్తిగా మాజీ సర్పంచ్ ఓబులేరెడ్డి పేరున తప్పుడు రికార్డు

కొండ భూమికి టెండర్!

- 60 ఎకరాల స్వాహాకు వైసీపీ నేతల స్కెచ్
- ఆరుగురు పేరున తప్పుడు 1ఏ, 1బీ రికార్డులు
- రెవెన్యూ సిబ్బందికి భారీగా ముడుపులు
- జగన్ ప్రభుత్వ హయాంలో అడ్డగోలు వ్యవహారం
- వెలుగువారిపాలెంలో అక్రమం
- మైనింగ్ కోసం ఓ సంస్థ దరఖాస్తుతో వెలుగుచూసిన వైనం

తాళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ బొద్దికూరపాడు సర్వే నంబర్ 489లో 663.23 ఎకరాల్లో కొండ ఉంది. అది ఎఫ్ఎల్ఆర్ రికార్డులో కొండ భూమిగా నమోదైంది. గత వైసీపీ పాలనలో ఆభూమిని కాజేసేందుకు వైసీపీకి చెందిన ఆ గ్రామ మాజీ సర్పంచ్, మరో ఐదుగురు నాయకులు కలిసి పక్కా ప్రణాళితో ముందుకు సాగారు. అందుకోసం పకడ్బందీగా వ్యూహాన్ని నడిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు అందుబాటులో ఉన్న విషయం తెలుసుకున్నారు. తమ మాట వినే అధికారిని మచ్చిక చేసుకున్నారు. ఆయన సహకారంతో తతంగాన్ని నడిపారు. ఆరుగురు వ్యక్తుల పేర్లతో కొండ భూమికి నకిలీ రికార్డులు సృష్టించారు.


కొండను సబ్ డివిజన్ చేసినట్లు రికార్డులు

రెవెన్యూ అధికారి సహాయంతో కొండను సబ్ డివిజన్ చేసినట్లుగా మార్చేశారు. సర్వే నెంబర్ 489/3లో మూలంరెడ్డి ఓబులేరెడ్డి (మాజీ సర్పంచ్) పేరుతో 8 ఎకరాలు, 489/7లో చిన్నపురెడ్డి యర్రారెడ్డి పేరుతో 12 ఎకరాలు, 489/2లో గుజ్జుల కోటిరెడ్డి పేరుతో 8ఎకరాలు, 489/4లో చిన్నపురెడ్డి రామకోటిరెడ్డి పేరుతో 8ఎకరాలు, 489/5లో చిన్నపురెడ్డి కోటిరెడ్డి పేరుతో 12ఎకరాలు, 489/6లో మూలంరెడ్డి తిరుపతిరెడ్డి పేరుతో 12 ఎకరాలను 1ఏ అడంగల్‌లో నమోదు చేశారు. అంతటితో ఆగని వైసీపీ నేతలు కార్యాలయ

మిగతా 6లో...

బయటపడింది ఇలా..

గ్రామస్థులు శతాబ్దాల కాలంగా కొండ భూమిని పశువుల మేతకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ కొండ భూమిలో ఏపుగా గడ్డి, పలురకాల మొక్కలు పెరిగి ఉన్నాయి. ఇటీవల జాతీయరహదారి పనులు చేస్తున్న ఓ సంస్థ కొండ భూమిలో గ్రావెల్ మైనింగ్ కోసం దరఖాస్తు చేసుకుంది. అధికారులు ఆ కొండకు సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న సమయంలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అయితే కొండకు 1ఏ, 1బీలో పేర్లు రాయించుకున్న వైసీపీ నేతలు ఆ భూమిని గ్రావెల్‌కు లీజ్‌కు ఇచ్చి సొమ్ము చేసుకునేందుకు ఇలాంటి తప్పుడు రికార్డులు సృష్టించారని అధికారులు గుర్తించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి సర్వేనంబర్ 489 కొండ భూమిని పరిశీలించాలని, నకిలీగా తయారు చేసిన 1ఏ, 1బీ అడంగల్‌ను రద్దు చేయాలని చుట్టుపక్కల నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు.



1-బీ రికార్డుల్లో తప్పుడు పేర్లు నమోదు

కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్

కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- రూ.440 కోట్లతో నిర్మాణం
- 40 ఎకరాల భూమిని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ



కొత్తపట్నం బీచ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సాగరమాల-2 ప్రాజెక్టు కింద దీన్ని ఏర్పాటు చేయనుంది. అందుకోసం అవసరమైన 40 ఎకరాల భూమిని గుర్తించాలని కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఢిల్లీలో రాజీవ్‌రంజన్‌ను కలిసి కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్ ఆవశ్యకతతోపాటు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి కేంద్ర మంత్రి హార్బర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ మేరకు కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు

మిగతా 6లో...

గౌరవ వేతనం ఏదీ?

- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నెలల తరబడి పెండింగ్
- ఏడాదిగా ఎదురుచూపులు
- వ్యక్తిగత ఖాతాల్లో వేయాలంటున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం సకాలంలో అందడం లేదు. నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోతోంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు ఏడాదిగా నిలిచిపోయింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. వారికి గౌరవవేతనాన్ని కూడా సకాలంలో ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. దీనికితోడు కూటమి ప్రభుత్వం

మిగతా 6లో...



చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందుల, అధికారులు

అమ్మదొంగా..!

- చెరువును ఆక్రమించి అమ్మేసిన వైసీపీ నేత
- గత ప్రభుత్వంలో రూ.5కోట్ల భూమిని కాజేసిన వైనం
- దర్జాగా ప్లాట్లు వేసి విక్రయం..
- అప్పట్లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోని యంత్రాంగం
- రెవెన్యూ సదస్సులో బహిర్గతం
- రాళ్లు తొలగించిన అధికారులు

మెయిన్ 5లో..

వెల్లువెత్తుతున్న అర్జీలు

- రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను ఏకరువు పెడుతున్న ప్రజానీకం
- సర్వే, పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల ఆన్‌లైన్ కోసం అధికం
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు



మద్దిపాడు మండలం రాచవారిపాలెం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు భూ సమస్యలను ఏకరువు పెడుతున్నారు. ఏ గ్రామాల్లో సదస్సు నిర్వహించినా పదుల సంఖ్యలో వినతులు అందుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రెవెన్యూలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఫ్రీహోల్డ్ పేరుతో వైసీపీ నేతలు భూములు స్వాధీనం చేసుకున్నారు. సాధారణ ప్రజలు, రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం గురించి పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో చేపట్టిన రీసర్వే అంతా తప్పుల తడక, వివాదాలమయంగా మారింది. ఈనేపథ్యంలో భూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో అనేక సమస్యలను ప్రజానీకం, రైతులు అధికారుల దృష్టికి తెస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6నుంచి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను చేపట్టింది. మండలం యూనిట్‌గా తహసీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు, సర్వే తదితర సిబ్బంది

మిగతా 6లో...

ఇప్పటి వరకూ 6,648 అర్జీలు

జిల్లాలోని 38 మండలాల్లో 826 గ్రామాలలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అధికార యంత్రాంగం ప్రణాళికను రూపొందించింది. అందులో మంగళవారం వరకు 271 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. ప్రతి రోజూ మండలంలో కనీసం ఒక గ్రామంలో నిర్వహిస్తున్నారు. కాగా ఇప్పటి వరకూ సదస్సులు జరిగిన గ్రామాల్లో అధికార వర్గాల సమాచారం ప్రకారం 6,648 అర్జీలు వివిధ భూ సమస్యలపై అధికారులకు అందాయి. అందులో కేవలం 170 మాత్రమే అక్కడికక్కడే పరిష్కరించ గలిగారు. మిగిలిన వాటికి వివిధ స్థాయిల్లోని రికార్డులు పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో అర్జీదారులకు రశీదులు ఇచ్చి తదనంతర పరిష్కారానికి హామీ వచ్చారు.



ఒంగోలు ఆర్టీసీ డిపోలో డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల మాక్ డ్రిల్

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉత్కంఠ!

- ఒంగోలులో బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసుల పరుగు
- కాసేపు ప్రయాణికుల ఆందోళన
- మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరిపీల్చుకున్న జనం

7

బాలలతో వెట్టిచాకిరీ చేయిస్తే చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక
- ఆక్వా పరిశ్రమలో పనిచేస్తున్న ఇద్దరికి విముక్తి
- జిల్లాస్థాయి డీఎల్‌బీఎల్‌వీసీ ఏర్పడిన తర్వాత తొలి కేసు ఇదే!

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలు, వివిధ సంస్థల్లో బాలబాలికల చేత వెట్టిచాకిరీ చేయిస్తే యజమానులపై చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఒంగోలు మండలం కరవదిలోని కల్యాణ్ ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో వెట్టిచాకిరీ చేస్తున్న ఇద్దరు కార్మికులకు విముక్తి కల్పించారు. వారిని సంబంధిత అధికారులు కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. జిల్లాస్థాయి బాండెండ్ లేబర్ విజిలెన్స్ కమిటీ (డీఎల్‌బీఎల్‌వీసీ) ఏర్పడిన తర్వాత ఈ కోణంలో వచ్చిన తొలి ఫిర్యాదుపై కొన్ని గంటల్లోనే వేగంగా స్పందించి బాలికలను విడిపించిన అధికారులను అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లా నుంచి ఎనిమిది మంది కల్యాణ్ ఆక్వా పరిశ్రమలో పనికోసం వచ్చారు. కొన్నిరోజులకే నలుగురు తిరిగి వెళ్లారు. అనంతరం మరో ఇద్దరు కూడా తిరుగుముఖం పట్టారు. మిగిలిన ఇద్దరు కూడా వెళ్లిపోతారమోనన్న ఉద్దేశంతో వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను పరిశ్రమ నిర్వాహకులు తీసేసుకున్నారు. వీరికి రెండున్నర నెలల పని కాలానికి ఇవ్వాల్సిన డబ్బులను కూడా చెల్లించలేదు. మరో వైపు స్వస్థలాలకు వెళ్లిన వారు ఇక్కడ ఉన్న ఇద్దరి గురించి, తాము ఎదుర్కొన్న ఇబ్బందులను అక్కడి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె స్పందించారు. బాధితులను విడిపించాలని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్నను ఆదేశించారు. దీంతో రెవెన్యూ, పోలీసు, కార్మికశాఖ అధికారులతో ఆర్డీవో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ దుర్గాభవాని, లేబర్ ఆఫీసర్ ఎలిజబెత్తమ్మ, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్‌కుమార్, ఇతర ఎన్‌జీవోల సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి పరిశ్రమలో పనిచేస్తున్న ఒక బాలుడు, బాలికను విడిపించారు. వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన ఇరువురికి కలెక్టర్ అన్సారియా రిలీఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి ప్రియాంక పాల్గొన్నారు.

కోర్సుకొండ గ్రావెల్ అక్రమ రవాణా

- రాత్రివేళ పోలీసుల పహారాలో తోలేందుకు యత్నం
- కొండ వద్దకు హుటాహుటిన వెళ్లి అడ్డుకున్న గ్రామస్థులు

7



వణికిస్తున్న చలి

- వారం రోజులుగా జిల్లాలో పెరిగిన తీవ్రత
- 18 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

7

కొండ భూమికి టెండర్!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగికి భారీ స్థాయిలో ముడుపులు ముట్టజెప్పి 1బీలో వారి ఫొటోలతో సహా పేర్లు నమోదు చేయించి తప్పుడు రికార్డులు సృష్టించారు.

కొండను కాజేసేందుకు యత్నం



శతాబ్దాల కాలం నుంచి గ్రామ సర్వే నంబర్ 489లో 663.23 ఎకరాల కొండ భూమిని గ్రామస్థులు పశువుల మేపుకు వాడుకుంటున్నారు. తరతరాలుగా అది కొండ ప్రాంతంగా ఉంది. దీనిపై గత వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీకి చెందిన ఆరుగురు వారిపేర్లపై పట్టాలు ఉన్నట్లు 1ఏ,1బీలో రికార్డులు సృష్టించారు. అందుకు అప్పటి తహసీల్దార్ కార్యాలయ అధికారి పూర్తి సహకారం అందించినందునే కొండకు నకిలీ రికార్డులు తయారయ్యాయి. కొండను కాజేసేందుకు అక్రమంగా పేర్లు నమోదు చేసుకున్న వైసీపీ నేతలపై, తప్పుడు రికార్డులు సృష్టించిన తహసీల్దార్ కార్యాలయ అధికారిపై చర్యలు తీసుకోవాలి.

- చిన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, తెలుగు యువత దర్శి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, వెలుగువారిపాలెం

విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం



గ్రామంలోని సర్వే నంబర్ 489 ఎఫ్ఎల్ఆర్ రికార్డులో కొండగా ఉంది. ఆ కొండలో 60 ఎకరాలు ఆరుగురు రైతుల పేర్ల 1ఏ, 1బీ అడంగల్‌లో తప్పుడు రికార్డులు సృష్టించారని పలువురు గ్రామస్థులు నా దృష్టికి తీసుకువచ్చారు. దానిపై విచారణ చేయించి ఉన్నతాధికారులకు నివేదిక పంపి తదుపరి చర్యలు చేపడతాం.

- సంజీవరావు, తహసీల్దార్

కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్

(5వ పేజీ తరువాయి)

అవసరమైన భూమిని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రూ.400 కోట్ల వ్యయంతో కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్ రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్లు నిర్మాణ దశలో ఉండగా ఇప్పుడు కొత్తపట్నంలో ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా సుమారు 15వేల మంది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు రానున్నాయి. కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపడం పట్ల మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ(సత్య) హర్షం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వెల్లువెత్తుతున్న అర్జీలు

(5వ పేజీ తరువాయి)

గ్రామాలకు వెళ్లి సభను నిర్వహించి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. ప్రతి అర్జీకి విధిగా రశీదు ఇచ్చి తక్షణ చేసే అవకాశం ఉంటే అప్పటికప్పుడు, లేకపోతే నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరిస్తున్నారు.

మండలాల వారీ సదస్సులు ఇలా..

మండలాల వారీగా పరిశీలిస్తే పామూరు మండలంలో 29 రెవెన్యూ సదస్సులు నిర్వహించగాల్సి ఉండగా ఇప్పటి వరకు 11 గ్రామాల్లో పూర్తి చేశారు. 312 అర్జీలు అధికారులకు అందాయి. ఆ ప్రకారం సగటున ఒక్కో సదస్సులో దాదాపు 30 అర్జీలు వరకు వచ్చాయి. కొండపి మండలంలో 22 చోట్ల జరగాల్సి ఉండగా ఎనిమిది చోట్ల నిర్వహించారు. 89 అర్జీలు వచ్చాయి. పీసీపల్లి మండలంలో 25 గ్రామాలకు 9 చోట్ల పూర్తచేయగా 73 అర్జీలు అందాయి. నాగులుప్పలపాడు మండలంలో 18 రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 41 ఊళ్లు ఉండగా 25 రోజులపాటు సదస్సుల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకు 17 చోట్ల సదస్సులు నిర్వహించగా 225 అర్జీలు అందినట్లు సమాచారం. దొనకొండ మండలంలో 30 గ్రామాలకు 11 చోట్ల సదస్సులు నిర్వహించగా ఇప్పటికే 235 దరఖాస్తులు వచ్చాయి. ఇలాంటి పరిస్థితే ఇతర మండలాల్లోనూ కనిపిస్తోంది.

ప్రధాన సమస్యలు ఇవీ..

రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా పట్టాదారు పాసు పుస్తకాలు, భూముల ఆన్‌లైన్, తండ్రి పేరు నుంచి వారసులకు పేర్లు మార్పు, భూమి కొలతలు, పట్టా భూములను సైతం 22(ఎ) వంటి వాటిలో పెట్టడం, అడంగల్, 1బీ రిజస్టర్లలో పేర్ల నమోదు తదితర సమస్యలపై అర్జీలు అధికంగా వస్తున్నాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర రెవెన్యూ ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. ప్రజల సమస్యలు విని పరిష్కారానికి హామీ ఇవ్వడం ద్వారా భరోసా కల్పిస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను విడుదల చేయాలి

తూర్పునాయుడుపాలెం (టంగుటూరు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీలను, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పరుచూరి అవినాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తూర్పునాయుడుపాలెంలోని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు గత పదినెలలుగా మెస్ చార్జీలు విడుదల కాలేదని, దీంతో హాస్టళ్లలో నాణ్యమైన మెనూ సరఫరా కావడం లేదని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది హాస్టళ్లు మూతపడ్డాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాగ్ శ్యామ్యేల్, కోశాధికారి ఎస్ యశ్వంత్ పాల్గొన్నారు.



మేత కోసం రిజర్వాయర్‌లో నుంచి గేదెలతోపాటు పడవపై వెళుతున్న కాపరి



రిజర్వాయర్ దాటి వచ్చి గ్రాసం మేస్తున్న పశువులు

గ్రాసం కోసం ప్రమాద ప్రయాణం

- సర్వం కోల్పోయి పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులు

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు మల్లె తోటల సాగుతో దర్జాగా బతికిన ధేనువకొండ రైతులు గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో జీవితాలు తారుమారయ్యాయి. కోల్పోయిన భూములకు పరిహారం అందినా అవి కటుంబ ఖర్చులకు కరిగిపోయాయి. ఇక మిగిలిన కొద్దిపాటి భూమిని నమ్ముకొని ప్రత్యామ్నాయంగా కుటుంబజీవనం కోసం పాడిని నమ్ముకున్నారు. గేదెలను కొనుగోలు చేసిన రైతులకు మేత సమస్య ఏర్పడింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ మధ్యలో కొంత మెరక భూమి మిగిలింది. అక్కడ గ్రాసం ఉంది. అయితే అక్కడకు చేరుకోవాలంటే తెప్ప లు (చిన్న పడవలు)లో మాత్రమే ప్రయాణించాలి. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గుండా గేదెలను ఈదుకుంటూ ముందుకు వెళ్తుంటే వాటి వెనుక తెప్పలపై పశుపోషకులు మధ్యాహ్ననికి అన్నం తీసుకొని వెళ్లి వస్తున్నారు. రానుపోను సుమారు 5 కి.మీ దూరం రిజర్వాయర్ నీటిలో ప్రమాదపు అంచున ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదమని తెలిసినా గ్రాసం అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు ప్రమాదపుటంచున ప్రయాణం తప్పడం లేదు. ఇలా నిత్యం గేదెలకు 5 కి.మీ ఈత, పశుపోషకులకు 5 కి.మీ దూరం పడవ ప్రయాణం తప్పడం లేదు. నాడు సిరులతో ఉన్న కుటుంబాలు ఇప్పుడు కుటుంబపోషణ కోసం పాడిపరిశ్రమే దిక్కు గా మారింది..

పారిశ్రామిక, భవనాల అనుమతులు వేగంగా మంజూరు చేయాలి

- జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) పరిధిలో పారిశ్రామిక, భవన అనుమతులను వేగవంతంగా మంజూరు చేయాలని ఒడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ఒడా కార్యాలయంలో జేసీ గోపాలకృష్ణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, వివిధ అసోసియేషన్ల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక పాలసీ 2024-29కి సంబంధించి రాయితీలతో పాటు భవన అనుమతులకు సంబంధించి కొత్త రూల్స్ వస్తున్నాయన్నారు. వాటికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వాలని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాన్సెప్ట్ మీద అనుమతులు గతంలో కన్నా మరింత సులభతరం చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీలలో 300 స్క్వేర్ మీటర్ల స్థలం వైశాల్యంలో 10 మీటర్ల ఎత్తు వరకు రెసిడెన్షియల్ భవన నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శులు, అలాగే మునిసిపాలిటీల్లో మునిసిపల్ కమిషనర్, ఇక ఒంగోలు కార్పొరేషన్‌లో వెయ్యి స్క్వేర్ మీటర్ల స్థల వైశాల్యంతో నగర కమిషనర్, అలాగే ఒడా పరిధిలో 4000 స్క్వేర్ మీటర్ల వరకు అనుమతులు ఇస్తారని తెలిపారు. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ పథకంలో ప్లాట్లను తక్కువ ధరలకే అందిస్తామన్నారు. జిల్లాలో అనధికారిక లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రజలు అనధికారిక లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని జేసీ కోరారు. కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్లానింగ్ ఆఫీసర్ బాబురావు, సెక్రటరీ వెంకటరెడ్డి, సీఆర్ఈడీఏఐ వైస్ చైర్మన్ రఘురామయ్య, అధ్యక్షుడు రాజేంద్ర, బీఎంఆర్ గ్రూపు ఎండీ.అర్జున్, రాష్ట్ర పరిశ్రమల సంఘం సెక్రటరీ రోశయ్య, లైసెన్స్ టెక్నికల్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, బిల్డర్లు, డెవలపర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

పాత కక్షలతో యువకుడిపై దాడి

- దారికాచి ఇనుపరాడ్డుతో పాశవికంగా కొట్టినవైనం
- అపస్మారక స్థితిలో యువకుడు.. ఆస్పత్రికి తరలింపు
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

సింగరాయకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలను దృష్టిపెట్టుకొని ఒక యువకుడిపై మరో యువకుడు దాడిచేశాడు. దారికాచి వెంబడించి ఇనుపరాడ్‌తో తీవ్రంగా గాయపరిచాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సోమరాజుపల్లికి చెందిన మసనం వెంకట్రావు, పాతసింగరాయకొండకు చెందిన కాకుమని హరికృష్ణలు 10 రోజుల క్రితం గొడవపడ్డారు. దీనిని మనసులో పెట్టుకొని హరికృష్ణపై దాడిచేయడానికి వెంకట్రావు ప్లాన్ చేశాడు. బుధవారం మధ్యాహ్నం హరికృష్ణ సెంట్రింగ్ పనికి వెళ్లి భోజనానికి ఇంటికి బయల్దేరారు. విషయం తెలుసుకున్న వెంకట్రావు ఫకీర్‌పాలెం వద్ద మాటువేసి ఉన్నాడు. వాటర్‌ప్లాంట్ ఎదురుగా ఉన్న స్పీడ్‌బ్రేకర్ వద్ద హరికృష్ణ బైక్ నెమ్మదించగా వెంకట్రావు ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. దీంతో హరికృష్ణ బైక్‌ను వదిలి పరుగు తీశారు. వెంకట్రావు కూడా వెంబడించాడు. సోమరాజుపల్లి సమీపంలోకి వెళ్లేసరికి అతన్ను పట్టుకొని వెంకట్రావు విచక్షణా రహితంగా ఇనుపరాడ్‌తో దాడిచేశారు. దెబ్బలు తాళలేక హరికృష్ణ స్పృహ కోల్పోయాడు. చనిపోయాడని భావించి నిందితుడు నేరుగా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. బాధితుడిని వారి బంధువులు ఒంగోలు ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై బి. మహేంద్ర తెలిపారు.





రక్తగాయాలతో స్పృహ కోల్పోయిన హరికృష్ణ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

రాష్ట్రస్థాయి పోటీలకు చీమకుర్తి విద్యార్థిని



చీమకుర్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చీమకుర్తికి చెందిన గెలాక్సీ స్పోర్ట్స్‌క్లబ్ క్రీడాకారిణి అరికాటి సాయిలత ఎంపికయ్యారు. చీమకుర్తిలోని విద్యానికేతన్ స్కూల్‌కి చెందిన సాయిలత ప్రతిభచాటి ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికయింది. ఈనెల 22నుంచి తూర్పుగోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున బరిలోకి దిగనున్నారు. ఈ సందర్భంగా బుధవారం సాయిలత, కోచ్ కురిచేటి వెంకట్, అసిస్టెంట్ కోచ్ ఉమామహేశ్వరరావులను స్కూల్ కరస్పాండెంట్ రవీంద్ర, టీచర్లు, విద్యార్థులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

- డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ-గ్రామ స్వరాజ్ యాప్ ద్వారా పూర్తి సమాచా రాన్ని అప్‌లోడ్ చేయాలని మార్కాపురం, కనిగిరి డి ఎల్‌డీఓ కొల్లి శ్రీనివాసరెడ్డి సూచించారు. 'ఈ-గ్రామ స్వరాజ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో బి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, శిక్షణ పొందిన వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్‌పీటీసీలకు ఎంపీపీలు వారికి పూర్తి మద్దతు తెలిపి సహకరించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

పొదిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభి వృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు పోవాలని ఎంపీడీవో శోభన్‌బాబు కోరారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా తాగునీరు, లైటింగ్, పారిశుధ్యం, డ్రైనేజి వ్యవస్థ పూర్తిస్థాయిలో ఉంటే గ్రామం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణ స్వామి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి : ఆర్డీవో

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత ఓటు హక్కుపై అవగాహన పొందాలని, తద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఓటు అవగాహన కార్యక్రమం కళాశాల సెక్రటరీ వనమారామకృష్ణ, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలక పాత్రని చెప్పారు. కావున 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై విచారణ

- వైసీపీ నేతలతో కలిసి డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి
- కాంట్రాక్టర్ ఫిర్యాదుపై వచ్చిన డీఎల్‌పీవో

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై బుధవారం విచారణ చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన సీసీ రోడ్ల నిధులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విడుదల అయ్యాయి. అధికారం అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు అధికారులతో కలిసి ఆ నిధులను డ్రా చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేశారు. కోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నా, పంచాయతీ కార్యదర్శి రివ్యూ పిటిషన్ వేసి సాగదీసుకుంటూ వస్తున్నారు.

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో బుధవారం చీరాల డీఎల్‌పీవో శివనారాయణ విచారణ నిర్వహించారు. సర్పంచ్ గుజ్జుల మల్లిక జగన్మోహనరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిను డీఎల్‌పీవో శివనారాయణ విచారించి స్టేట్‌మెంట్‌లు నమోదు చేశారు.

రూ.15.74లక్షలు డ్రాచేసి వైసీపీ నేత

అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో 2018-19 సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 3 సీసీ రోడ్లు వేశారు. 70:30 వాటా ప్రకారం 30 శాతం కూలీలకు పోను పనులు చేసిన టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు 15,74,283 రూపాయలు రావల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీసీ రోడ్లకు గాను నిధులు విడుదల కావడంతో ఆ పనులకు సంబంధించిన అన్ని వివరాలతో మానం మురళీమోహన్‌దాస్ 2019 సెప్టెంబరు 3వ తేదీ బిల్లులు చెల్లించాలని అధికారులకు అర్జీ ఇచ్చారు. ఆ అర్జీ ఆధారంగా పనులు వీరారెడ్డి చేసినట్లు తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లిక జగన్మోహనరెడ్డి పంచాయతీ బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును 2019 సెప్టెంబరు 9వ తేదీన డ్రాచేసి వైసీపీ నేత చంద్రగిరి వీరారెడ్డికి ఇచ్చారు. దీంతో అప్పట్లోనే టీడీపీ నేత మురళీమోహన్‌దాస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

డీఎల్‌పీవో విచారణలో నేరుగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు బ్యాం క్ నుంచి డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించారు. నిబంధనల మేరకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి బ్యాంక్ చెక్‌ను పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ఇ వ్వాల్సి ఉంది. ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో గాయత్రి లక్ష్మి, ఫిర్యాదుదారుడు, టీడీపీ నేత మానం మురళీమోహన్ దాసు తదితరులు ఉన్నారు.

గౌరవ వేతనం ఏదీ?

(5వ పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చాక అధికారుల బదిలీలు, ఇతరత్రా కారణాలతో వేతనాలు ఆగిపోయాయి. మొత్తం ఏడాదిగా గౌరవ వేతనం పెండింగ్‌లో ఉంది.

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

సర్పంచ్‌లు, ఎంపిటీసీల సభ్యులకు నెలకు రూ.3వేలు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులకు నెలకు రూ.6వేలు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. దాన్ని కొన్నేళ్లుగా పంచాయతీ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. అందులో నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గౌరవ వేతనం తీసుకోవాల్సి రావడం సమస్యగా మారింది. దీంతో చాలాచోట్ల కార్యదర్శులు ఆ మొత్తాన్ని వివిధ రకాల పనులకు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని 'స్థానిక' ప్రజాప్రతినిధులు ఆందోళనలు చేపట్టినా గత వైసీపీ ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. గౌరవవేతనం కూడా నెలనెలా చెల్లించకుండా పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. ఈ క్రమంలో గత సార్వత్రి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో పనిచేసిన అధికార యంత్రాంగం బదిలీ కావడం, ఇతరత్రా కారణాలతో మరికొన్ని నెలల జీతాలు ఆగిపోయాయి.

బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలంటున్న 'స్థానిక' ప్రజాప్రతినిధులు

జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధులు వెయ్యి మంది వరకూ ఉన్నారు. వారందరికీ ప్రతినెలా సుమారు రూ.25లక్షల వరకూ గౌరవ వేతనం రావాల్సి ఉంది. అందుకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్థానిక పాలనలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈనేపథ్యంలో తమకు గౌరవ వేతనం చెల్లించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుతోపాటు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరుతున్నారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జీజీహెచ్‌లో పరిశీలిస్తున్న ప్రివెంట్ అంకాలజీ నోడల్ అధికారులు

జీజీహెచ్‌లో అంకాలజీ వైద్యసేవల పరిశీలన

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీజీహెచ్‌లో అందిస్తున్న క్యాన్సర్ (అంకాలజీ) వైద్య సేవలను ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయం కమిషనర్, ఇతర వైద్యబృందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రివెంట్ అంకాలజీ నోడల్ అధికారులు డాక్టర్ శ్యామలదేవి, కన్సల్టెంట్ రాజకిరణ్, డబ్ల్యూహెచ్‌వో అధికారులు డాక్టర్ పాటిల్, డాక్టర్ సురేష్ ఒంగోలులోని జీజీహెచ్‌లోని అంకాలజీ ఓపీ 222ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న నోటి, గర్భాశయ క్యాన్సర్ సంబంధి రోగులతో మాట్లాడారు. వైద్యులు అందిస్తున్న సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అక్కడి వైద్యులు సూచనలో 222 పింక్ కార్డు మంజూరు చేసి, వైద్యం అందిస్తున్నట్లు జీజీహెచ్ వైద్యులు వెల్లడించారు. అలాగే ప్రతి మంగళవారం, గురువారం క్యాన్సర్‌కు సంబంధిచిన వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైై వారికి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అంకాలజీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ తిరుమలరావు, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్లు మాధవీలత, ఆర్ఎంవో భగీరథ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, డాక్టర్ కిషన్, వాణిశ్రీ, ఒ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు విద్య, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీకి సంబంధించిన రెండు, మూడు సెమిస్టర్ల మూల్యాంకనం గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుందని క్యాంపు ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు సెమిస్టర్లకు సంబంధించి అన్ని సబ్జెక్టు పేపర్లు వచ్చాయన్నారు. జిల్లాలోని ఒంగోలు, అద్దంకి, పొదిలి, దర్శి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులందరూ తమ యూనివర్శిటీ అపాయింట్‌మెంట్ ఐడీ కార్డు, వ్యక్తిగత ప్రొఫైల్, కళాశాల రిలీవింగ్ తీసుకొని హాజరుకావాలని ఆమె కోరారు.

తప్పుల సవరణకు 23 వరకు అవకాశం

ఒంగోలువిద్య, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల దరఖాస్తుల్లో విద్యార్థి పేరు, తల్లిదండ్రులు పేర్లు, పుట్టిన తేదీ, మీడియంలలో తప్పులు ఉంటే గురువారం నుంచి ఈనెల 23వ తేదీవరకు ఆన్‌లైన్‌లో ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిచేసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం హెచ్ఎంలను ఒక ప్రకటనలో ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లో సడలింపుల తేదీ ఇక పొడిగింపు ఉండదన్నారు. అందువల్ల పూర్తి బాధ్యతను ప్రధానోపాధ్యాయులు వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఇళ్లముందు నిలిపే వాహనాలు జాగ్రత్త



స్వాధీనం చేసుకున్న వాహనాలను అప్పగిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ ఇళ్లముందు ఉంచే వాహనాలకు రక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్సై ప్రేమ్‌కుమార్ సూచించారు. ఇటీవల కాలంలో ఇళ్ల ముందు నిలిపిన వాహనాలు దొంగతనాల బారినపడుతున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి పోలీసులు స్పందించారు. ఇళ్లముందు రక్షణ చర్యలు లేకుండా ఉంచిన 20వాహనాలను ఎస్సై, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం రాత్రి వాహనదారులను పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తగిన ధ్రువీకరణ పత్రాలు చూసి వాహన యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తమ వాహనాలకు హ్యాండిల్ లాక్‌లు వేసుకోవాలని, చక్రాలు కదలకుండా తాళాలు వేసుకోవాలని సూచించారు. ట్రాక్టర్లు, ఆటోల యజమానులు కూడా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధిలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ


మద్దిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తప్పవని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక మండలపరిషత్ ఆవరణలో బుధవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ఉపాధిపనులలో దొంగమస్టర్లు వేయడం నేరమన్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశాకార్యకర్తలకు మస్టర్లు వేయడం ఘోరమైన తప్పిదమని చెప్పారు. ఈ సందర్భంగా పలుగ్రామాలలో చేసిన పనులలో కొలతలు తేడా ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. కూచిపూడిలో నెల్లూరులో పనిచేస్తున్న ఓ సచివాలయ ఉద్యోగి పేరుతో హాజరు వేసినట్లు గుర్తించారు. మద్దిపాడు, కెల్లంపల్లి, రామాయపాలెం గ్రామాలలో గత ప్రభుత్వహయాంలో మృతి చెందినవారి పేర్లతో మస్టర్లు వేయడం బట్టబయలైంది. ఆశాకార్యకర్తలకు, వలంటీర్లకు, మస్టర్లు వేసినట్లు వెల్లడైంది. దీనిపై స్పందించిన పీడీ జోసఫ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వేదికలో ఏపీడీ లలిత, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో ఎన్ జగదీష్, ఎస్ఆర్‌పీ మూర్తి, ఏపీవో రాంబాబు పాల్గొన్నారు.

పిల్లల కోసం వారి ఇళ్లకెళ్లిన ఉపాధ్యాయులు

టంగుటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని బుడబుక్కల కాలనీవాసుల పిల్లలు సుమారు 20 మంది వరకు రోజూ బడికి రావడంలేదు. ఈవిషయాన్ని పాఠశాల ఇంగ్లీషు, హిందీ ఉపాధ్యాయులు సీహెచ్ రమాదేవి, ఎస్కే షమీమ్ గమనించారు. బుధవారం వారిద్దరూ ఆ కాలనీకి వెళ్లారు. పిల్లలతో మాట్లాడారు. స్కూలుకు వస్తే చదువుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు స్పందించి వారిని రోజూ స్కూల్‌కు పంపుతామని చెప్పారు.

ఫోక్ డ్యాన్స్‌లో యర్రబాలెం విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయిలో ఫోక్ డ్యాన్స్ పోటీలకు ఎంపికైన యర్రబాలెం విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంభం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయవాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్) పోటీలలో కంభం మండలం యర్రబాలెం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. అంతేకాకుండా జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన పిక్కిలి పావని, పిక్కిలి లక్ష్మి, నల్లబోతుల మాధవి, నల్లబోతుల కామేశ్వరి, ఈర్ల శివపార్వతిలను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కంభం ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, చేగిరెడ్డి ఓబులరెడ్డి, యర్రబాలెం సర్పంచ్ శ్రీనివాసయాదవ్, ఎంపీటీసీ సభ్యురాల లక్ష్మీదేవి, జె.క్రిష్ణమూర్తి, విజయలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాంబు స్క్వాడ్





బస్టాండ్‌లో అందరినీ అప్రమత్తం చేస్తున్న పోలీసులు

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉత్కంఠ!

అది ఆర్టీసీ బస్టాండ్. ఆవరణలో ఒక బ్యాగ్ ఉంది. ఎవరో దాన్ని వదిలేశారు. వచ్చేపోయే ప్రయాణికులు దాన్ని చూసి వెళుతున్నారు. ఒక ప్రయాణికుడు అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. కొద్దిసేపటికే పదుల సంఖ్యలో పోలీసులు ఉరుకులు పరుగుల మీద బస్టాండ్‌కు చేరారు. డీఎస్పీ ఆధ్వర్యంలో బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో వచ్చారు. ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డిపోలోని బ్యాగ్ ఉన్న ప్రాంతాన్ని స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈ హడావిడిని చూసి ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందో అర్థంకాక భయపడిపోయారు. వారందరినీ పోలీసులు అప్రమత్తం చేశారు. అయినా అక్కడున్నవారిలో ఒకటే ఉత్కంఠ! ఆ బ్యాగ్ ఏంటి? అందులో ఏముంది? ఒకవేళ బాంబు ఉంటే పరిస్థితి ఏంటి?.. ఇలా మదిలో ఒకదాని తరువాత ఒకటి ప్రశ్నల ప్రవాహం పరుగు పెడుతోంది. వణుకుతున్న కాళ్లు చేతులతో ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. మరోపక్క పోలీసులు ధైర్యంగా ముందడుగు వేశారు. అనుమానాస్పద బ్యాగ్‌ను గుర్తించారు. స్నైపర్ డాగ్‌ను దించారు. బ్యాగ్‌లో పేలుడు పదార్థాలు ఉన్నట్లు డాగ్ సాంకేతాలు ఇచ్చింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్.. ప్రత్యేక షూట్ ధరించి అనుమానాస్పద బ్యాగ్‌ను జాగ్రత్తగా ఓపెన్ చేశారు. నిర్జనప్రదేశానికి తీసుకెళ్లి బాంబ్‌ను డిస్పోజల్ చేశారు. ఆ దృశ్యాన్ని చూసి ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లారు. అనంతరం ప్రయాణికులందరినీ సమీకరించారు. ఏదైయినా అనుమానాస్పద వస్తువులు కనబడితే వెంటనే 112 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఇది మాక్ డ్రిల్ అని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్సై బ్రహ్మనాయుడు, ఆర్ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

- ఒంగోలు (క్రైం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)



బ్యాగ్‌ను గుర్తిస్తున్న స్నైపర్ డాగ్



బస్టాండ్‌లో పోలీసుల తనిఖీ

వణికిస్తున్న చలి



డివైడర్‌పై చలిలో నిద్రిస్తూ..

వారం రోజులుగా జిల్లాలో పెరిగిన తీవ్రత

- 18 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు.. అవస్థలు పడుతున్న జనం
- కమ్మేస్తున్న పొగ మంచు
- వణికించే చలిలోనూ జీవన పోరాటం



ఒంగోలులో చలికాచుకుంటూ..

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా చలితో వణుకుతోంది. గడిచిన వారం పది రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఉదయం, రాత్రివేళలో విపరీతమైన పొగ మంచు కమ్మేస్తోంది. సాయంత్రం ఐదు గంటల నుంచే చలితీవ్రంగా ఉంటోంది. చలికి శీతల గాలులతో తోడయ్యాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు చలి తీవ్రతకు తట్టుకోలేకపోతున్నారు. ఈ సీజన్‌లోనే జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవగా, పది రోజుల నుంచి మరింతగా పడిపోయాయి. ఉదయం, సాయంత్రం పూట బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు.

భయపెడుతున్న రానున్న రోజులు

జిల్లాలో ఇటీవల పెరిగిన చలి తీవ్రతపై ప్రజలు ఒకింత కలవరపాటుకు గురౌతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక రానున్న రోజులు ఎలా అంటూ భయం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న చలిగాలులతో ఉదయం సూర్యుడు ఉదయించినా 8 గంటల దాటే వరకు అడుగు పెట్టడానికే జంకుతున్నారు. మరోవైపు సాయంత్రం వేళలో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జడుసుకుంటున్నారు. శీతల గాలులు వీస్తున్న తరుణంలో చలిని తట్టుకునేందుకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించడంతోపాటు గ్రామాల్లో చలి మంటలు కాచుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందన్న ఆందోళన జిల్లా ప్రజల్లో ఉంది.

వృద్ధులు..పిల్లలపై తీవ్ర ప్రభావం

చలి తీవ్రతకు వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. చలితో శరీరంలోని తేమ కోల్పోయి చర్మం పొడిబారడంతోపాటు పెదాలు, కాళ్లు, చేతులు పగుళ్ల ఏర్పడుతున్నాయి. పిల్లలు, వృద్ధులలో చలి తీవ్రతకు జలుబు, అస్తమా, ఎలర్జీల బారిన పడుతున్నారు. వాతావరణ పరిస్థితుల మూలంగా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. థైరాయిడ్, అలర్జీ, ఉన్న వారికి ఇది కష్టకాలమని, ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

గడిచిన పదిరోజుల్లో ఒంగోలులో ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

తేదీ	ఉష్ణోగ్రత
8	23
9	23
10	23
11	23
12	23
13	20
14	20
15	19
16	18
17	21



పిల్లలు, వృద్ధులపై ప్రభావం



డ్రై గ్యాంగ్రీనే, బాహ్య చర్మం కింద ఉండే రక్తనాళాలు కుంచించుకుపోతాయి. శరీరంలోని కణజాలకు రక్తం సరఫరా కాక అవి చనిపోతాయి. అతి చలి కారణంగా బెల్స్ పాలసీ అనే వ్యాధి వస్తుంది. ముఖ్యంగా వాహనాలు నడిపేవారు ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉంది. వాహనాలు నడిపేటపుడు చేతులకు గ్లౌజులు, కాళ్లకు సాక్సులు, శరీరానికి స్వెట్టర్లు ధరించాలి. అలా లేకుంటే బెల్స్ పాలసీ వ్యాధికి గురౌతారు. దీనివల్ల మూతి వంకరపోవడం, నోటి నుంచి నురుగు రావడం వంటివి జరుగుతాయి. ప్రధానంగా పొగ తాగేవారు, మద్యం తాగేవారు చలి బాగా వీస్తున్న సమయంలో బయటకు రాకూడదు. ఆ సమయంలో వారు బయటకు వస్తే చేతులు, కాళ్లకు పుండ్లు పడతాయి. ఉబ్బస వ్యాధిగ్రస్తులకు వాయుగోళాలు మూసుకుపోయి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. మధుమేహగ్రస్తులు చలి ప్రభావానికి గురైతే వారికి శరీరమంతా మొద్దు బారిపోతుంది. తిమ్మిర్లు ఎక్కువ అవుతాయి. నొప్పులు కూడా తెలియవు. ఏదైనా క్రిమికీటకాలు తాకినా గుర్తించలేనంత నిస్సహాయ స్థితిలో ఉంటారు. శరీర అవయవాలు దెబ్బతింటాయి.

- డాక్టర్ చైతన్య ప్రతాపనేని, చర్మవ్యాధుల వైద్యనిపుణులు

కోర్సుకొండ గ్రావెల్ అక్రమ రవాణా

- రాత్రివేళ పోలీసుల పహారాలో గ్రావెల్ తోలేందుకు యత్నం
- కొండ వద్దకు హుటాహుటిన వెళ్లి అడ్డుకున్న గ్రామస్థులు
- టీడీపీ నేత దామచర్ల దృష్టికి తీసుకెళ్లిన ఆ పార్టీ శ్రేణులు
- జనార్దన్ జోక్యంతో వెనుదిరిగిన పోలీసులు

తాళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొర్రపాటివారిపాలెం గ్రామ శివారునున్న కోర్సుకొండ నుంచి పోలీసుల పహారాలో గ్రావెల్ అక్రమం యథేచ్ఛగా సాగుతోంది. బీవీకేరోడ్డు కంటాక్ట్ సంస్థకు చెందిన వాహనాలు మంగళవారం రాత్రి గ్రావెల్ తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వాదోపవాదాలు జరిగాయి. ఆందోళనకు తలొగ్గి గ్రావెల్ వాహనాలను పోలీసులు పంపేశారు. ఉదయం కొండ నుంచి గ్రావెల్ తరలించేందుకు యత్నించగా గ్రామంలోని రాజకీయాలకు అతీతంగా అధికసంఖ్యలో మహిళలు గ్రామస్తులు తరలివెళ్లి గ్రావెల్ తరలించవద్దని వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో మహిళలు యంత్రాల ముందు కూర్చుని గ్రావెల్ తోలకాన్ని అడ్డుకున్నారు. ఆ సమయంలో బాపట్ల జిల్లా మైనింగ్ అధికారులు కొండ వద్దకు వచ్చి అక్కడున్న యంత్రాలను, టిప్పర్లను పంపివేశారు. శతాబ్దాల కాలం నాటి నుంచి గ్రామస్థులకు పశులమేతగా ఉన్న కొండకు ఎందుకు పర్మిషన్ ఇచ్చారని నిలదీయగా ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని గ్రామస్థులకు సమాధానం ఇచ్చారు. రెవెన్యూ అధికారుల సహకారంతో ఎంత గ్రావెల్ కొండ నుంచి అక్రమంగా తరలించారో మైనింగ్ అధికారులు నిర్ధారించారు. రాత్రి 7 గంటల సమయంలో దర్శి సబ్‌డివిజన్ నుంచి తాళ్లూరు పరిసర పోలీస్ స్టేషన్ల నుంచి పలువురు ఏఎస్సైలు, పీసీలు, మహిళా పీసీలు అధిక సంఖ్యలో కొండ వద్దకు చేరుకున్నారు. రోడ్డు నిర్మాణ సంస్థకు వత్తాసుగా గ్రావెల్ తరలించేందుకు సిద్ధం అయ్యారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు, మహిళలు చీకటిని కూడా లెక్కచేయకుండా కొండ వద్దకు వెళ్లారు. గ్రావెల్ తరలిస్తే సహించేది లేదనితేల్చి చెప్పారు. వివిదాలు జరిగినపుడు లా అండ్ ఆర్డర్‌ను పర్యవేక్షించాల్సిన పోలీసులు... గ్రావెల్ అక్రమాన్ని అడ్డుకునేందుకు వచ్చిన మహిళలను, గ్రామస్తులను బెదిరించే విధంగా వ్యవహరించటం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల తీరును కొందరు మహిళలు సెల్‌లో వీడియో తీస్తుండగా సెల్‌లు లాక్కున్నేందుకు యత్నించటంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు పూర్తిగా రోడ్డు నిర్మాణ సంస్థకు అనుకూలంగా నిలవటంతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వీడియో కాల్ ద్వారా చూపి తమ గోడువెళ్ల బోసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే దామచర్ల అక్కడున్న పోలీసులతో మాట్లాడి నిబంధనల మేరకు వ్యవహరించాలని, ప్రజల్ని ఇబ్బందులు పెద్దవద్దని సూచించటంతో రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దొడ్డవరంలో గ్రావెల్ టిప్పర్లు అడ్డగింత

- బెంగళూరు హైవే పేరుతో అక్రమంగా తవ్వకాలు
- గ్రామస్థుల ఆగ్రహం

మద్దిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రీన్ హైవే పేరుతో దొడ్డవరం రెవెన్యూ పరిధిలోని కొండ గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. దొడ్డవరం మీదుగా నిత్యం వందలాది లారీలు వెళ్తుండటంతో ప్రజలకు కంటిమీద కునుకు ఉండటం లేదు. బెంగళూరు గ్రీన్ హైవే పేరుతో 50 మీటర్ల అనుమతులు తీసుకుని ఎక్కడపడితే అక్కడ తవ్వుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం గ్రామస్థులు లారీలను అడ్డుకున్నారు. నిత్యం చిన్నపిల్లలు తిరుగుతుంటారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులంటూ నిలదీశారు. నిత్యం ఐదారు భారీ ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ సుమారు 100 నుంచి 200 లారీలు గ్రావెల్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఫోన్ ద్వారా తహసీల్దార్ సృజన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తవ్వకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అయితే గ్రామస్థులు వాహనాలు రాకపోకలు జరకుండా టిప్పర్లకు అడ్డుగా కూర్చున్నారు. మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో పట్టీపట్టనట్లు ఉంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కొండ గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.



లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వస్తువుల కొనుగోలు సమయంలో మోసపోకుండా చూడాలి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో మోసపోకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురష్కరించుకొని బుధవారం స్థానిక ఏకేవీకే డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్యాకేజ్ రూల్స్, ఐఎస్ఐ మార్కు, అల్‌మార్కు, ఆహార కల్తీ వంటి వాటిపై వినియోగదారులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, ఫుడ్ సెఫ్టీ అధికారి జి.ప్రభాకర్, కొలతలుశాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, జాతీయ నాణ్యతల పరిమాణాల సంస్థ అధికారి అనిల్ తదితరులు ఉన్నారు.

అలసత్వం వీడి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని అలసత్వం వీడి పని చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం రాచవారిపాలెం రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు భూములకు సంబంధించిన సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటిని పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సును ఉపయోగించుకోవాలని కోరారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను ఆదేశించారు. వచ్చిన ప్రతి అర్జీని ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో బుల్లయ్య టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న శేషుబాబు

నాగులుప్పలపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో తిమ్మసముద్రం-2 సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తేళ్ల శేషుబాబు బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. తాను ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యేందుకు కృషి చేసిన బీఎన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మంగమూరి మధు, ముద్దన రవి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి

ఒంగోలు విద్య, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.పద్మకుమారి సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఆమెను నెల్లూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోపర్యవేక్షకులుగా నియమితులయ్యారు, ఈ సందర్భంగా బుధవారం స్థానిక కార్యాలయంలో పద్మకుమారిని డీఈవో కిరణ్‌కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు ఆదిలక్ష్మి, కె.ఉమా, సమగ్ర శిక్ష కార్యాలయాల సిబ్బంది పేరయ్య, శ్రీదేవి, గౌరి, జీఎస్.చైతన్య తదితరులు అభినందించారు.

రైజ్‌లో విద్యార్థులకు వర్క్‌షాపు


వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు విద్య, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ విభాగాలకు చెందిన విద్యార్థులకు గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ అండ్‌మిషన్ లెర్నింగ్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుస్కిల్స్‌లో పని చేస్తున్న ఎస్వీ.పవన్‌కుమార్ విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించినట్లు రాగా చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక తెలిపారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, విభాగాధిపతి ఐజాక్‌పాల్, కో ఆర్డినేటర్ ఎం.భారతిదేవి తదితరులు పాల్గొన్నారు.

టాన్యా సేవలు స్ఫూర్తిదాయకం


టాన్యా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా వైద్యురాలుగా, మహిళా ఉద్యమనేతగా డాక్టర్ టాన్యా సమాజానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమైనవి అని డాక్టర్ ఉదయిని పేర్కొన్నారు. టాన్యా 83వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక బెతూన్ నర్సింగ్ హోమ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా టాన్యా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ టి.స్వాతి మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.రంగారావు, పురుషోత్తమరావు, సందీప్ ప్రకాష్, క్యాన్సర్ వైద్యశాల డాక్టర్ ఎ.దీప్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి, ఎన్.మాలతి, ఎస్‌కే.నాగూర్, జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, బి.రాజ్యలక్ష్మి, బి.పద్మ, పి.కృపావతి, బి.రంగమ్మ, పెద్దగోవిందమ్మ, ఎస్‌డీ.అమీరున్నీసా, కె.విజయలక్ష్మి, పి.ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి : మాగుంట


కేంద్రమంత్రి సోనోవాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ మండలంలోని గుండాయపాలెం నుంచి సముద్రతీరానికి వెళ్లే మార్గంలో బకింగ్ హామ్ కెనాల్‌పై రూ.17 కోట్ల వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఢిల్లీలో బుధవారం పోర్ట్ షిప్పింగ్, జలమార్గాలశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ప్రకాశం జిల్లాలో సముద్రతీర ప్రాంతం ఎక్కువగా ఉన్నందున అందుకు సంబంధించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ మాగుంట ఇచ్చిన అర్జీని పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సేవా సంకల్ప్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఆర్ఐ కోడే వరుణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా పేదలకు అన్నదానం చేశారు. ట్రస్టు ఫౌండర్ పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, ట్రస్టు సభ్యులు పీఎస్ఎస్.చౌదరి, హసీనాబీగం, కె.వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన

పొన్నలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై అనూక్ చెప్పారు. బుధవారం పొన్నలూరులో ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

యరజర్ల రోడ్డులో ప్రమాదకరంగా వంతెన

● రక్షణ గోడలు లేని వైనం ● వాహనదారుల భయాందోళన

ఒంగోలు మండలం వెంగముక్కపాలెం నుంచి యరజర్ల గ్రామానికి వెళ్లే రోడ్డులోని నాగార్జున కాలువపై గల వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఒక వైపు రక్షణ గోడ పూర్తిగా లేక పోవటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రెండేళ్ల క్రితమే వంతెనపై రక్షణ గోడ శిథిలావస్థకు చేరి పక్కన ఉన్న కాలువలో పడిపోయింది. ఈ విషయం స్థానికులు పలుసార్లు అధికారులకు తెలిపినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వాహనదారులు పలువురు కాలువలో పడి ఆసుపత్రి పాలైన ఘటనలు అనేకం. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహనదారులు రక్షణ గోడ లేని విషయాన్ని గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు(రూరల్), (ఆంధ్రజ్యోతి)


రక్షణ గోడ లేని వంతెన

కమ్మ సంఘం సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే దామచర్ల


ఎమ్మెల్యే దామచర్ల, స్థలదాత వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కమ్మ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరం రాజీవ్‌నగర్‌లో నూతనంగా నిర్మించనున్న కమ్మభవన్‌కు దామచర్ల భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మభవన్ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కమ్మ సేవా సంఘం ద్వారా చేపట్టే కార్యక్రమాలకు ఒక వేదికగా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే భవన నిర్మాణానికి ప్రభుత్వం తరుపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్థల దాత చిడిపోతు వెంకటేశ్వర్లు కోటి రూపాయల విలువైన 25 గదుల స్థలం ఉచితంగా సంఘానికి అందించడంపై అభినందనలు తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ కమ్మభవన్ కోసం చిడిపోతు వెంకటేశ్వర్లు స్థలాన్ని ఉచితంగా అందించడం సంతోషంగా ఉందన్నారు. గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ కమ్మ సేవా సంఘానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. గౌరవ సలహాదారులు నిడమనూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్మ సేవా సంఘంలో అనేక సేవా కార్యక్రమాలు రూపకల్పన చేసే దిశగా సంఘ ప్రతినిధులు కృషి చేస్తున్నారని అన్నారు. అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ దాతల సహకారంతో నాలుగు నెలల్లో కమ్మభవన్ పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. స్థల దాత చిడిపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్మ సామాజికవర్గంలోని నిరుపేదలకు వసతి భవన్ కూడా నిర్మాణం జరగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ కాట్రగడ్డ రఘుకుమార్, ఉపాధ్యక్షులు అబ్బూరి నవీన్‌కుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు

● జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్


బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న జీఎం శైలేష్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్ కుమార్ పేర్కొన్నారు. ఒంగోలు రీజియన్ పరిధిలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. స్థానిక భాగ్యనగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ శాఖను గుంటూరు పరిపాలనా కార్యాలయం డిప్యూటీ జీఎం క్రిష్ణకుమార్ బి.ప్రభు, ఒంగోలు ఆర్ఎం ఎస్.గున్నేశ్వరరావు, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ వీసీ డీవీఆర్.మూర్తిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం శైలేష్‌కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులను సైబర్ మోసాలపై నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.వెంకట్రావు, భాగ్యనగర్ శాఖ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్లు కె.హారతి, ఎల్‌వీవీ.నాగేశ్వరరావు, వేదం రాజేష్‌బాబు, హెచ్ఆర్ మేనేజర్ నళినీకాంత్, ఆర్‌వోబీ సూపర్‌వైజింగ్ చానల్ మేనేజర్ జానకిరామయ్య, వి.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, గుంటూరు మాడ్యూల్, కేఆర్‌వీ.విజయకుమార్, పి..వెంకటరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రకేసరి యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో జీఎం శైలేష్‌కుమార్ ఎస్‌బీఐ సామాజిక కార్యక్రమాల్లో కూడా తమవంతు సహకారం అందిస్తుందని తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద బొలేరో వాహనాన్ని యూనివర్సిటీకి ఆయన అందజేశారు. కార్యక్రమంలో వీసీ మూర్తి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

మద్దిపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బాలల హక్కుల కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి సూచించారు. బుధవారం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వంట గదులను పరిశీలించారు. అనాథలైన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయని, వెంటనే అటువంటి విద్యార్థుల జాబితా తమకు పంపాలని ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డిని ఆదేశించారు. అనంతరం భవిత పాఠశాలను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడి రికార్డుల్లో కొట్టివేతలు ఉండటం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. అనంతరం బీసీ, ఎస్సీ హాస్టల్స్‌ను సందర్శించారు. బీసీ హాస్టల్ పూర్తిగా దెబ్బతిని ఉండటం, బాత్రూములకు తలుపులు లేకపోవడం గమనించి బీసీ వెల్ఫేర్ అధికారితో ఫోన్ చేశారు. వెంటనే హాస్టల్‌ను వేరే చోటికి తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీసీ చైర్మన్‌కు సత్కారం


నారాయణను అభినందిస్తున్న నాయకులు

చీమకుర్తి, డిసెంబరు 18 : చీమకుర్తి ఎన్ఎస్‌పీ మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన పాలడుగు వెంకటనారాయణను బుధవారం కూనంనేని వారిపాలెంకు చెందిన ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి నల్లూరి ఫౌండేషన్‌కు చేదోడు వాదోడుగా ఉంటూ రైతుల అభ్యున్నతికి తోడ్పడుతున్న నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కా శ్రీనివాసరావు, ఎంపీటీసీ వేమా అశ్విని, సెక్రటరీ శ్యామ్‌కుమార్, గ్రామపెద్దలు పుట్టా బ్రహ్మయ్య, గోరంట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లజోళ్ల పంపిణీ


విద్యార్థినులతో సంస్థ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ రమాదేవి

సింగరాయకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం టంగుటూరుకు చెందిన రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధర్యంలో 100 మంది విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి డాక్టర్ ధీరేంద్ర, ప్రిన్సిపాల్ కె.రమాదేవి, ఫౌండేషన్ ప్రతినిధి రావూరి తిరుమల రాధాకృష్ణ, వైద్యులు చంద్రశేఖర్, రాజకుమార్, చైతన్యకృష్ణ, సభ్యులు గోపి సాయికృష్ణ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

సంతనూతలపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏవో పావని తెలిపారు. బుధవారం మండలంలో ఎమ్.వేములపాడు, ఎనికపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్



వేడుకల్లో పాల్గొన్న వాణిజ్య పన్నులశాఖ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వాణిజ్య పన్నుల కార్యాలయంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పైనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అసిస్టెంట్ కమిషనర్ టి.సోమ సుందరప్రసాద్, డీసీటీవో ఎస్వీ.సుబ్బారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పాస్టర్ జాన్ శామ్యూల్‌సన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఏసీటీవోలు ఏలూరి కొండలరావు, జమీర్, ఉద్యోగుల పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో

ఒంగోలు కార్పొరేషన్: ఒంగోలులోని మెప్మా కార్యాలయంలో బుధవారం సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. పీడీ తేళ్ళ రవికుమార్ అధ్యక్షత వహించగా, జేఎంబీ చర్చి పాస్టర్ ఆషేర్ పాల్ వాక్యోపదేశం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ జాఫర్‌సాదిక్, జి.భారతి, డేవిడ్‌వినీల్, జయకుమార్, ఫణికుమారి పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు : స్థానిక విలియం కేరి తెలుగు బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపరిల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ గోన ఇస్సాకు, లాబాను, చిన్నకోటేశ్వరరావు, జయరావు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం


చీమకుర్తిలో విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

చీమకుర్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలో బుధవారం పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మద్రి లక్ష్మీనారాయణ అధ్యక్షతన పెన్షనర్లను సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా బండ్ల డేవిడ్, సుబ్బారావు, షేక్ అజాద్, నారాయణరావు, హరిప్రసాదరావు, గోపి, సోమయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక నటరాజ కళాకేంద్రం ఆవరణలో బుధవారం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.యల్లమంద అధ్యక్షతన సమావేశం జరిగింది. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు వి.పున్నయ్య, బి.అంకిరెడ్డి, ఎం.రామకృష్ణ, డాక్టర్ కె.సుబ్బారావు, పి.పేరయ్య తదితరులు హాజరయ్యారు. అనంతరం బాపట్ల వెంకటేశ్వర్లు, మాచవరపు సీతారామయ్య, షేక్ ప్యారీ బేగం, ఎస్.గురుబ్రహ్మం, ఎం.జయమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, కోశాధికారి జి.కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, కలాం మాస్టర్ పాల్గొన్నారు.

పొగాకు తోటల పరిశీలన

కొండపి, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కొండపి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, పొగాకు కంపెనీల ప్రతినిధులతో కలిసి బుధవారం ఇలవర(నేతివారిపాలెం)లో పొగతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులు పలు సూచనలు చేశారు.

నేటి నుంచి శిక్షణ : డీఈవో

ఒంగోలు విద్య, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఫండమెంటల్ లిటరసి, న్యూమరసీలో భాగంగా జిల్లాలోని రిసోర్స్‌పర్సన్లకు ఈనెల 19నుంచి మూడు రోజుల పాటు ఒంగోలు, మార్కాపురంలో శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు కేటాయించిన డీఆర్‌పీలు, కేఆర్‌పీలకు వెన్యూ వారీగా ఉత్తర్వులు జారీ చేశామని, ప్రతిరోజు ఉదయం 8గంటలకు శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. శిక్షణకు కేటాయించిన వారిని సంబంధిత ఎంఈవోలు విధుల నుంచి విడుదల చేయాలని ఆయన కోరారు.

పారదర్శకంగా సర్వే చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యాపార దుకాణాల వివరాలతో కూడిన మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సర్వే (ఎంఎంఎస్ఎం)ను పారదర్శకంగా నిర్వహించాలని డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలో జరుగుతున్న ఎంఎంఎస్ఎం సర్వేను బుధవారం డీఎల్‌డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణంనకు సంబంధించిన అన్ని వివరాలు సమగ్రంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. దుకాణాల అనుమతులు, పంచాయతీలకు పన్నుల చెల్లింపులు, విద్యుత్ మీటర్లు, దుకాణదారుల సమస్యలు తదితర పది రకాల వివరాలను సర్వే నివేదికలో పొందుపరచాలని చెప్పారు. సర్వే విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు : జేడీఏ


అవగాహన కల్పిస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై ఉచితంగా అందిస్తున్న బహువార్షిక పశుగ్రాసాలను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ బేబీరాణి సూచించారు. అమ్మనబ్రోలులోని పశు వైద్యశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. పశుపోషకులతో శివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. బహువార్షిక పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. పశువులకు సీజనల్ వ్యాధులు, పరిష్కార మార్గాలను వివరించారు. మినీ గోకులం షెడ్లు, గడ్డికోత యంత్రాన్ని, పశుగణనను పరిశీలించారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై ట్రూఅప్ చార్జీల పేరుతో పెంచిన భారాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎనిమిదవ డివిజన్‌లోని మునిసిపల్ వర్కర్స్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్‌చార్జీల పేరుతో వేల రూపాయాలు కరెంటు చార్జీలు పెంచుతున్నారని ఆరోపించారు. ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని, గత విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత సీఎం జగన్మోహన్‌రెడ్డి, అదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బుట్టి రామయ్య, దివ్య, శిరోమణి, కె.మరియమ్మ, కె.యాకోబు, కె.రవి, నాగమ్మ, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో విజయం సాధించి ఈనెల 19వతేదీ నుంచి నెల్లూరులో జరిగే బధిరుల జోనల్ స్థాయి టీం-20 క్రికెట్‌పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం క్రీడాకారులకు అవసరమైన ఆట వస్తువులు, టీ షర్టులను క్రీడా ప్రాధికార సంస్థ తరుపున అందజేశారు. జోనల్ స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనపర్చాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

నాగులుప్పలపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న పోలీసు సిబ్బందిని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ బి.శ్రీకాంత్ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు ఎల్లప్పుడూ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'పెనుగొండ'కు అభినందన

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం(అరసం) అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం పట్ల జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు. ఆయన రాసిన దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి ఈ అవార్డు లభించింది. లక్ష్మీనారాయణకు మన జిల్లా సాహిత్యరంగంతో ఎంతో అనుబంధం ఉందని అటువంటి వ్యక్తికి జాతీయ స్థాయి పురస్కారం లభించటం ఎంతో ఆనందంగా ఉందని నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ, డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మద్దిపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి దాడి చేశారనే ఫిర్యాదుతో వెలుగోటి కళ్యాణ్‌పై మద్దిపాడు పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరామయ్య తెలిపిన వివరాల ప్రకారం, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లోని దాస్ దాబా దగ్గర మార్పు వెంకటేశ్వర్లు టీకొట్టు నడుపుకుంటున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లు బాకీ డబ్బులు ఇవ్వకుండా తన తండ్రిని ఇబ్బంది పెడుతుండగా వెలుగోటి కళ్యాణ్ ప్రశ్నించాడు. అంతేగాకుండా తన స్నేహితులతో కలిసి వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. దీంతో గాయపడిన వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

● జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్

సింగరాయకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ విజయ, ఎక్సైజ్ సీఐ శివకుమారికి సూచించారు. బుధవారం సింగరాయకొండలోని ఎక్సైజ్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. కాపొండబుల్ కేసులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జనార్దన్ పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

చిలకపాడు హైస్కూల్ తనిఖీ


తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

సంతనూతలపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చిలకపాడు జడ్పీహైస్కూల్, ఎంపీయూపీ స్కూల్‌ను బుధవారం డీఈవో కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-1పరీక్షలను పరిశీలించారు. ఎంపీయూపీ స్కూల్‌లో 22 మందికి 11 మంది మాత్రమే మధ్యాహ్నభోజనం చేయడం, బియ్యం 16 కేజీలు ఎక్కువ ఉండటాన్ని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాలలో రికార్డుల విషయంలో అశ్రద్ధగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రతీ విద్యార్థి యూనిఫాంతో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఇసుక టిప్పర్‌కు జరిమానా

పొదిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి ఇసుక తీసుకెళుతున్న టిప్పర్‌కు దర్శి ఆర్‌టీవో రవికుమార్ బుధవారం జరిమానా విధించారు. ఆర్‌టీవో రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం, నెల్లూరు నుంచి 43 టన్నుల ఇసుకలోడుతో వస్తున్న టిప్పర్‌ను మంగళవారం తెల్లవారు జామున పొదిలి పోలీసులు గుర్తించారు. టిప్పరును ఆపి డ్రైవర్‌ను వివరాలు ఆరాతీయగా ఇసుకకు సంబంధించిన పత్రాలు ఏమి లేకపోవడంతో సమాచారం తెలిపినట్లు చెప్పారు. అంతేకాకుండా 28 టన్నులు మాత్రమే అనుమతి ఉందని అదనంగా 15 టన్నులు ఉండటంతో రూ.55 వేల జరిమానా విధించినట్లు ఆర్‌టీవో తెలిపారు.

నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి

● 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు మండలంలో బుధవారం విస్తృత దాడులు నిర్వహించారు. ఆ శాఖ మార్కాపురం సీఐ ఎం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా కొత్తూరు గ్రామ సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలను గుర్తించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్ద పీఆర్‌సీ తాండా సమీపంలో..

పుల్లలచెరువు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. బుధవారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెద్దపీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో బట్టీలపై దాడులు చేశారు. సారా కోసం నిల్వ వుంచిన 300 వందల లీటర్ల బెల్లం వూటను ధ్వంసం చేశారు.దాడుల్లో ఎక్సైజ్ సీఐ సిహెచ్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బైకును ఢీ కొన్న కారు, వ్యక్తి మృతి


మృతి చెందిన రొడ్డ గంగరాజు

త్రిపురాంతకం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బైకు-కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మేడపి వద్ద జాతీయ రహదారి 544డీపై బుధవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముడివేముల గ్రామానికి చెందిన రొడ్డ గంగరాజు(32) త్రిపురాంతకం నుంచి ముడివేములకు బైకుపై వెళుతున్నాడు. వినుకొండ నుండి త్రిపురాంతకం వైపు వస్తున్న కారు మేడపి వద్ద బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గంగరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గంగరాజు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివబసవరాజు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వ్యవసాయాధికారులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమీక్ష


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ లతో గిద్దలూరు నియోజకవర్గంలో రైతులకు జరిగిన పంటనష్టంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఏ ఏ మండలాలో ఎంతవరకు పంటనష్టం జరిగింది, ఏఏ పంటలు నీట మునిగాయని అధి కారులను అడిగారు. ప్రతి గ్రామంలో పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి పంట దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం బాధ్యతని పేర్కొన్నారు. గ్రామాల్లోని రైతులకు వ్యవసా యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియ చేస్తూ వారికి లబ్ధి అందేలా చూడాలన్నారు. అధిక దిగుబడులు వచ్చే పంటలను సాగు చేసుకునేలా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, వ్యవసాధికారులు విజయభాస్కర్‌రెడ్డి, రఫిక్, మెర్సీ స్వరూపా, మొహమ్మద్, రాజశ్రీ, విష్ణుప్రియ, శ్వేత, మహబూబ్‌భాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం

● రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ● అక్రమ ఆన్‌లైన్‌పై సదస్సుల్లో పలు ఫిర్యాదులు


దరిమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి). ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకే కూటమి ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. దరిమడుగు గ్రామంలో వైసీపీ నాయకుల భూకబ్జాలకు చాలామంది తమ భూములను కోల్పోయారని ఇటువంటి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ ప్రజలకు ఎవరికైనా భూ సమస్యలు ఉంటే వినతుల రూపంలో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు : మండలంలోని రాజుపాలెం రెవెన్యూలోని భూములను కాజేసేందుకు కొందరు బినామీ పేర్లతో మార్చుకున్నారని వాటిపై సమగ్రమైన విచారణ చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమ ఆన్‌లైన్లను అధికారులు పరిశీలించాల న్నారు. అక్రమాలకు పాల్పడ్డవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేయాలన్నారు. ముఖ్యంగా రైతుల పొలాలను ఆన్‌లైన్ నుంచి ఎందుకు తొలగిస్తున్నారు, మరలా రైతుల నుంచి రూ.2 వేల నుంచి రూ.10వేలు డబ్బులు ఎందుకు డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. లంచం తీసుకుని ఎందుకు ఆన్‌లైన్ చేస్తున్నారో తెలి యాల్సి ఉందన్నారు. రెడ్ మార్కు ఎందుకు పడుతుందో తహసీల్దార్ గమనించి వెంటనే రెడ్‌మార్కు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా అర్హత ఉన్నవారు రేషన్‌కార్డులకు, గృహాలకు, పింఛన్లకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో గృహం నిర్మించుకునేందుకు రూ.2.5 లక్షలను ఇస్తుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి ప్రభు త్వం కొమరోలు మండలంలో రూ.2.5కోట్లు నిధులను మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఈ గ్రామ పంచాయతీకి రూ.30 లక్షల నిధులు మంజూరు చేశార న్నారు. స్థానిక టీడీపీ నాయకులు గోడి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సమావేశంలో ఇచ్చిన అర్జీలను మళ్లీ మళ్లీ తిప్పుకోకుండా సత్వరమే పూర్తిచేయాల న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల నాయకులు బోనేని వెంకటేశ్వర్లు, నాయకులు పోస్టు మాబు, దాదా భాష, తోటా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, షేక్ ఖాజాపీరా, శీలం ప్రభాకర్‌రెడ్డి, సుబ్బయ్య, చలిచీమల శ్రీనివాసచౌదరి,, నాగేశ్వరరెడ్డి, బద్రి లక్ష్మీరంగారెడ్డిలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

తర్లుపాడు : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్న తహశీల్దార్ విజయ్ భాస్కర్ అన్నారు. మండంలంలోని కలుజ్వలపాడులో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూసమస్యలపై 21 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. గతంలో ఆన్‌లైన్‌లో ఉండి గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా భూ ఆక్రమణలు చేసుకున్న అర్జీలకు ప్రస్తుతం అర్జీలు ఇస్తే 45 రోజుల్లోపు పరిష్కారం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మనోహర్, వీఆర్‌ఓ షరీఫ్, గ్రామ సహాయకులు సర్వేయర్లు, వీర్‌ఓలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన


యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులుగా చట్టాలపై ప్రజలు అవగాహన పొందడం ద్వారా మోసాలు జయించవచ్చని పౌరసరఫరాల విభాగం డీటీ కె.అర్జున్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల వారోత్సవ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి నిజజీవితంలో మోసాలతో స్వారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మోసాలను అరికట్టేందుకు వినియోగదారుల చట్టాలు ఉన్నాయన్నారు. యర్రగొండపాలెం డీటీ రాధాకృష్ణ మాట్లాడుతూ.. ముఖ విలువ పదిరూపాయలు దాటిన ప్రతి వస్తువుకు రసీదు ఇవ్వాలన్నారు. తూనికల, కొలతల శాఖ అధికారి మొహసింగ్ మాట్లాడుతూ వాణిజ్య రంగంలో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండేందుకు వినియోగదారులు తీసుకోవాల్సిన మెళకువలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం గౌరవ అధ్యక్షులు ఓఎ మల్లిక్, ఫోరం జిల్లా బాధ్యులు నరసింహులు, ప్రిన్సిపాల్ డా.కప్పగంతుల మధుసూధన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ స్వాతి, కళాశాల టీపీవో పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు యువతతో వినియోగదారుల చట్ట ప్రతిజ్ఞ చేయించారు.

ఆలయ అభివృద్ధిలో సభ్యులు ముఖ్యపాత్ర పోషించాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధిలో రథసప్తమి కమిటీ సభ్యులు ముఖ్యపాత్ర పోషించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం రథసప్తమి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెన్నకేశవస్వామి ఆలయంలో సంక్రాంతి, ముక్కోటి ఏకాదశి, రథసప్తమి వేడుకలకు సభ్యులందరూ కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఆలయంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయాభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు ఎల్లవేళలా అందిస్తానన్నారు. అనంతరం రథసప్తమి నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గౌరవ సలహాదారులుగా వక్కలగడ్డ మల్లికార్జునరావు, తాళ్లపల్లి సత్యనారాయణ, అధ్యక్షుడిగా యక్కలి కాశీవిశ్వనాథం, కార్యదర్శిగా ఆలంపల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా బొంతల వెంకట సుధీర్ కుమార్, మరో 41 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. బుధవారం శ్రీలక్ష్మీ చెన్నకేశస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించిన సమయంలో ఉద్యోగులు తమ సమస్యపై వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో పదేళ్లకు పైబడి అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేస్తున్నామన్నారు. అందరినీ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా మార్పు చేయించాలన్నారు. దేశంలో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ వ్యవస్థ ఎక్కడా లేదన్నారు. తాము రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ జీతాలు పెంచలేదన్నారు. కార్యక్రమంలో గిరిజన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బ్రహ్మానాయక్, ఉపాధ్యాయులు రాజశేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతల డిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న పెద్దిరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న ఓ గుమస్తా అవినీతికి పాల్పడుతున్నందున చర్యలు తీసుకోవాలని కనిగిరి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టి.పెద్దిరెడ్డి, కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. హనుమంతునిపాడు మండలం సీతారామపురం గ్రామంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌గా పనిచేసిన బీవీ చెన్నయ్య ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఆ తర్వాత చెన్నయ్య మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లు కోసం జూలై 4న డిప్యూటీ డైరెక్టర్‌కు అర్జీ ఇచ్చారన్నారు. దానిని 9న డీడీ ఆమోదించారన్నారు. ఆ బిల్లును జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి పంపాలని గుమస్తా పి.ఇజాజ్ అహ్మద్‌ఖాన్‌ను ఆదేశించారన్నారు. కానీ బిల్లును గుమస్తా పంపకుండా అర్జీదారుడు చెన్నయ్యను డబ్బులు డిమాండ్ చేశారన్నారు. తనకు తగినంత డబ్బు ముట్టజెప్తే బిల్లును పంపుతానని చెప్పాడ న్నారు. అయితే నగదు ఇవ్వకపోడంతో నాలుగు నెలల తర్వాత బిల్లు వెనక్కు వచ్చిందన్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా నేటికీ ఎలాంటి స్పందనలేదన్నారు. రిటైర్ అయిన ఉద్యోగులను ఇలా వేధించడం సరికాదన్నారు. అవినీతి గుమస్తాపై చర్యలు తీసుకుని మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లును మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్, పాస్టర్లు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీసస్‌లవ్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక డ్వాక్రాబజార్‌లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ పాల్గొని క్రిస్మస్ కేక్‌కట్ చేశారు. జేఎల్‌ఎం-2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ మునియప్ప క్రిస్మస్ సందేశం అందించారు. జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ఫౌండర్ బిషప్ డాక్టర్ గుర్రం శేఖర్, 400 మంది పేదలు, దివ్యాంగులు, పాస్టర్లకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో సునీతా రూత్, విజయ్ కుమార్, ఏసన్న, దిలీప్ కుమార్, విలియంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐని అభినందించిన ఎస్పీ


ప్రశంసపత్రం అందజేస్తున్న ఎస్పీ

గిద్దలూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొంటూ ప్రజల మన్ననలు పొందుతున్న గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్‌ను జిల్లా ఎస్పీ దామోదర్ అభినందించారు. ఆ మేరకు అర్బన్ సీఐ సురేష్‌కు ప్రశంసపత్రం అందచేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని ట్రాఫిక్ సమస్యను సీఐ పరిష్కరించడంలో చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఫ్రెండ్లీ పోలీసుగా పేరు తెచ్చుకున్న సీఐ సురేష్‌కు ఆయన ప్రశంసపత్రాన్ని అందజేశారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం


కాలనీలో పర్యటిస్తున్న శివప్రసాద్

గిద్దలూరు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దిగువమెట్ట గ్రామంలోని చెంచుకాలనీని బుధవారం ఐటీడీఏ పీవో కె.వెంకటశివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన చెంచుకాలనీ లో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు పలు వినతిపత్రాలు అందించారు. కాలనీలోని ప్రభుత్వ గిరిజన పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం గురించి, వారికి అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.రంగస్వామి, తదితరులు ఉన్నారు.

వీధిలైట్లు వెలగక ఇక్కట్లు

గిద్దలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివార్లలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి అటు కొండపేట వెళ్లే రోడ్డులో, ఇటు పాములపల్లి వెళ్లే రోడ్డులో వీధిలైట్లు సక్రమంగా వెలుగక పోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. రెండువారాలుగా ఈ రూట్లలో వీధిలైట్లు వెలుగడం లేదని సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత వాసులు విమర్శిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం ఎక్కువగా వేస్తుండడం, ముళ్లకంపలు ఉండడంతో తరచూ విషసర్పాలు రోడ్డుపైకి వస్తున్నాయన్నారు. అండర్ బ్రిడ్జి సమీపంలో చిమ్మచీకటిగా ఉండడంతో అటువైపు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వెంటనే వీధిలైట్లు మరమ్మతులు చేయించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఈ- క్రాప్ నమోదుతో రైతులకు మేలు


రైతులకు సూచనలిస్తున్న ఏవో రాజశ్రీ

కొమరోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయుంచుకోవాలని ఏవో రాజశ్రీ అన్నారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరుగాలం కష్టపడి సాగుచేస్తున్న పంటలకు నష్టం కలిగితే ప్రభుత్వం నుంచి గాని, బీమాకంపెనీల నుంచి గాని నష్టపరిహారం అందుతుందన్నారు. అకాల వర్షాలకు, అనావృష్టి, అతివృష్టి సమయాల్లో రైతులు నష్టపోకుండా ఉంటార న్నారు. సేంద్రియ ఏరువులతోనే పంటలను సాగుచేసుకోవాలన్నారు.

నల్లనల్లి నివారణకు సూచనలు

గిద్దలూరు : గిద్దలూరు ప్రాంతంలో సాగులో ఉన్న మిరపకు నల్లనల్లి, తామర పురుగు ఉధృతి కనిపిస్తున్నందున నివారణ కోసం పురుగు మందులు పిచికారి చేసి పంటలను కాపాడుకోవాలని ఉద్యాన శాఖాధికారిని విష్ణుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొపర్గైట్, స్పైరోమెసిఫెన్ పురుగు మందులను నల్లనల్లి, తామర పురుగు నివారణ కోసం పిచికారి చేసుకోవాలని సూచించారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గిద్దలూరు టౌన్ : పప్పుశనగ పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగర పంచాయతీలోని పాములపల్లె, కొత్తపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో బృందం ఆయా గ్రామాలలో పంటలను పరిశీలించారు. అక్కడక్కడా శనగ పచ్చపురుగు ఉండడంతో నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, సూక్ష్మనీటి యాజమాన్య ఏరియా ఆఫీసర్ మోహన్‌కృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● ఎంపీపీ గుమ్మా పద్మజ

పెద్దదోర్నాల, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గుమ్మా పద్మజ అన్నారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గుమ్మా పద్మజ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, ఏపీవో కే.వినయ్, ఏపీఎం పోలయ్య, ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ డిమాండ్

మార్కాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వాచ్‌మెన్‌లకు జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ జూలై నుంచి వేతనాలు చెల్లించకుండా కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందన్నారు. వారికి చెల్లించే రూ.6 వేల అతి తక్కువ వేతనమన్నారు. చాలీచాలనీ వేతనాలకు పనిచేస్తున్నా అవికూడా సకాలంలో చెల్లించడం లేదన్నారు. దీంతో కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులుగా పేద, బడుగు, బలహీనవర్గాల వారే పనిచేస్తుంటారని అన్నారు. వారికి కనీస వేతన చట్టానికి అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను వెంటనే చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో ఏవో రవీంద్రారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి.రూబెన్, జి.నాగరాజు, శానిటేషన్ యూనియన్ నాయకులు లక్ష్మీ, చంద్రకళ, మహాలక్ష్మి, కళావతి, రామలక్ష్మి, వాచ్‌మెన్ యూనియన్ నాయకులు యాకోబు, రాజశేఖర్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


విద్యుత్ దీపాలతో ఏబీఎం చర్చి

చర్చిలలో సెమీ క్రిస్మస్ సందడి

దొనకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రధాన చర్చిలను శోభాయమానంగా అలంకరించారు. దొనకొండలోని ఏబీఎం, ఆర్సీఎం, సీఎస్ఐ, లూథరన్ చర్చిలను ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. గ్రామాల్లో క్రైస్తవుల కుటుంబాల వద్ద, ప్రధాన కూడళ్లల్లో భారీ నక్షత్రాలు ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో క్రిస్మస్ సామగ్రి విక్రయాలతో దుకాణాలు కళకళలాడుతూ కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

10 అడుగులకు చేరువలో మోపాడు రిజర్వాయర్ నీటి మట్టం


పది అడుగులకు చేరినట్లు చూపుతున్న నీటి మట్టం

పామూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడు రిజర్వాయర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు 10 అడుగుల మేర నీటి మట్టం చేరింది. గతంలో 7 అడుగుల నీటి మట్టం ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు 3 అడుగుల నీటి మట్టం చేరింది. దాంతో మొత్తం 10 అడుగుల నీటి మట్టం నమోదైంది. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలో మెట్ట పంటలు సాగులో ఉన్నాయి. రిజర్వాయర్‌లో కనీసం 15 అడుగులు నీరు చేరితే వరి పంట సాగుకు ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇవ్వనున్నట్లు ఆయకట్టు రైతులు తెలుపుతున్నారు.


విద్యార్థులకు ప్రశ్నపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు మోడల్ ప్రశ్నపత్రాలు

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దాత కొమ్మినేని మురళి, పిడతల శ్రీ కాంత్ సహకారంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పదవతరగతి మోడల్ ప్రశ్నపత్రాలను బుధవారం అందచేసినట్లు యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు నిరివెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషా తెలిపారు. మండలంలోని శీలంవారిపల్లి, నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 67 మంది పేద విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను యూటీఎఫ్ తరుపున అభినందించారు.

21న రక్తదానం,చీరల పంపిణీ

కనిగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మజీ ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఈనెల 21న ఊరూరా ఘనంగా నిర్వహిద్దామని మాజీ జడ్పీటీసీ, వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమాన్ని అందించిన జగన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా 4వేల మంది మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, వివిధ మండలాల అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చకచకా హైవే పనులు

- నీటిని మళ్లించి చెరువులో భారీ పిల్లర్ల నిర్మాణం

కనిగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో అనతి కాలంలోనే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది. ఇటీవల కురిసిన వర్షాలకు 20ఏళ్ల తర్వాత కనిగిరి పెద్ద చెరువులోకి భారీగా నీరు చేరుకుంది. గత కొంతకాలంగా బైపాస్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. చెరువులోకి వరద నీరు చేరుకోవటంతో పనులకు ఆటంకం ఏర్పడుతుందనుకున్న ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తీసుకున్న చొరవతో హైవే పిల్లర్ల నిర్మాణానికి కాంట్రాక్టర్ చకచకా పనులు చేపడుతున్నారు. చెరువులో ఇప్పటికే చేపట్టిన కాంక్రీట్ పనులు పూర్తిగా నిరుపయోగమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చేపట్టిన పనులకు జరిగిన నష్టానికి పరోక్షంగా మేలు చేకూర్చే విధంగా ప్రభుత్వం నుంచి సహకారం లభించే విధంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో హైవే రోడ్డు కాంట్రాక్టరు చెరువులో నీటిని ప్రత్యేక యంత్రాలతో మళ్లించి పిల్లర్ల పనులకు ఆటంకం లేకుండా చుట్టూ రిటర్నింగ్ గట్టు వేయించే పనులు చేపడుతున్నారు. దీంతో రెండు రోజుల్లో చెరువులో హైవే కోసం వేయాల్సిన భారీ పిల్లర్ల నిర్మాణం కూడా జరుగనుంది. ఇప్పటికే కాశిరెడ్డికాలనీ నుంచి రోడ్డు వైడనింగ్ పనులు చేపడుతుండగా, ఆయా పనులు పూర్తయి రోడ్డు చెరువు వద్దకు వచ్చే సరికి హైవే కోసం పిల్లర్ల నిర్మాణం పూర్తి కావచ్చని కాంట్రాక్టర్, ఆయా సిబ్బంది తెలియచేస్తున్నారు. దీంతో అనతి కాలంలోనే హైవే కూడా పూర్తి కానుంది. సమర్థవంతమైన పాలకులు ఉంటే అభివృద్ధి పనులు ఎంత పరుగులు పెడతాయో ఈ సంఘటనే ఉదాహరణగా నిలుస్తుంది. అటు కాంట్రాక్టర్‌కు నష్టం కలుగకుండా, ప్రజలకు చెప్పిన కాలానికి పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చూపిన చొరవకు కాంట్రాక్టర్‌తో పాటు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.


చెరువులో ప్రత్యేక యంత్రాలతో నిర్మాణం చేయబోయే పిల్లర్ల చుట్టూ వేస్తున్న కట్ట

పెండింగ్ సమస్యలకు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం

దర్శి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని దర్శి తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని సామంతపూడి, నిమ్మారెడ్డిపాలెం, త్రిపురసుందరీపురం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గుర్తించి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. భూములు, స్థలాల సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు దాఖలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దర్శి మండలం సామంతపూడి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



ముండ్లమూరు మండలం నూజెండ్లపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

ముండ్లమూరులో 18 అర్జీలు

ముండ్లమూరు : పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించటం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని నూజెండ్లపల్లిలో రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ స్రవంతి, మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వోలు సుజాత, రాఘవరెడ్డి, గురవయ్య తదితరులు ఉన్నారు. కాగా ఈ సదస్సులో 18 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

బోదనంపాడు రెవెన్యూ గ్రామ సభలో 12 అర్జీలు

కురిచేడు : మండలంలోని బోదనంపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ తహసీల్దార్ రజనీ కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ గ్రామసభలో 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

తాళ్లూరులో..

తాళ్లూరు : రెవెన్యూ సంబంధ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ కె.సంజీవరావు తెలిపారు. మండలంలోని లక్కవరం గ్రామసచివాలయం వద్ద బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సమస్యలు ఉంటే దరఖాస్తుల రూపంలో అందజేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్‌వో నాగలక్ష్మి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరితగతిన భూ సమస్యలకు పరిష్కారం

పామూరు : గ్రామాల్లో రైతులకు చెందిన భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని మోపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాడి మాట్లాడుతు గ్రామ సభల ద్వారా రైతు సమస్యలను పరిష్కారానికి రెవెన్యూ అధికారులు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సదస్సులో మ్యూటేషన్, ఆన్‌లైన్ కోసం 42 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ బి. మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, ఎండోమెంట్ ఈవో నరసింహబాబు, వీఆర్వో రామాంజనేయులుతో పాటు టీడీపీ రాష్ట్రకమిటీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, కంభాలదిన్నె, మోపాడు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మన్నం రమణయ్య, ఎం. గిడ్డయ్య యాదవ్, నీటి సంఘం అధ్యక్షులు చుంచు కొండయ్య పాల్గొన్నారు.


పామూరు మండలం మోపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న పువ్వాడి

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా ఏపీవో నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో నాలుగు లక్షల మందికి పని కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రధానంగా ఇటీవల జరిగిన గ్రామ సభల్లో తీర్మానించిన పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి

● మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలోని చివరి భూములకు సాగర్ జలాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని మోదేపల్లి మేజరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం ముండ్లమూరు ఎన్ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ మేజరు పరిధిలో ఆయకట్టు పరిధిలోని ప్రతి రైతు భూమికి నీరు అందించటమే తన బాధ్యత అని అన్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత ఎన్ఎస్పీ అధికారులతో మాట్లాడి చివరి భూములు ఎండకుండా చూస్తానన్నారు. కాలువల్లో పేరుకు పోయిన చిల్ల చెట్లను తక్షణమే తొలగించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్‌ల సహకారంతో మోదేపల్లి మేజరు పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండకుండా చూస్తానని, త్వరలో కాలువలపై పర్యటిస్తానని ఆయన తెలిపారు.



శిక్షణ పూర్తి చేసుకొన్న సచివాలయ సిబ్బందితో అధికారులు

సచివాలయ సిబ్బందికి శిక్షణ పూర్తి

పామూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల స్థాయి సిబ్బందికి రెండు రోజులుగా జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఇచ్చిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. డిజిటల్ అసిస్టెంట్లకు, వ్యవసాయ సహాయకులకు, ఏఎన్ఎంలకు, పశుసంవర్థక సహాయకులకు, సర్వే అసిస్టెంట్లకు, వీఆర్వోలకు, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, కార్యాలయ పరిపాలన అధికారి ఎస్. చెన్నకేశవరెడ్డి, ఏవో కే రాధ, హెచ్‌వో కె. కుసుమ, ఏపీవో బి. మాల్యాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వై. రమేష్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు పాల్గొన్నారు.

రజిత తోరణం నిర్మాణానికి విరాళం

పామూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవీ కన్యాకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి గర్భ గుడి వాకిలికి రజిత తోరణం నిర్మాణానికి పందిటి సతీష్ దంపతులు రూ. 11,116ల విరాళాన్ని అందజేశారు. బుధవారం దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ యేల్చూరి బాల కొండలరావుకు విరాళానికి సంబంధించిన నగదును అందించారు.


విరాళం అందజేస్తున్నసతీష్ దంపతులు

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

● ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి పంచాయతీ సర్పంచ్, ఆ గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులను సకాలంలో గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రధానంగా తాగు నీరు, పారిశుధ్యం అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. శిక్షణలో సిబ్బంది గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత, సూపరింటెండెంట్ కల్పన, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాల సాగుతో తెగుళ్ల నివారణ

తాళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొత్తవంగడాల సాగుతో తెగుళ్లను అరికట్టేందుకు రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. మండలంలోని వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఎడతెరపి లేకుండా వర్షాలకు లేత పైర్లు, నారుమడులలలో చేపట్టాల్సిన చర్యల గురించి, వరిని ఆశించి ఉన్న తెగుళ్ల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో దర్శి ఏపీఎం కె.రామిరెడ్డి, వీఏఏలు సుష్మ సుల్తానా, అజ్మీన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

దొనకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ బాలుర, బాలికల జిల్లా జట్ల ఎంపిక స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు తెలిపారు. ఈ మేరకు జిల్లా నెట్‌బాల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. కృష్ణారెడ్డి, ఐపీ రాజు సూచించినట్లు తెలిపారు. ఈ ఎంపికకు వచ్చే విద్యార్థులు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 21, 22 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారని ఆయన వివరించారు.

నూతన కార్యవర్గం

దర్శి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గ రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ప్రస్తుత అధ్యక్షుడు ఆర్. వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి. వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బి. నాసరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామారావు, కోశాధికారిగా జీవీ రత్తయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఆర్ వెంకటరెడ్డి ఎన్నికయ్యారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు : జేడీఏ

నాగులుప్పలపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై ఉచితంగా అందిస్తున్న బహువార్షిక పశుగ్రాసాలను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ బేబీరాణి సూచించారు. అమ్మనబ్రోలులోని పశువైద్యశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. పశుపోషకులతో శివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. బహువార్షిక పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో విజయం సాధించి ఈనెల 19వతేదీ నుంచి నెల్లూరులో జరిగే బధిరుల జోనల్ స్థాయి టీం-20 క్రికెట్‌పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం క్రీడాకారులకు అవసరమైన ఆట వస్తువులు, టీ షర్టులను క్రీడా ప్రాధికార సంస్థ తరుపున అందజేశారు.


రోటరీ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న క్లబ్ గవర్నర్ శరత్‌చౌదరి

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

దర్శి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోయతి) : మండలంలోని తూర్పుచౌటపాలెంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్‌వో ప్లాంట్‌ను రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నట్లు చెప్పారు. దర్శి క్లబ్ అందిస్తున్న సేవలపట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దర్శి రోటరీ నాయకులు కేవీ రెడ్డి, ప్రాజెక్టు చైర్మన్ త్రిపురనేని మురళి, అసిస్టెంట్ గవర్నర్ రఫి, కోటేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేయాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యాపార దుకాణాల వివరాలతో కూడిన మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సర్వే(ఎంఎంఎస్ఎం)ను పారదర్శకంగా నిర్వహించాలని డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలో జరుగుతున్న ఎంఎంఎస్ఎం సర్వేను బుధవారం డీఎల్‌డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణంనకు సంబంధించిన అన్ని వివరాలు సమగ్రంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. దుకాణాల అనుమతులు, పంచాయతీలకు పన్నుల చెల్లింపులు, విద్యుత్ మీటర్లు, దుకాణదారుల సమస్యలు తదితర పది రకాల వివరాలను సర్వే నివేదికలో పొందుపరచాలని చెప్పారు. సర్వే విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




తెనాలి చంద్రబాబునాయుడు కాలనీలో రూ. 9.5 కోట్లతో నిర్మించాల్సిన యూనిట్‌కు తుప్పు


పాపినేని శివశంకర్‌తో పెనుగొండ లక్ష్మీనారాయణ(పాత చిత్రం)


పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులు


పాత చెరుకుంపాలెంలోని కుటుంబ సభ్యుల ఇల్లు

పెనుగొండ.. సాహితీకొండ



- సాహిత్యోద్యమంలో లక్ష్మీనారాయణది విశేషపాత్ర
- 200కుపైగా వ్యాసాలు.. 50కు పైగా కవిత, కథా, సంపుటిల రచన
- దీపిక వ్యాస సంపుటిని వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
- అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు


గుంటూరు(తూర్పు),నూజెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు 50 కవిత్వ, కథా, వ్యాస సంపుటాలకు ముందు మాట, పదుల పుస్తకాల సమీక్ష, 200 వ్యాసాలు, దాదాపు 600 సాహిత్య సభలు, సమావేశాలు, సదస్సులు.. మేడే నాడు కవితా గోష్ఠులు.. నిర్వహించి సాహితీ ప్రపంచంలో పెనుగొండ లక్ష్మీనారాయణ విశేష పాత్ర పోషించారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెంలో 1954 అక్టోబరు 24న జన్మించిన పెనుగొండ యాభై ఏళ్లుగా అభ్యుదయ సాహిత్యోద్యమంతో ప్రగాఢమైన సాన్నిహిత్యాన్ని పెంపొందించుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పులుపుల వెంకటశివయ్యను అనుసరిస్తూ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెనుదిరగక ముందుకు ప్రయాణించి సాహితీ ప్రపంచంలో అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్న పెనుగొండను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది.

సాహిత్యానికి సంబంధించిన అనేక చారిత్రాత్మక విశేషాలను తెలియజేసే ఎన్నో వ్యాసాలను రచించారు. ఒక పుస్తకాన్ని రాయడానికి ఎన్నో పుస్తకాలు పరిశీలించడం, తేదీలు, పుటలతో సహా ఆధారాలు చూపడం, వీలైనంత సమగ్ర సమాచారాన్ని ఇవ్వడం పెనుగొండ రచనాశైలి ప్రత్యేకత. కవి సమ్మేళనాలు సంక్రాంతి, ఉగాది పండుగల సందర్భాల్లో జరుగుతుంటాయి. అయితే ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదిస్తూ అంతర్జాతీయ శ్రామిక దినమైన మేడే నాడు కవితా గోష్ఠులను ఆయన నిర్వహించారు. అరసం, అవగాహన సామాజిక, సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో దాదాపు 15ఏళ్ల పాటు గుంటూరులో మేడే రోజున కవితా గోష్ఠులను నిర్వహించిన ఘనత పెనుగొండకే దక్కుతుంది. పెనుగొండ సంకలనకర్తగా 5 పుస్తకాలకు

(మిగతా 6వ పేజీలో)

దీపిక.. ప్రత్యేకత...

పెనుగొండ లక్ష్మీనారాయణ 2021లో రచించిన దీపిక వ్యాస సంపుటికకు ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు చేయగా పెనుగొండ రచించిన 'దీపిక' సంపుటికి అవార్డు దక్కింది. ఈ సంపుటిలో మొత్తం 36 వ్యాసాలు ఉన్నాయి. వీటిని 10 విభాగాలుగా విభజించారు. ఇందులో ప్రధానంగా పల్నాటి సీమ, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అరసం పాత్రను సాహిత్య చరిత్రను వివరించారు. ప్రపంచీకరణ-తెలుగు సాహిత్యం, తెలుగు సాహిత్య విమర్శ సాధికార విశ్లేషణలతో కూడిన అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలున్నాయి. కేంద్ర అవార్డుతో పాటు పలువురి విమర్శకుల నుంచి ప్రశంసలు పొందారు.



మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

పట్టణాలను వీడని మురుగు కంపు

పట్టణ జీవనం అంటే ఏమున్నది!... చెత్త కుప్పలు, ముక్కులు పగిలే మురుగు కంపు తప్ప.. ఇది ఇప్పటి వరకు ఎందరో కవులు, ప్రముఖులు చేసిన వర్ణనలు. అయితే అవేమీ ఇకపై కనిపించకూడదని, మురుగు నీటిని కూడా మంచినీరుగా మార్చేసి, సాగుకు, ఇతర అవసరాలకు ఉపయోగపడే విధంగా మార్పులు చెయ్యాలనేది కేంద్రం ఆలోచన. దీనికి తగ్గట్టుగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని పట్టణాలు, నగరాల్లో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించేందుకు రూ. వెయ్యి కోట్లకుపైగా నిధులను వివిధ దశల్లో మంజూరు చేసింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకున్న మున్సిపాలిటీలు కొన్నయితే, చాలా మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పట్టణాలను కమ్ముకున్న మురుగు కంపు మాత్రం వదలటంలేదు.

- రూ. 1014 ప్రాజెక్టుల్లో అడుగు పడని వైనం
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యం
- నిధులున్నా పనులు సున్నా
- ఆరేళ్లవుతున్నా ఇంకా స్థల సేకరణ దశలోనే
- ఒకటి రెండు చోట్లే పూర్తి... మిగిలినవి మొదలే లేదు

తెనాలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణాల దశ మార్చేందుకు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దీనివలన ప్రమాదకరమైన కలుషిత వ్యర్థ జలాలను శుద్ధిచేసి ఇతర అవసరాలకు ఉపయోగించవచ్చు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడితే, ఇది ప్రత్యామ్నాయంగా ఉపకరిస్తుందనేది కేంద్రం భావన, అయితే కేంద్రాల నిర్మాణం ఇంకా స్థల సేకరణ దశలోనే ఆగిపోయి ఉంది. తెనాలి, నరసరావుపేట, వంటి ఒకటి, రెండు మున్సిపాలిటీల్లో మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ. 1014 కోట్లతో స్థల సేకరణ, నిర్మాణాలు, నిర్వహణ పనులు చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల్లో రూ. 597.5 కోట్లతో, పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ. 254 కోట్ల ప్లాంట్‌లు, బాపట్ల జిల్లాలో రూ. 163 కోట్ల నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించాల్సి ఉంది. వీటిలో కొన్నింటికి ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, చాలా వాటికి ప్రయివేటు స్థలాలను కొనుగోలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో మొత్తం ప్రభుత్వ స్థలమే ఉన్నా, పనులు ముందుకు సాగకపోవటం విశేషం.

గత వైసీపీ సర్కారు నిర్వాకంతో...

కేంద్రం మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని గతంలోనే ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ సర్కారు మాత్రం వీటిపై దృష్టే పెట్టలేదు. చాలాచోట్ల స్థలాలు సేకరించాల్సి ఉన్నా, వారి నేతల ఆక్రమణలకే ప్రాధాన్యం (మిగతా 6వ పేజీలో)


తెనాలి పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాంట్


తెనాలిలో రూ. 28 కోట్లతో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్

1న పులిపాడుకు సీఎం చంద్రబాబు



పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు జనవరి 1న గురజాల నియోజకవర్గం పులిపాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం పులిపాడులో జరిగే గ్రామసభలో పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్యమంత్రి పర్యటన విషయాన్ని అధికారులకు తెలిపారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు జనవరి 1న పులిపాడులో ముఖ్యమంత్రి పర్యటించనున్నారన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

- జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష
- ఇటీవల సీఎం నిర్వహించిన సదస్సులోని అంశాలే అజెండా

బాపట్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల సచివాలయ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల సదస్సు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలే అజెండాగా కలెక్టర్ వెంకటమురళి బుధవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ వేదికగా సమీక్ష జరిపారు. దాదాపు ఏడుగంటల పాటు జరిగిన ఈ సమావేశంలో 12 విభాగాల పనితీరుపై ఆయన మదింపు జరిపారు. జిల్లాను ప్రగతిపథంలో నడిపించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో ఉంచేలా అందరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అధికారులంతా ఆ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వర్షాల హెచ్చరికల నేపథ్యంలో...

అల్పపీడన ప్రభావంతో రాబోయే రెండు, మూడు రోజులు జిల్లాకు వర్ష సూచన చేసిన నేపథ్యంలో అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. వరి కోతల విషయంలో రైతులకు అవగాహన కల్పించి వాయిదా వేసుకునేలా చూడాలన్నారు. తీరప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటిలో విస్తృతంగా మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ, డ్వామా విభాగాలు సమన్వయంతో వ్యవహరించి ఫలితాలు చూపెట్టాలన్నారు. పంటకాల్వల మరమ్మతులు నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

నదిలోనే రోడ్డు

ఇసుకాసురుల బరితెగింపు


అచ్చంపేట మండలం కోనూరు వద్ద నదిలో అక్రమంగా రోడ్డు వేసేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్లు


నదిలో అడ్డంగా వేసేందుకు సిద్ధం ఉంచిన సిమెంట్ తూములు

- అధికార పార్టీ నేతల చెరలో కృష్ణమ్మ
- అధికారం అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అడ్డగోలుగా తవ్వకాలు.. అధికారులకు బెదిరింపులు
- వైసీపీ నేతలకు మించి యథేచ్ఛగా టీడీపీ నేతల తవ్వకాలు
- విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు తేల్చినా తగ్గని అక్రమార్కులు


కోనూరు వద్ద కృష్ణానదిలో నదికి అడ్డంగా కిలో మీటరుకు పైగా వేసిన రోడ్డు


నదిని చీల్చుతూ అడ్డంగా ఉంచిన తూములు

అచ్చంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నదీ గర్భంలోని ఇసుక తవ్వి తీసుకురావాలంటే కష్టమనుకున్నారేమో.. ఏకంగా నదిలోనే రోడ్డు వేసుకుంటున్నారు. నది మధ్య వరకు వాహనాలను తీసుకెళ్లి ఇసుక తవ్వి తరలించుకునేందుకు అధికార పార్టీ నేతలు బరితెగించారు. ఇసుక జోలికి వెళ్ల వద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా నేతలు లక్ష్య పెట్టడంలేదు. నదీ ప్రవాహానికి అడ్డుగా రోడ్డు వేస్తున్నా అధికారులు అటు వైపు దృష్టి సారించడంలేదు. అధికారం మాది అడిగేదెవరు.. ఆపేదెవరు అన్న రీతిలో నేతలు రెచ్చిపోతున్నారు. అక్రమార్కులకు ఇద్దరు ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. నదిలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయడంలేదు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడంలేదు. నాడు వైసీపీ నేతలు ఇసుక అక్రమాలకు పాల్పడగా వారిని తీవ్రస్థాయిలో విమర్శించిన టీడీపీ నేతలు కొందరు అంతకు మించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వకాల్లో వైసీపీకి ఏమీ తీసిపోమని టీడీపీ నేతలు కొందరు నిరూపిస్తున్నారు. అచ్చంపేట మండలంలోని కోనూరు రీచ్‌లో కాంట్రాక్టర్లు బరితెగిస్తున్నారు. రేవు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని ఇసుకను కాజేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడ వరకు వెళ్లాలంటే నదికి రోడ్డు అడ్డంగా వేయాల్సి ఉంది. దీంతో నదిని చీల్చుతూ సుమారు కిలో మీటరున్నరకు పైగా రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి పెద్దసంఖ్యలో ఇసుక బస్తాలు, సిమెంట్ తూములు వినియోగించారు. నదికి

(మిగతా 6వ పేజీలో)

ఆ మున్సిపాల్టీలకు.. జూన్‌లో ఎన్నికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో గతంలో నిలిచిపోయిన మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎన్నికల నిర్వహణకు నెలకొన్న చిక్కులను పరిష్కరించి జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్నికల నిర్వహణపై మంత్రి నారాయణ బుధవారం స్పష్టత ఇచ్చారు. ఎన్నికలు జరగని కారణంగా మున్సిపాల్టీలు ఆర్థిక సంఘం నిధులను కోల్పోతున్నాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతుండటంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి కోర్టులో కేసులు నేపథ్యంలో గతంలో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించి ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది. మూడు మున్సిపాల్టీలు దాదాపు రూ.8.91 కోట్లను కోల్పోయాయి. ఆయా మున్సిపాల్టీలలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. అధికారం అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్ విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేన్న అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా బాధితులు కోర్టును ఆశ్రయించ డంతో నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరం రెండో విడత కింద నరసరా వుపేటకు రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీలకు రూ.1.96 కోట్లు విడుదల య్యాయి. మూడో విడత కూడా అదే స్థాయిలో నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎన్నికలు జరగని కారణంగా నరసరావుపేట రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీ రూ.1.96 కోట్లు నిధులు నిలిచిపోయాయి. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పట్టణాల్లో చాలా వరకు రహదారులు, కాల్వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం ఆయా మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది. ఈ క్రమంలో ఈ మున్సిపాల్టీలకు జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో మున్సిపాలిటీల ఆర్థిక వెతలు తీరతాయని చెప్పవచ్చు.

- స్పష్టత ఇచ్చిన మంత్రి నారాయణ
- నరసరావుపేట, బాపట్ల, పొన్నూరుల్లో నిలిచిన ఎన్నికలు
- ఆర్థిక సంఘం నిధులు కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం


బాపట్ల మున్సిపల్ కార్యాలయం

చినుకు.. వణుకు

- అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు
- వర్ష హెచ్చరికలతో ధాన్యం రైతుల పాట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం.. మేఘావృతమై ఉన్న ఆకాశం.. అక్కడక్కడ చిరుజల్లులు.. వాతావరణశాఖ వర్ష సూచనల మధ్య.. ధాన్యం రైతులు వణికిపోతున్నారు. చేతికొచ్చిన ధాన్యం కాపాడుకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. బుధవారం సాయంత్రం పలుప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సివచ్చింది. చేతికొచ్చిన పంట నేలపాలుతుందేమోనని అల్లాడిపోతున్నారు. ఇప్పటికే నూర్పిళ్లు పూర్తిచేసుకుని ఆరబెట్టుకున్న ధాన్యాన్ని రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలకు పొలం మీద ఉన్న పనలు తడిస్తే మొలకలు వస్తాయని, ధాన్యం రంగుమారుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కోసిన పంటను కుప్పలు వేస్తున్నారు. దాదాపు మొత్తం సాగులో 40శాతం వరకు ఇప్పటికే పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టిన రైతులు చిరుజల్లులు కురవడంతో ఆగమేఘాల మీద ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు గన్నీ బ్యాగుల కొరతతోపాటు ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్ల మాయాజాలం కొనసాగుతూనే ఉంది. వర్షం హెచ్చరికల నేపథ్యంలో దళారులు ధరను మరీ తగ్గించి అడిగి సొమ్ము చేసుకునే పనిలో ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు తప్పవా....

ఇప్పటికే వరుస అల్పపీడనాల నేపథ్యంలో దిగుబడిలో గణనీయంగా తేడా వచ్చిందని రైతులు చెబుతున్నారు. మరోవైపు తేమశాతం విషయంలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో కొనుగోలు కేంద్రాలను కాదని దళారుల వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల వాతావరణం తెరిపివ్వడంతో రైతులు ముమ్మరంగా కోతలు కోశారు. ఇప్పుడు అల్పపీడనంతో పాలుపోని స్థితిలో రైతులున్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత ఓటు హక్కుపై అవగాహన పొందాలని, తద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఓటు అవగాహన కార్యక్రమం కళాశాల సెక్రటరీ వనమారామకృష్ణ, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలక పాత్రని చెప్పారు. కావున 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కే జగదీష్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

చినగంజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ జె.ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అన్నారు. రెవెన్యూ సదస్సులో రైతులు పలు సమస్యలపై అందజేసిన అర్జీలను స్వీకరించారు. భూ సర్వే కోసం 17, కుల ధ్రువీకరణ కోసం 40, ఆదాయ ధ్రువీకరణపత్రానికి ఒకటి, 1బీ కోసం 16 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సుబ్బారావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

రేపు రెవెన్యూ సదస్సుకు హాజరుకానున్న మంత్రి

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెవెన్యూ సదస్సులలో భాగంగా ఉత్తర అద్దంకికి చెందిన రెవెన్యూ సదస్సు ఈనెల 20వ తేదీ అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. రెవెన్యూ సదస్సుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారని, రైతులు, ప్రజలు తమ సమస్యలను అర్జీలరూపంలో అందజేయాలని బుధవారం ప్రకటనలో కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

మార్టూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహనతో మెలగాలని ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలికలతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బాలికలపై లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణా తదితర అంశాలపై బాలికలుకు అవగాహన కలిగిస్తూ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలికలతోపాటు పలువురు విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఉప్పల శివశంకర్, శైలజ, శశికళ, తులసి పాల్గొన్నారు.

పాత్రికేయుడు మృతి

పర్చూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పత్రికల్లో పాత్రికేయుడిగా విధులు నిర్వహించిన పర్చూరుకు చెందిన తులసి రాఘవరావు (59) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను అధిగమించి వచ్చే క్రమంలో స్కూల్ బస్ తగిలి మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీకి చెందిన రమణారెడ్డి బుధవారంతిమ్మాయపాలెం సమీపంలోని ఇటుక బట్టీల వద్ద నుంచి మోటార్‌సైకిల్‌పై వస్తుండగా తిమ్మాయపాలెం సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న స్కూల్ బస్ క్రాస్ చేసి వెళ్తూ తగిలింది. దీంతో రమణారెడ్డి కి స్వల్ప గాయాలు అయ్యాయి. అద్దంకిలోని ప్రవేట్ వైద్యశాలలో చేరారు.

నకిలీ బంగారంతో టోకరా

అద్దంకి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): గోల్డ్ షాపు యజమానికి పాత బంగారం గా నమ్మించి నకిలీ బంగారం అంటకట్టిన సంఘటన పై అద్దంకి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని రామాటాకీస్ బజారు లో శ్రీ తిరుమల జ్యువెలరీ షాపు కు గత నెల 29 వ తేది 35 సంవత్సరాల వయస్సు ఉన్న పురుషుడు, 28 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ వచ్చారు. గోల్డ్ చైన్ కొనుగోలు చేసేందుకు వచ్చామని చెప్పటంతో గోల్డ్ షాపు నిర్వహకుడు అ ర్వపల్లి బ్రహ్మానందరావు తన షాపులో ఉన్న బంగారం చైన్ లను చూపించాడు. వాళ్ళ వద్ద ఉన్న పాత బంగారం చైన్ లు చూపించి తూకం వేయించారు. 916 సీల్ ఉంది. 32 గ్రాముల బరువు ఉన్నాయి. షాప్ లో 22 గ్రాముల రెండు చైన్ లు, 4 గ్రాముల ఉంగరం తీసుకొని వెళ్ళారు.మరలా వస్తామని చెప్పి వె ళ్ళారు. అయితే తిరిగి రాకపోవటం తో మంగళవారం ఆ బంగారం వస్తువులను కరిగించగా నకిలీ బంగారం గా తెలింది. మోసపోయినట్లు గుర్తించిన అ ర్వపల్లి బ్రహ్మానందరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించాలి

చినగంజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాసులుగా తీర్చిదిద్దే బాధ్యత వీవోఏలదేనని ఎంపీడీవో డీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. స్త్రీశక్తి భవన్‌లో వెలుగు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉల్లాస్ అక్షర వెలుగు కార్యక్రమంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీఎం గద్దె సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీవో మాట్లాడుతూ ఉల్లాస్ అక్షర వెలుగు కార్యక్రమానికి వీవోఏలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. గ్రామాల్లో రాత్రులు వారికి శిక్షణ ఇచ్చి వారు కనీసం సంతకం చేసుకునేలాగా తయారు చేయాలని అన్నారు. నిరక్షరాసులు కనీసం వారి అవసరాలు తీర్చుకునే విధంగా వారిని అక్షరాసులుగా చేసేటువంటి బాధ్యతని సక్రమంగా నిర్వర్తించాలని వివోఏలకు సూచించారు. ఉల్లాస్ కార్యక్రమంపై ఎంఈవో మనోరంజన్ వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కోటేశ్వరరావు, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

మార్టూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొట్టిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. గుంటూరు వైపు మార్టూరులోని అంబేడ్కర్‌నగర్ ఎదురుగా రోడ్డు దాటుతున్న తోటకూరి నాగేశ్వరరావు(60)ను ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు మృతి చెందారు. అతడు అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొని తిరిగి రామ్‌నగర్‌లోని ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ప్రమాదానికి కారణమయిన కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

దొనకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ బాలుర, బాలికల జిల్లా జట్ల ఎంపిక స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు తెలిపారు. ఈ మేరకు జిల్లా నెట్‌బాల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. కృష్ణారెడ్డి, ఐపీ రాజు సూచించినట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై విచారణ

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- వైసీపీ నేతలతో కలసి డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి
- రూ.15.74లక్షలు ఆ నేతకు అప్పగింత
- కాంట్రాక్టర్ ఫిర్యాదుపై వచ్చిన డీఎల్‌పీవో

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై బుధవారం విచారణ చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన సీసీ రోడ్ల నిధులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విడుదల అయ్యాయి. అధికారం అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు అధికారులతో కలిసి ఆ నిధులను డ్రా చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేశారు. కోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నా, పంచాయతీ కార్యదర్శి రివ్యూ పిటిషన్ వేసి సాగదీసుకుంటూ వస్తున్నారు.

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో బుధవారం చీరాల డీఎల్‌పీవో శివనారాయణ విచారణ నిర్వహించారు. సర్పంచ్ గుజ్జుల మల్లిక జగన్మోహనరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిను డీఎల్‌పీవో శివనారాయణ విచారించి స్టేట్‌మెంట్‌లు నమోదు చేశారు.



సీసీ రోడ్ల నిధుల దుర్వినియోగంపై విచారిస్తున్న చీరాల డీఎల్‌పీవో శివనారాయణ

వైసీపీ నేత చంద్రగిరి వీరారెడ్డికి నిధులు ముట్టజెప్పిన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్

అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో 2018-19 సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 3 సీసీ రోడ్లు వేశారు. 70:30 వాటా ప్రకారం 30 శాతం కూలీలకు పోను పనులు చేసిన టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు 15,74,283 రూపాయలు రావల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీసీ రోడ్లకు గాను నిధులు విడుదల కావడంతో ఆ పనులకు సంబంధించిన అన్ని వివరాలతో మానం మురళీమోహన్‌దాస్ 2019 సెప్టెంబరు 3వ తేదీ బిల్లులు చెల్లించాలని అధికారులకు అర్జీ ఇచ్చారు. ఆ అర్జీ ఆధారంగా పనులు వీరారెడ్డి చేసినట్లు తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లిక జగన్మోహనరెడ్డి పంచాయతీ బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును 2019 సెప్టెంబరు 9వ తేదీన డ్రాచేసి వైసీపీ నేత చంద్రగిరి వీరారెడ్డికి ఇచ్చారు. దీంతో అప్పట్లోనే టీడీపీ నేత మురళీమోహన్‌దాస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

డీఎల్‌పీవో విచారణలో నేరుగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించారు. నిబంధనల మేరకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి బ్యాంక్ చెక్‌ను పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. ఈవోపీఆర్డీ ప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో గాయత్రి లక్ష్మి, ఫిర్యాదుదారుడు, టీడీపీ నేత మానం మురళీమోహన్ దాసు తదితరులు ఉన్నారు.

మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

చూపారు కానీ, ప్రజావసరాలకు మాత్రం అడుగు ముందుకు వేయలేదు. దీనికితోడు గత ప్రభుత్వంలో ఏ పనులకు సంబంధించి టెండర్లు పిలిచినా, డబ్బు చెల్లించరన్న కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఎక్కడివక్కడే మూలన పడ్డాయి. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటి పనులయితే నత్తనడక కంటే దారుణంగా సాగాయి. మొత్తంమీద 80 ఎకరాల వరకు స్థలాలను సేకరిస్తే ప్రాజెక్టులు మొదలైపోయేవి. కానీ ఒక్క ఎకరా కూడా కొన్న దాఖలాలు లేవు. దీంతో గత ప్రభుత్వం గద్దెనెక్కేనాటికి పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పుడు కూడా అదే దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించే పరిస్థితి లేకపోయినా, కేంద్రం నిధులిచ్చినా వాటినీ సద్వినియోగం చేసుకోలేకపోవటం దయనీయమే.

తెనాలి, నరసరావుపేట మున్సిపాలిటీల్లో మినహా పెద్దగా అడుగు ముందుకు పడిన పరిస్థితిలేదు. నరసరావుపేటలో కూడా 8 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయి, వినియోగంలో ఉంది. తెనాలిలో మాత్రం 10 ఎంఎల్‌డీల సామర్థ్యమున్న ప్లాంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ. 28 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్లాంట్ నిర్మాణం, యంత్రాల కోసం రూ. 21కోట్లు కేటాయిస్తే, మరో రూ. 7కోట్లు పదేళ్ల నిర్వహణ ఖర్చు కింద కేటాయించారు. ఇదికాక మరో 9.5 కోట్లతో 2 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం చేపట్టారు కానీ, అది పునాదుల దశలోనే ఉంది. రూ. 80 లక్షలతో పునాదులు పూర్తిచేసి, పైన గోడల నిర్మాణం కోసం ఇనుప చువ్వలను ఏర్పాటు చేశారు. అయితే పనులు అక్కడితో ఆగిపోవటంతో అవి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. గత వైసీపీ సర్కారు కాలంలో దీనిపై కాస్తంతైనా దృష్టిపెట్టి ఉంటే ఇప్పటికి నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చేది. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని ప్రాజెక్టుల్లో కదలిక వచ్చింది.

ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా...

గుంటూరు కార్పొరేషన్, మరికొన్ని మున్సిపాలిటీల్లో ప్లాంట్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నా పనులు మొదలే కాలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 123 ఎంఎల్‌డీ మురుగు నీటి శుద్ధి కోసం ఐదు చోట్ల ప్లాంట్‌లను నిర్మించాలని నిర్ణయించారు. గోరంట్లలో రెండు చోట్ల 2.54, 2.39 ఎకరాల్లో రెండు ప్లాంట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయితే, సాంకేతిక పనులు మాత్రం కేవలం 50 శాతమే జరిగాయి. రెండోదానిలో అయితే 25 శాతం కూడా పూర్తికాలేదు. శుద్ధపల్లి డొంకలో నిర్మాణ పనులు అసలు మొదలే కాలేదు. ఆర్. అగ్రహారంలో 4 ఎకరాల్లో, రైల్వే ట్రాక్ సమీపంలో మరో 6.88 ఎకరాల్లో నిర్మించాల్సిన పెద్ద ప్లాంట్‌ల పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. వీటి మొత్తానికి ప్రభుత్వ స్థలమే ఉన్నా, పనులు మాత్రం మందకొడిగా సాగిపోతున్నాయి. అటు పల్నాడు జిల్లాలోనూ మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, వినుకొండ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇంకా స్థలాలు సేకరించాల్సిన దశలోనే ఉన్నారు. నరసరావుపేటలో 15.55 ఎంఎల్‌డీల ప్లాంట్ పూర్తయిపోతే, మరో 3ఎంఎల్‌డీల ప్లాంట్ మాత్రం ఊసేలేదు. చిలకలూరిపేటలోనూ భారీ ప్లాంట్ అవసానదశలోనే ఉంది. అటు బాపట్ల జిల్లాలోనూ అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీల్లోనూ చాలావరకు స్థలాలను సేకరించే పనిలోనే ఉన్నారు. ఇటు గుంటూరు జిల్లాలోని పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి మున్సిపాలిటీల్లోకూడా ఎక్కడి పనులు అక్కడే అన్నట్టున్నాయి. మొదలయిన పనులయితే నాలుగేళ్ల క్రితం ఆగిపోయి తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో మురుగు శద్ధి లక్ష్యం నెరవేరక, పట్టణాలు దుర్గంధంతోనే నిండిపోతున్నాయి.



ఆంజనేయుని వేషధారణలో అలరిస్తున్న భక్తుడు

ఘనంగా అమ్మవారి 30వ పడిపూజోత్సవం

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలోని విఠల్‌నగర్ రామ మందిరం వద్ద ఘనంగా అమ్మవారి 30వ పడిపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షధారులు పాల్గొని భజనలు చేశారు. శివపార్వతి, ఆంజనేయుని వేషధారణతో అందరినీ అలరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయం మార్మోగింది. చివరగా సద్ది కార్యక్రమం నిర్వహించారు.

ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలి

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని తహసీల్దార్ పార్వతి, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో గ్రామాల అభివృద్ధిపై అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి రెండో బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు ముందుగా మహనీయుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగరాజు, సూపర్‌వైజర్ లీలావతి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఘటనపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా ఓ వ్యక్తి ఆటోను ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల - బాపట్ల మార్గంలో ఆటో నడుపుతున్న సుప్రజ ప్రయాణికులతో గత సోమవారం ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. ప్రమాదంలో డ్రైవర్ సుప్రజతో పాటు మరికొందరికి గాయాలు కావడంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారు. ఈమేరకు బుధవారం ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

నదిలోనే రోడ్డు

(5వ పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి దిగువన వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం, ఏ అధికారి నుంచి గాని రోడ్డుకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజా ప్రతినిధుల ద్వారా అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది ప్రాంతాల్లో నిబంధనలు విరుద్ధంగా తవ్వకాలు జరగుతున్నట్లు ఇటీవల విజిలెన్స్ అధికారులు తేల్చారు. వారు నిర్వహించిన తనిఖీల్లో ఇసుక అక్రమాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. నది మధ్యలో 360 టన్నుల ఇసుక డంప్‌ను కూడా గుర్తించారు. నదీ గర్భంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు రెండు చోట్ల జరుగుతున్నట్లు తేల్చారు. కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. అయినా అక్రమార్కులు తగ్గకపోగా మరింత బరితెగిస్తున్నారని ప్రస్తుత పరిణామాలు తెలియజేస్తున్నాయి.

రోడ్డు నిర్మాణం ఆపేదేవరు?

నదిలో ప్రవాహనికి అడ్డంగా రోడ్డు నిర్మాణ పనులు పట్టపగలే జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. ఫిర్యాదు చేసినా చర్యలకు సాహసించడంలేదు. రోడ్డు నిర్మాణం నిలిపివేస్తే ఎటువంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన కొందరు అధికారులను వెంటాడుతోంది. అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చు అడ్డు ఉండదని నదిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణమే ఒక ఉదాహరణగా ఉంది.

ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదు

కోనూరు వద్ద నదిలో ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదని జిల్లా మైనింగ్ అధికారి నాగిని తెలిపారు. సదరు కాంట్రాక్టర్లను కృష్ణా రివర్ కన్జర్వేటర్, కృష్ణా సెంట్రల్ డివిజన్ విజయవాడ నుంచి అనుమతులు తీసుకోవాలని కాంట్రాక్టర్లు సాయిక్యూ అండ్ సొల్యూషన్స్, గోదావరి కృష్ణా వాటర్ వేస్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి లేఖ ద్వారా తెలియజేశామన్నారు. ర్యాంపు నిర్మాణానికి అనుమతి పొందినట్లుగా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని నాగిని చెప్పారు.

పెనుగొండ.. సాహితీకొండ

(5వ పేజీ తరువాయి)

సహ సంపాదకుడిగా 5 పుస్తకాలకు, సంపాదకుడిగా 9 పుస్తకాలకు, గౌరవ సంపాదకుడిగా 76 పుస్తకాలకు వ్యవహరించారు.

మారుమూల పల్లె నుంచి

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువుకొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్‌మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉపాధ్యాయురాలు ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు పిల్లలు సంతానం. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టి 1989-90లో గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. అ తర్వాత గుంటూరు బార్ అసోసియేషన్ సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, బార్ అసోసియేషన్ ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అరసంతో అనుబంధం.. గుర్తింపు

తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 1974లో అరసం జిల్లా కార్యదర్శిగా, అటుపై రాష్ట్ర, జాతీయ కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2023 ఆగస్టు నుంచి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా ఆయన గుర్తింపు పొందారు.

సమిధ కవితతో సాహితీ ప్రస్థానం

1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విదిత, దీపికతో పాటు అనేక రచనలు చేశారు. డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపదకత్వం నిర్వహించారు. వీటితో పాటు స్మృతిరేఖలు, స్వయంకృషి, పాన్‌వాలా, గుంటూరు కథలు, పల్లూరి శివప్రసాద్, కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు, శశిశ్రీ కథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య గేయాలు రచించారు. అనేక వ్యాసాలకు సంపాదకత్వం వహించారు.

పురస్కారాలు.. సత్కారాలు

సాహితీ ప్రస్థానంలో పెనుగొండను అనేక పురస్కారాలు వరించాయి. అమర కళాకారుడు సుంకర సత్యనారాయణ పురస్కారం, విశాలాంధ్ర ప్రచురణాలయం స్వర్ణోత్సవ సన్మానం, తెలుగు భాషా పురస్కారం, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ పురస్కారం, విదిత పుస్తకానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి సాహితీ సత్కారం, కవి సంధ్య ప్రతిభా పురస్కారం, ఉగాది పురస్కారం, గుత్తికొండ సుబ్బారావు సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ తోడ్పాటుతో 1997 జనవరి 26 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రచయితల కార్యగోష్ఠిలో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు మాస్టారు శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు తెలుగుశాఖ, తెలుగు భాషోద్యమ శాఖ తదితర వేదికల నుంచి ప్రశంసా పత్రాలు సమర్పించారు. సాహితీవేత్తలైన పులుపుల వెంకటశివయ్య కొండేపూటి శ్రీనివాసరావు, విశాల సాహితీ సత్కారం, డాక్టర్ పరుచూరి రాజరామ్, తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాలాంధ్ర, అరసం పుస్తక మహోత్సవాల్లో ఆయన ప్రధానపాత్ర పోషిస్తున్నారు.

పలువురి అభినందనలు

పెనుగొండ లక్ష్మీనారాయణరెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవడంపై పాతచెరుకుంపాలెంలో బుధవారం గ్రామస్థులు, బంధు మిత్రులు, సహచరులు ఆనందోత్సాహాలు చేసుకున్నారు. పెనుగొండకు పలువురు అభినందనలు తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా రచయితగా, న్యాయవాదిగా శ్రామికలోకానికి చేసిన సేవలకు గాను పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం గర్వకారణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఎమ్మెల్యేలు బాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, అరసం నాయకులు, సాహితీవేత్తలు పెనుగొండను అభినందించారు. వినుకొండ ప్రాంతానికి గుర్తింపు తెచ్చారని న్యాయవాది, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు లూకా పెనుగొండకు అభినందనలు తెలిపారు.ఆయనకు పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు.





గ్రాసం కోసం ప్రమాద ప్రయాణం

- సర్వస్వం కోల్పోయి పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులు

అద్దంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు మల్లె తోటల సాగుతో దర్జాగా బతికిన ధేనువకొండ రైతులు గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో జీవితాలు తారుమారయ్యాయి. కోల్పోయిన భూములకు పరిహారం అందినా అవి కటుంబ ఖర్చులకు కరిగిపోయాయి. ఇక మిగిలిన కొద్దిపాటి భూమిని నమ్ముకొని ప్రత్యామ్నాయంగా కుటుంబజీవనం కోసం పాడిని నమ్ముకున్నారు. గేదెలను కొనుగోలు చేసిన రైతులకు మేత సమస్య ఏర్పడింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ మధ్యలో కొంత మెరక భూమి మిగిలింది. అక్కడ గ్రాసం ఉంది. అయితే అక్కడకు చేరుకోవాలంటే తెప్పలు (చిన్న పడవలు)లో మాత్రమే ప్రయాణించాలి. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గుండా గేదెలను ఈ దుకుంటూ ముందుకు వెళ్తుంటే వాటి వెనుక తెప్పలపై పశుపోషకులు మధ్యాహ్నానికి అన్నం తీసుకొని వెళ్లి వస్తున్నారు. రానుపోను 5కి.మీ దూరం రిజర్వాయర్ నీటిలో ప్రమాదపు అంచున ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదమని తెలిసినా గ్రాసం అందుబాటులో లేక తరచూ పశు పోషకులు ప్రమాదపుటంచున ప్రయాణం తప్పడం లేదు. గేదెలకు 5 కి.మీ ఈత, పోషకులకు 5 కిలో మీటర్ల దూరం పడవ ప్రయాణం తప్పడం లేదు.

నాడు సిరులతో ఉన్న కుటుంబాలు ఇప్పుడు పోషణ కోసం పాడిపరిశ్రమే దిక్కు గా మారింది..

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా ఏపీవో నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో నాలుగు లక్షల మందికి పని కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రధానంగా ఇటీవల జరిగిన గ్రామ సభల్లో తీర్మానించిన పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

- ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి పంచాయతీ సర్పంచ్, ఆ గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులను సకాలంలో గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రధానంగా తాగు నీరు, పారిశుద్ధ్యం అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. శిక్షణలో సిబ్బంది గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత, సూపరింటెండెంట్ కల్పన, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన డీసీ అధ్యక్షుడు ఆంజనేయులు

మంత్రి గొట్టిపాటిని కలిసిన డీసీ అధ్యక్షులు

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు బుధవారం విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను కలిశారు. పంగులూరు అధ్యక్షునిగా తనకు అవకాశం దక్కినందుకు మంత్రి గొట్టిపాటికి ధన్యవాదాలు తెలిపారు. రైతులకు సాగు నీరు అందించే విషయంలో చిత్తశుద్ధితో పని చేయాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఆయన వెంట పోపూరి శ్రీనివాసరావు, చెరుకూరి అనిల్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని సంతమాగులూరు, కొమ్మాలపాడు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కమాను శ్రీనివాసరావు, నాసరయ్య, యలమందయ్య, కొక్కెర సుబ్బారావు, పలువురు టీడీపీ నాయకులు మంత్రి గొట్టిపాటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం




హరిప్రసాద్‌నగర్ 24వ సచివాలయంలో ఉన్న మహిళా పోలీస్.. పాపరాజుతోట 22వ సచివాలయంలో శానిటేషన్ ఉద్యోగి.. విఠల్ నగర్ 20వ సచివాలయంలో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు

- సమయపాలన పాటించని కొందరు
- వేలిముద్ర వేసి ఏదో కారణంతో బయటకు
- సేవలందక కార్యాలయాల వద్ద ప్రజల ప్రదక్షిణలు
- విధుల్లో ఒక్కోచోట ఒక్కరు మాత్రమే
- అందుబాటులో లేక ఇబ్బందులు

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలో ప్రస్తుతం 25 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈక్రమంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకుగాను ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి 10రకాల వివిధ శాఖలకు సంబంధించి కార్యదర్శులను నియమించింది. ఇలా చూసుకుంటే అన్ని సచివాలయాలు కలుపుకుని 250 మంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 160 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఖాళీలను ఇంకా పూర్తి చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ స్థానాల్లో వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. వీరు ప్రజలకు దాదాపుగా 210 సేవలు అందించాల్సి ఉంది. వీరు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలి. ఏదైనా ప్రభుత్వ లేదా ఇతర అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి ఉంటే కచ్చితంగా మూమెంట్ బుక్‌లో రాసి వెళ్లాలి. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు దీనిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని, ప్రజలను మోసగిస్తున్నారు. కార్యాలయానికి రావడంతోనే ఏదో ప్రభుత్వ కార్యక్రమంటూ సాకు చెప్పి బయటకు వెళ్లి సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు. మూమెంట్ బుక్‌లో రాసిన చోటుకు వారు వెళ్లిన దాఖలాలు లేవు. ఈక్రమంలో అర్జీదారులు, పలు సేవలకు వచ్చిన వారికి చుక్కలు కనబడుతున్నాయి. గట్టిగా అడిగితే పని చేయరేమోనని మౌనంగా వెనక్కి వస్తూ మరోరోజు వెళ్తున్నారు. ఈక్రమంలోనే బుధవారం ఆంధ్రజ్యోతి సచివాలయాలను పరిశీలించగా దాదాపుగా అధిక శాతం సచివాలయల్లో ఒక్కరు లేదా ఇద్దరు మాత్రమే ఉండడం కన్పించింది. ఈ నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. ప్రజలకు నిరంతరాయంగా సేవలందేలా దృష్టి సారించాలని ఆశిద్దాం.


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

బల్లికురవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఐ అన్ని గ్రామాలలో రోజు వారి కూలీలు వసలలు పోకుండా ఉపాధీ హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి కోరారు. బుధవారం స్థానిక ఉపాధీ హామీ కార్యలయంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు 2024- 25 సంవత్సరాలకు కూలీలకు అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలను సిబ్బంది తయారు చేయాలన్నారు. అలానే ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ కుటుంబాలను పనులకు వచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలానే ఎక్కడ మస్టర్లలలో లోపాలు తలెత్తితే చర్యలు తప్పవు అన్నారు. పనులకు వచ్చిన వారికే మస్టర్ వేయాలన్నారు. హర్టి కల్చర్ ద్వారా సాగులో ఉన్న మొక్కలు అన్ని సక్రమంగా ఉండాలన్నారు. మొక్కలు బ్రతికించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి. అన్ని గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌లతో మహిళలకు ఉపాధి


కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో రోటరీ ప్రతినిధులు

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు మహిళల స్వయం సమృద్ధి కోసం అందించిన కుట్టు మిషన్లతో ఉపాధి పొందాలని క్లబ్ కార్యదర్శి డాక్టర్ బత్తుల వీరనారాయణ కోరారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో బుధవారం 18 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. బీహెచ్ఆర్ మైనింగ్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ చొరవతో హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ మహిళలకు కుట్టు మిషన్లు సమకూర్చినట్లు క్లబ్ క్యాంప్ ఇన్‌చార్జి చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. పంగులూరు రోటరీ క్లబ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షేక్ కాలేషావలి, క్లబ్ ప్రతినిధులు రాయిణి రామారావు, జాగర్లమూడి సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, పోలిశెట్టి సీతారామయ్య, ఆర్వీ సుబ్బారావు, పోతిన ప్రసాద్, ఐ.సుబ్బారావు పలువురు మహిళలు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలు తాళలేక వ్యవసాయ కూలీ (37) బలవన్మరణం చెందాడు. ఈ ఘటన వేటపాలెం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అతనికి భార్య, పాప, బాబు సంతానం. గతకొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలోనే ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పర్చూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసులను అపహరించి ఉడాయించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఓదశలో దుండగుడు దాడికి కూడా వెనుకాడక పోవడంతో మహిళ ఆందోళనకు గురైంది. చోరీకి పాల్పడిన వ్యక్తి కారులో పరారవుతున్న తరుణంలో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పర్చూరు గ్రామంలోని ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న కనమర్లపూడి శ్రీదేవి దుకాణం నుంచి భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా కెనరా బ్యాంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వెంబడించి చోరీకి పాల్పడినట్లు పేర్కొంది. తన మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులను లాగే క్రమంలో తాను గట్టిగా బంగారు గొలుసులను పట్టుకోవడంతో బలవంతంగా లాక్కొని సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కారులో పరారైనట్లు ఆమె తెలిపారు. ఇది గమనించిన కొందరు బైకులతో కారును అడ్డుకునే ప్రయత్నం చేసినా దొంగ తప్పించుకొని పరారైనట్లు తెలిపారు. రెండు సవర్ల గొలుసు పోయినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో మండలం నాగులపాలెం ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో కూడా మహిళ మెడలో గొలుసు లాక్కొని పరారైన విషయం తెలిసిందే.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. విద్యావనరుల కేంద్రంలో బుధవారం సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాంజనేయులు, ఈవోఆర్డీ సుమంత్, ఐసీడీఎస్ పీడీ కృష్ణకుమారి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయాన్ని వినియోగపర్చుకోండి

అద్దంకిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఉన్న సమయాన్ని సద్వినియోపర్చుకోవాలని ఎంఈవో బీ సుధాకరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గురవయ్య, యూటీఎఫ్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఎంఈవో, యూటీఎఫ్ నాయకులు


కొండమూరులో లేఅవుట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

సదస్సులతో భూ సమస్యలకు చెక్

పంగులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్ పడుతుందని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామంలో బుధవారం జరిగిన సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. గతంలో నివేశన స్థలాల కోసం సేకరించిన లే అవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి కాటా అంజయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి

దేవాంగపురి : చీరాల మండల పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తుందని తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం దేవాంగపురి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులతో పేద ప్రజలకు, భూ యజమానులకు తక్షణ పరిష్కారం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, ఆర్ఐ నాగకుమార్, ఏవో సుమతి, ఎండోమెంట్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్చూరు : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని, రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం పర్చూరు పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 14 అర్జీలు అందాయని, ప్రాధాన్యనుబట్టి పరిష్కరిస్తామని చెప్పారు. కార్య క్రమంలో దేవదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

బల్లికురవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. బుధవారం ఐటీసీ బంగారు భవిష్యత్ వారి ఆధ్వర్యంలో గ్రామాలలో పని చేస్తున్న క్లాప్‌మిత్రలు, పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త లేకుండా శుభ్రంచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో సూచించారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత


పట్టుబడిన ట్రాక్టర్‌లతో వీఆర్వో శివారెడ్డి

తోటవారిపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం వద్ద రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం అక్రమార్కులు ఇష్టారీతిగా ఇసుక తరలిస్తున్న సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వో శివారెడ్డి దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి



మిరపను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ, రైతులు

అద్దంకిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు రోజులలో వర్షాలు పడే అవకాశం ఉన్నందును పంటల కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని మండలం వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని కుంకుపాడు, కోటికలపూడి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సాగు చేస్తున్న మిరప, శనగను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, శనగలో పచ్చపురుగు నివారణకు మొదటి దశలో ఎకరాకు 400ఎంఎల్ వేపనూనె పిచికారీ చేయాలన్నారు. వరి తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలని, మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలం శ్రీను, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు లక్ష్మి, తులసి, రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

పంగులూరు : మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశించిందని దాని నివారణకు రైతులు తక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దిల్లా, పృథ్వి, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలోని అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మేరమ్మ రైతులకు చెందిన కంది పైరును పరిశీలించారు. కందిలో మరుక మచ్చల పురుగు నివారణకుతీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు.

ఇంకొల్లు : మండలంలో మంగళ, బుధవారాల్లో పడిన చిన్నపాటి వర్షపు జల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేస్తున్నారు. పొగాకు ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఈ జల్లులతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారంరోజుల కిందట శనగ ఎదబెట్టారు. మొలక దశలో ఉండగా తుపాన్ కారణంగా వర్షాలు పడితే పంట దెబ్బతింటుందని భయపడుతున్నారు. వానలు పడక పోతే ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు చెప్తున్నారు.


అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా అభయాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో వేంచేసిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థాన ప్రథ మ వార్షికోత్సవాన్ని కమిటీ ప్రతినిధులు బుధవారం ఘ నంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు స్వామి వారికి మహా కుంభాభిషేకం, యజ్ఞ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా -2 అధ్యక్షుడు బాపయ్య

ఘనంగా పెన్షనర్స్ డే

అద్దంకిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని భాగ్యనగర్‌లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం షేక్ మస్తాన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. నూతన భవనాన్ని స్థల దాత చిన్ని మురళీకృష్ణ, భార్య వసంతలక్ష్మి ప్రారంభించారు. అనంతరం భవనంలో పెన్షనర్స్ డే వేడుకలను నిర్వహించారు. పెన్షనర్ల యోధుడు నకారా విగ్రహాన్ని సంఘ బాపట్ల జిల్లా-2 అధ్యక్షుడు రావూల బాపయ్య చౌదరి ఆవిష్కరించారు. కార్యాలయ గదిని ఎస్‌టీవో ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జిల్లా అసోసియేట్ కార్యదర్శి టీ కృష్ణయ్య, మార్టూరు, ఇంకొల్లు శాఖల అధ్యక్షులు కమాలుద్దీన్, కృష్ణమూర్తి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు విశ్వరూపచారి పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన కూరగాయలు


మల్లాయపాలెంలో ఆకు కూరలను పరిశీలిస్తున్న సీడీపీవో సుధ

బల్లికురవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోనే సేంద్రియ పద్ధతిలో పెంచిన కూరగాయాలను చిన్నారులు, గర్భిణులకు అందజేస్తామని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ తెలిపారు. బుదవారం మండలంలోని కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమంలో సీడీపీవో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులకు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఆకుకూరలను అందించేందుకు ఐసీడీఎస్ ద్వారా పోషణ వాటికలను పలు కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో ఆకుకూరలు, కూరగాయలు పెంచేందుకు రూ.10వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రాజెక్టు పరిధిలోని 9 కేంద్రాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని, నాణ్యమైన కూరగాయలను చిన్నారులకు అహారంలో అందిస్తామన్నారు. చిన్నారులకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పాస్‌ను వినియోగించాలి

పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అధికారులు



చీరాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు విక్రయాలు సాగించే దుకాణదారులు కచ్చితంగా ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేయాలని కమిషనరేట్ వ్యవసాయ శాఖ ఏడీఏ సుదర్శన్‌రాజ్, తూర్పు గోదావరి జిల్లా ఏడీఏ కమలరాజ్ సూచించారు. గుంటూరు వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు వీరు బుధవారం చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ-పాస్ పాటించకపోవడం వలన స్టాక్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దుకాణదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పునరావృతమైతే లైసెన్స్‌లను రద్దుచేస్తామని వారు హెచ్చరించారు. తనిఖీలలో అధికారులు కొన్ని దుకాణాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. స్టాక్ నిల్వలు రిజిస్టర్, ఈ-పాస్‌లో నమోదు చేయకపోవడంవల్ల ప్రభుత్వ లక్ష్యం దెబ్బ తింటుందని వివరించారు. మరో రెండు రోజులపాటు అన్ని దుకాణాలను తనిఖీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుమతి, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : ఎరువులు పురుగు మందుల దుకాణాలను కమిషనరేట్ ఆఫ్ అగ్రికల్చర్ డిపార్టుమెంట్ అధికారులు బుధవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ సుదర్శన్‌రాజు, ఏవో కమల్ రాజు పలు దుకాణాల్లో తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించారు. ఎరువులను స్టాక్ రిజిస్టర్ ప్రకారం అమ్మకాలు నిర్వహించాలని, ఈ-పాస్ మిషన్‌లో కూడా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రైతుల వేలిముద్రలు వేచించి అమ్మకాలు చేయాలన్నారు. నిర్వహించిన అమ్మకాలు స్టాక్ టాలీ కావాలన్నారు. నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు, ఏవో రామ్మోహనరెడ్డిపాల్గొన్నారు.

'జికా' కలకలం

- ఆరేళ్ల బాలుడికి వైరస్ లక్షణాలు
- పూణే వైరాలజీ ల్యాబ్‌కు నమూనాల తరలింపు
- వెంకటాపురంలో వైద్య బృందం పర్యటన



మర్రిపాడు/నెల్లూరు (వైద్యం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఓ బాలుడికి జికా వైరస్ సోకినట్టు తెలియడంతో వైద్య ఆరోగ్య శాఖలో కలకలం రేగింది. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బద్దల నాగరాజు, కల్యాణిల ఆరేళ్ల కుమారుడు సుబ్బారాయుడు 20 రోజుల క్రితం జ్వరం బారినపడటంతో అన్ని ఆసుపత్రులలో చూపించారు. ఎక్కడా నయం కాకపోవడంతో నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ బాలుడ్ని పరీక్షించిన వైద్యులు జికా వైరస్ అనే అనుమానంతో కొన్ని నమూనాలు తీసి ముంబయిలో ల్యాబ్‌కు పంపారు. అక్కడ జీకా వైరస్‌గా నిర్ధారణ అయింది. దీంతో మంగళవారం సుబ్బారాయుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నై ఎగ్మోర్‌కు తరలించారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఆ బాలుడి నుంచి నమూనాలు తీసి పూణే వైరల్ ల్యాబ్‌కు పంపించారు.

● వెంకటాపురంలో వైద్యాధికారులు

జికా వైరస్ అన్న అనుమానంతో వైద్యాధికారులు వెంకటాపురంలో బుధవారం పర్యటించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథరావు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వెలెన్స్ అధికారి డాక్టర్ మౌనిక, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, కీటకాల అధ్యయన అధికారి కొండారెడ్డి, ఏఎంవో నారార్జునరావు, మర్రిపాడు వైద్యాధికారి గోపీనాథ్ గ్రామంలో పర్యటించారు. బాలుడి ఇంటి చుట్టూ దోమల నిరారణ చర్యలు చేపట్టారు. చుట్టు పక్కల పరిసరాలను శుభ్రం చేశారు. బాలుడికి ఆ వైరస్ ఎలా సోకింది? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితుల నుంచి నమూనాలు సేకరించారు. ఆ బాలుడు కృష్ణాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నట్లు గుర్తించి, అక్కడ పని చేస్తున్న కేరళా రాష్ట్రానికి చెందిన టీచర్లను విచారించారు. మరోవైపు బాలుడికి జికా వైరస్ సోకి ఉండదని, ఒకవేళ సోకి ఉంటే ఇప్పటికే ఎక్కువమందికి వ్యాపించి ఉండేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఇంకా నిర్ధారణ కాలేదు!

బాలుడికి ప్రైవేట్ వైద్యశాలలో రక్త పరీక్షలు నిర్వహించగా జికా వైరస్ లక్షణాలుగా గుర్తించినట్లు తెలిసింది. బాలుడి నుంచి మేము మరోమారు నమూనాలు సేకరించి తిరుపతి, పూణేలకు పంపాము. అక్కడ నుంచి రిపోర్టులు వచ్చే వరకు నిర్ధారించలేము. బాలుడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉంది. గ్రామంలో వైరస్‌కు సంబంధించి లక్షణాలు ఏవీ కనిపించలేదు. ఈ వైరస్‌పై వదంతులు నమ్మొద్దు.

\- రామనాథరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టరు



దోమల నివారణకు స్ప్రే చేయిస్తున్న అధికారులు

● ప్రభావం ఎక్కువే..

అమెరికా, ఆఫ్రికా దేశాలలో ఈ జికా వైరస్ తన ప్రభావం చూపింది. దోమల కారణంగా వ్యాపించే ఈ వైరస్ కేరళ రాష్ట్రంలోనూ దీని ప్రభావం కనిపించింది. వైరస్ కారణంగా మరణాలు సంభవించక పోయినా చిన్నారులలో మెదడుపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అలాగే కంటి చూపు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. పుట్టే బిడ్డలు చిన్నతలతో పాటు కీళ్ల సమస్యలు, కండరాల బలహీనత ఏర్పడుతుంది. వ్యాధిగ్రస్తురాలితో శృంగారం చేయటం వల్ల కూడా ఈ వైరస్ ప్రభావం మగవారికి, రక్తమార్పిడి కారణంగా కూడా ఈ వైరస్ వ్యాపిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ డెంగ్యూ లక్షణాలు పోలి ఉండటంతో ఆ వైద్య చికిత్సలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.



వెంకటాపురంలో వివరాలు సేకరిస్తున్న వైద్యబృందం

బాలుడికి మెరుగైన వైద్యం : ఆనం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం గ్రామంలో జికా వైరస్ లక్షణాలు బయటపడ్డ బాలుడికి వైద్యపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులో ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు బాలుడ్ని తరలించినట్లు చెప్పారు. అలాగే వెంకటాపురం గ్రామంలో ప్రముఖ వైద్యులతో కూడిన బృందాలతో సర్వే నిర్వహించి పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరం చేసినట్లు ఆనం పేర్కొన్నారు.



మీ పనితీరు ఇదేనా!? రోగులకు ఇలాగే సేవలందిస్తారా!?

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం
- ప్రిన్సిపల్ సెక్రటరీ, డీఎంఈకి ఫిర్యాదు
- అన్ని లోపాలు సరిదిద్ది.. 15 రోజుల్లో మార్పు రావాలి
- అత్యవసర పరికరాలను వెంటనే కొనండి
- వాడీవేడిగా జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'మీ పని తీరు ఇదేనా!? రోగులకు ఇలాగే సేవలందిస్తారా!? మిమ్మల్ని సస్పెండ్ చేస్తే పెన్షన్ కూడా రాదు.' అంటూ నెల్లూరులోని సర్వజన ప్రభుత్వ వైద్యశాల (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధా నాయక్‌పై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణ సరిగ్గా లేదంటూ మండిపడ్డారు. వెంటనే క్రమశిక్షణ చర్యల కింద వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి, డీఎంఈలకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరగ్గా ఆరంభం నుంచే కలెక్టర్ జీజీహెచ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ అజెండాలోనూ వివరాలు పూర్తిగా లేవని, అసంపూర్తిగా ఉన్నాయంటూ అసహనం వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో 10 విభాగాలు ఉంటే, వాటికి ఏఏ పరికరాలు అవసరమో స్పష్టత లేదన్నారు. మైక్రోప్లానింగ్‌లో అన్ని లోపాలు సరిదిద్దాలని, ఈ మార్పు 15 రోజుల్లో కనిపించాలని సూచించారు. ఆసుపత్రి హెచ్‌వోడీలు కూడా తమ విభాగానికి ఏమేమి కావాలో వాటిని రాతపూర్వకంగా సూపరింటెండెంట్‌కు తెలియచేయాలని సూచించారు. అత్యవసర వైద్య పరికరాలు, ఇతర అవసరాల కోసం ప్రతిపాదనలు పంపితే వెంటనే కొనుగోలు చేయాలని తెలియచేశారు. కిడ్నీ డయాలసిస్ విభాగంలో దాతలు ఏర్పాటు చేసిన పడకలను - మిగతా 6లో



సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

గనుల కోసం 'ఘనుల' ఆరాటం!

'నవ్విపోదురుగాక మాకేంటి..' అన్నట్టుగా మారిపోయింది రాష్ట్ర మైనింగ్ శాఖ. కోరుకున్న వ్యక్తులకు వందల కోట్ల క్వార్ట్జ్ సంపదను దోచిపెట్టడానికి మొదలైన ఆటలో అధికారులు తొలిపావు కదిపారు. ఇక్కడున్న మైనింగ్ డీడీని బలవంతంగా బదిలీ చేసి ఎక్కడో తిరుపతిలో పనిచేసే ఏడీ స్థాయి అధికారిని తెచ్చి డీడీ కుర్చీలో కూర్చోబెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు.



- 'మైనింగ్'లో కోరుకున్నవారినే తెచ్చుకున్నారు!
- నిబంధనలకు అతీతంగా ఏడీకి డీడీ పోస్టు
- మైన్స్ డీడీగా తిరుపతి ఏడీ బాలాజీ నాయక్
- రాష్ట్ర కార్యాలయానికి నెల్లూరు డీడీ బదిలీ

నెల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పరిధిలో క్వార్ట్జ్ గనులను గంపగుత్తగా కొల్లకొట్టడానికి జరిగిన ప్రయత్నానికి సహకరించని నేరానికి డీడీ చంద్రశేఖర్‌ను ఎలా బదిలీ చేశారో, ఎందుకు బదిలీ చేశారో పాఠకు లకు గుర్తుండే ఉంటుంది. నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌కు చెందినవిగా చెప్పుకునే నాలుగు క్వార్ట్జ్ గనులకు అనుమతి ఇవ్వడానికి డీడీ చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపారు. ఆ గనులను తనిఖీ చేశాకే లీజు రెన్యూవల్‌కు అనుమతి ఇస్తానని చెప్పారు. దీంతో డీడీ జిల్లా కేంద్రంలో లేనిరోజు, విధుల్లో భాగంగా హైకోర్టులో ఒక కేసుకు హాజరైన రోజు రాష్ట్ర మైనింగ్ కార్యాలయంలోని ఒక ఉన్నతాధికారి డీడీ తంబ్‌ను తొలగించి మైనింగ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా ఫైల్ అప్రూవల్ చేయడమే కాకుండా కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి డీడీని రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేసిన విషయం 'రూప్ మాయలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. చంద్రశేఖర్ స్థానంలో తమకు అనుకూలుడైన బాలాజీ నాయక్ అనే అధికారిని తెచ్చుకోవడానికి రంగం సిద్ధం అయ్యిందన్న విషయాన్ని కూడా ఆంధ్రజ్యోతి ప్రచురించింది. వారం రోజుల వ్యవధిలో అదే నిజమయింది. తిరుపతి మైనింగ్ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న బాలాజీ నాయక్‌ను నెల్లూరు డీడీగా పూర్తి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● ఏడీకి డీడీ కుర్చీ

డీడీ పోస్టుకు ఇన్‌చార్జిని నియమించే క్రమంలో సాధారణంగా ఆ హోదా కలిగిన వారికే అదనపు బాధ్యతలు ఇస్తారు. ఈ కోణంలో చూస్తే ఒంగోలు డీడీకి ఇన్‌చార్జి ఇచ్చి ఉండవచ్చు. పోనీ అలా ఇవ్వలేదు, ఏడీ స్థాయి అధికారికి డీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారే అనుకున్నా నెల్లూరుకు సమీపంలో ఉన్నవారికి బాధ్యతలు అప్పగించాలి. ఆ కోణంలో చూస్తే గూడూరు ఏడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. అలా కాకుండా తిరుపతిలో ఏడీగా పనిచేస్తున్న అధికారిని నెల్లూరు డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం విడ్డూరంగా ఉందని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. నెల్లూరు జిల్లాలో కార్ట్జ్ కొల్లగొట్టిన గత ప్రభుత్వ పెద్దలను చీదరించుకున్న ప్రజలు ఇప్పుడు జరుగుతున్న తతంగాన్నంతా చూసి ఇప్పటి పాలకుల పట్ల అదే తీరుగా స్పందిస్తున్నారు. విచ్చలవిడి అరాచకాలు, అవినీతికి చంద్రబాబు ప్రభుత్వంలో అవకాశం ఉండదన్నది ప్రజల విశ్వాసం. కానీ క్వార్ట్జ్ గనుల కేంద్రంగా ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారం గమనిస్తున్న ప్రజలు ఇది చంద్రబాబు పాలనేనా!? అనే మీ మాంసలో పడ్డారు. మరోవైపు తన బదిలీని చాలెంజ్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించి బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించుకొచ్చిన చంద్రశేఖర్‌కు నాలుగు రోజులు తిరగకముందే మరోసారి బదిలీ ఉత్తర్వులు చేతికందడంతో ఖంగుతిన్నారు. కోర్టు ధిక్కరణ సెక్షన్ కింద మరోసారి హైకోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం. నెల్లూరు మైనింగ్ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో వేచిచూడాల్సిందే.

'బెకామ్' ప్రయత్నాలన్నీ విఫలమే!

- 'రాళ్లపాడు'లో పైకి రానంటున్న గేటు
- షట్టరు పగలగొట్టేందుకూ విశ్వప్రయత్నం
- నీటి ఉధృతి కారణంగా నిరాశే!
- నేటి నుంచి మోటార్ల ద్వారా నీటి విడుదల

- వివరాలు 6లో..



తూము కుడి కాలువ గేటును పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్న బెకామ్ సంస్థ ప్రతినిధులు

నేటి నుంచి ఆర్టీసీ సిటీ సర్వీస్

● అయ్యప్పగుడి నుంచి చిన్నచెరుకూరు వరకు బస్సు



నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగర వాసుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. ప్రైవేటు సిటీ బస్సులు, ఆటోవాలాల హవా ఎక్కువయ్యిందని, ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలని ఏళ్ల తరబడి ప్రజలు అధికారులను కోరుతూనే ఉన్నారు. చాన్నాళ్లకు ప్రజల వినతిపై స్పందించి ప్రయోగాత్మకంగా నెల్లూరు-2 డిపో ఆధ్వర్యంలో అయ్యప్పగుడి నుంచి చిన్నచెరుకూరు వరకు ఆర్టీసీ బస్సును గురువారం ప్రారంభించనున్నారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి అయ్యప్పగుడి, అయ్యప్పగుడి నుంచి ఆర్టీసీ, మద్రాసు బస్టాండు, గాంధీబొమ్మ మీదుగా ఆత్మకూరు బస్టాండు, పెద్దచెరుకూరు, నరుకూరు, చిన్నచెరుకూరు వరకు బస్సు సర్వీసు నడపనున్నారు. తిరుగు ప్రయాణంలో చిన్నచెరుకూరు, నరుకూరు, పెద్దచెరుకూరు, ఆత్మకూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండు వరకు బస్సు నడుస్తుంది. ప్రస్తుతానికి ఒక బస్సు మాత్రమే నడుస్తున్న ప్రయాణికుల ఆదరణను బట్టి మరిన్ని సర్వీసులు పెంచే అవకాశం ఉంది. కాగా, ఇప్పటికే గూడూరు వైపు వెళ్లే పల్లెవెలుగు బస్సుల్లో ఆర్టీసీ నుంచి అయ్యప్పగుడి వద్దకు స్టాపింగ్ ఇచ్చారు. ఇందుకు రూ.10 చార్జీ వసూలు చేస్తున్నారు.

చార్జీల వివరాలు (రూ.లలో)

నుంచి	వరకు	చార్జీ
ఆర్టీసీ	అయ్యప్పగుడి	10
అయ్యప్పగుడి	ఆత్మకూరు బస్టాండు	20
అయ్యప్పగుడి	పెద్దచెరుకూరు	20
అయ్యప్పగుడి	నరుకూరు	30
అయ్యపగుడి	చిన్న చెరుకూరు	30

ఇక లిక్కర్ ప్రీమియర్ స్టోర్లు

● నెల్లూరుకు 1 కేటాయింపు ● దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా ఉన్నత స్థాయి రిటైల్ అనుభవాన్ని అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రీమియర్ లిక్కర్ స్టోర్ల ఏర్పాటుకు అనుమతిచ్చింది. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురంతోపాటు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రీమియం స్టోర్లు ఏర్పాటు చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ స్టోర్ లైసెన్సు వ్యవధి ఐదేళ్లు. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ మొదటి సంవత్సరం లైసెన్సుదారులు చెల్లించాల్సిన వార్షిక పన్ను రూ.కోటి, రెండవ సంత్సరం నుంచి 10 శాతం పెరుగుతుంది. ప్రీమియం స్టోర్ కనీస కార్పెట్ వైశాల్యం 4వేల చదరపు అడుగులు. ప్రీమియం స్టోరులో మద్యం, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను, మద్యపానం అనుమతించకూడదు. https://apsbcl.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తు పత్రాలను ఈ నెల 31 సాయంత్రం 5గంటలకల్లా జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

భూసేకరణ.. పరిహారం!

- దగదర్తి విమానాశ్రయానికి ఇవే అడ్డంకి
- రూ.96 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు
- 700 ఎకరాల సేకరణలోనే అడ్డంకులు
- ఇవన్నీ పరిష్కరించుకుంటే జిల్లావాసుల కల నెరవేరినట్టే!

> మొన్నటి దాకా విమానాశ్రయంపై ఆశలు వదులుకున్న జిల్లా వాసుల్లో కూటమి ప్రభుత్వం మళ్లీ ఆశలు చిగురించేలా చేస్తోంది. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో విమా నాశ్రయం నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నైట్‌హాల్ట్ విమానాశ్రయానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అయితే, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ, బాధితులకు నష్టపరిహారం ప్రధాన అడ్డంకిగా మారింది. ఇదివరకే అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అలాగే, భూ సేకరణలో తలెత్తిన వివాదాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించుకుంటే పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంటుంది.

కావలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019, జనవరిలో అప్పటి సీఎంగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. విమానాశ్రయం కోసం 1,379 ఎకరాల భూమి అవసరమని అప్పట్లో గుర్తించగా, రన్‌వే నిర్మాణానికి అవసరమైన 600 ఎకరాలకుపైగా కొనుగోలు చేసి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు. రన్‌వే పనులు ప్రారంభిస్తే మిగిలిన భూమిని అప్పగిస్తామని చెప్పడంతో దాని నిర్మాణ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించారు. అయితే ఆ ఏడాదే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. రెండేళ్లపాటు కాలయాపన చేసిన నాటి వైసీపీ సర్కారు ఆ తర్వాత ప్రకాశం జిల్లా తెట్టు ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని చెప్పటంతో జిల్లావాసుల ఆశలు సన్నగిల్లాయి. అయితే, అక్కడ విమానాశ్రయం నిర్మాణానికి అనుకూలత లేదని దాని నిర్మాణ సంస్థలు తేల్చి చెప్పటంతో ఆ తర్వాత దాని ఊసే లేకుండా పోయింది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలోకి రావడంతో దామవరం వద్ద విమానాశ్రయం నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా రాష్ట్రానికి చెందిన రామ్మోహన్ నాయుడు నియమితులుకావడం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా గతంలో తాను శంకుస్థాపన చేసిన దామవరం వద్దనే విమానాశ్రయం నిర్మించాలనే కృతనిశ్చయంతో ఉండటం కలిసొచ్చే అంశం.

● కొలిక్కిరాని భూసేకరణ

2019లో అప్పటి టీడీపీ హయాంలో చేపట్టిన భూసేకరణ కాకుండా ఆ తర్వాత సెంటు భూమి కూడా సేకరించలేదు. విమానశ్రయానికి 1,379 ఎకరాల భూమి అవసరమని అప్పట్లో గుర్తించారు. ఇప్పటికే 600 ఎకరాల వరకు సేకరించి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు. ఇంకా 700 ఎకరాల వరకు భూసేకరణ జరిగినా స్వాధీనం చేసుకునేందుకు పరిహారం చెల్లించేందుకు రూ.96 కోట్లు అవసరమని గుర్తించారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కృషి మేరకు రూ.96 కోట్ల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇంకా ఆ నిధులు మంజూరు కాకపోవటంతో వాటి కోసం నిరీక్షిస్తున్నారు. మరోవైపు సేకరించిన భూమిలో అనేక సమస్యలు ఉండటంతో వాటిని అధికారులు పరిష్కరించాల్సి ఉంది. సుమారు 60 ఎకరాల పట్టాభూమికి పరిహారం చెల్లించాల్సి ఉంది. డీకేటీ, సీజేఎఫ్‌కు చెందిన మరో 100 ఎకరాలలో వాటి అనుభవదారులు వద్ద సరైన పత్రాలు లేక పోవటంతో వాటి వారసులను ఎంపిక చేయాల్సి ఉంది. మరో 125 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికేతరులకు పట్టాలు ఇచ్చారు. దీనిపై స్థానికుల అభ్యంతరం మేరకు చేపట్టిన విచారణలో పట్టదారులు అనర్హులని తేల్చినా ఆ భూములపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. మరో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక సంస్థ కొనుగోలు చేసి ఉండటంతో ఆ భూమి హక్కులపై కోర్టులో వివాదం నడుస్తోంది. నిధులు మంజూరైన వెంటనే బాధితులకు పరిహారం చెల్లించి వాటిని స్వాధీనం చేసుకునేందుకు అనుకూలత ఉన్నా భూసేకరణలో స్థానిక అధికార యంత్రాంగం పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.



విమానాశ్రయ భూములలో 2019లో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన పైలాన్ ఇదే!

ఎంతో అనుకూలం

జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వినియోగంలో ఉండగా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం తుదిదశలో ఉన్నాయి. రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా అనేక పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. రెండు పోర్టులకు మధ్యలో జాతీయ రహదారిని ఆనుకుని విమానాశ్రయం నిర్మిస్తుండటం అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంటుంది. విమానశ్రయం ద్వారా పలు ఉత్పత్తులు ఎగుమతులు, దిగుమతులకు అనువుగా కార్గో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుం టున్నారు. ఇక పరిశ్రమల ప్రతినిధులతో పాటు జిల్లావాసులకు ఈ విమానాశ్రయం ఎంతో అనుకూలంగా ఉంటుంది.

నాడు అలా.. నేడు ఇలా!



కృష్ణపట్నం కాలువకు మోక్షం.. రైతుల్లో ఆనందం

ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం కాలువకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్ల నుంచి పిచ్చి చెట్లు, తూటాకుతో నిండిపోయి సాగునీరు పారుదల ఉండేదికాదు. దీంతో వేలాది ఎకరాల్లో వరిసాగును సకాలంలో చేసుకోలేక రైతులు ఇబ్బందిపడ్డారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి కాలువ దుస్థితిని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో నీరు అందాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే సహకారంతో స్థానిక రైతులే కాలువ మరమ్మతులు చేపట్టారు. మొన్నటిదాకా పూడిపోయి కాలువ రూపే కనిపించని కృష్ణపట్నం కాలువ ఇదిగో ఇలా సాగునీటితో కళకళలాడుతోంది.

- ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి)



పిచ్చి కుక్క రేపుతోంది!


స్థానిక పంచాయతీ పరిధిలోని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నాలుగు రోజులుగా గ్రామంలోని ఐదుగురు వ్యక్తులు, 3 మేకలు, 2 బర్రెలపై దాడి చేసి కరుస్తుంది. దీంతో గ్రామస్థులు కర్రలతో తరుముతుంటే గ్రామం పక్కనే ఉన్న తోటల్లోకి వెళుతుంది. ఆదమరిచిన తరువాత రాత్రులు వీధుల్లో సంచరిస్తూ కన్పించిన వాళ్లపై దాడి చేస్తుట్లు స్థానికులు తెలిపారు. నిద్ర లేకుండా రాత్రులు కూడా కాపలా కాస్తున్నట్లు ఎస్సీ కాలనీవాసులు చెప్పారు. కాలనీలో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)



ఊరి వరస

మావో.... ఏంటి సంగతా..?



- ఓ...మే కోడలా మీ ఆయనుండడా...!
- నీ యవ్వా బుడ్డోడో... గుద్దిననుకో....!
- పల్లెల్లో ఇప్పటికీ అదే 'వరస'
- కుల, మతాలకు అతీతంగా పలకరింపు

పల్లెటూళ్లు దేశానికి పట్టుకొమ్మలు అంటారు. అంతేకాదు, అచ్చమైన మన సంస్కృతి, సంప్రదాయాలకు ఆనవాళ్లు కూడా పల్లెటూళ్లే. మతం ఏదైనా, కులం ఏమైనా చుట్టాల వరసతో పిలుచుకోవడం పల్లె జనాల ప్రత్యేకత. బావా మరదళ్ల సరసం, అత్తా అల్లుళ్ల చతుర్లు, మావా అల్లుళ్ల కొంటెతనం, రచ్చల మీద ముసలోళ్ల పలకరింపులు.... ఇవి పల్లెలకే సొంతం. ఎన్నో తరాల నుంచి వస్తున్న ఈ రకమైన సంబంధ బాంధవ్యాలు, పల కరింపులను నేటి తరం కొన సాగిస్తుండటం విశేషం.

నెల్లూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుల, మతాల మధ్య ఐక్యత మానవ సంబంధాలకు ప్రతీక, వీటిని ఇప్పటికీ మనం చూడాలంటే పల్లెలకు వెళ్లాల్సిందే. బంధుత్వాలతో పనిలేదు, డబ్బు.. హోదాతో అసలు సంబంధమే ఉండదు. ఇంటి పేర్లతో వరసలను కలుపుకుని పూర్వీకుల నుంచి వస్తున్న ఆప్యాయమైన పలకరింపులనే ఇప్పటి కీ నెల్లూరు రూరల్లోని పడమర పల్లెల్లో అలవాటుగా పిలుచుకుంటున్నారు. అరగజం భూమి కూడా లేని రైతు కూలీ వంద ఎకరాల భూస్వామిని సైతం మావో... బావో.. అనే వరసతో పిలవడం ఇక్కడ ప్రత్యేకత. అగ్రవర్ణాల వారు వెనుకబడిన తరగతులకు చెందిన వారినీ వరస పెట్టి పిలిచి ఊరి నడిబొడ్డునున్న చావడిపై కూర్చొని ముచ్చట్లాడటం నిత్యం కనిపించే దృశ్యం. తరాలు మారాయి, ఊర్లు పెద్దవయ్యాయి, అక్షరాస్యుల సంఖ్య బాగా పెరిగింది, కూలీల కుటుంబాల్లోనూ ఉద్యోగస్తులొచ్చారు, ప్రపంచ వ్యాప్తంగా పరుగులు తీస్తున్న ఆధునికత పల్లెకూ చేరింది. అయినా 'ఊరి వరస' మాత్రం మారలేదు. పాశ్చాత్య పోకడలతో వావివరసలను మంటకలుపుతు న్న ఈ రోజుల్లోనూ పల్లెటూళ్లలో స్వచ్ఛమైన మనసులతో, అచ్చమైన వరసలతో కూడిన పలకరింపులు కొనసాగుతుండటం బయటి ప్రాంతాల వారి అభినందనలు అందుకుంటోంది.

ఆ గ్రామాల్లో ఇప్పటికీ...

రూరల్ మండలంలోని పొట్టేపాళెం, కొండ్లపూడి, దేవరపాళెం, కొమ్మర పూడి, ములుముడి, ఆమంచర్ల, దొంతాలి, సౌత్‌మోపూరు, కందమూ రు, వెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు గ్రామాల్లో 'ఊరి వరస' పలకరింపులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మావా, బావా, అత్తా, కోడలా, కొడుకా, చిన్నోడా, పెద్దోడా, బుడ్డోడా... అంటూ కులాలు, మతాలకు అతీతంగా ఆప్యా యంగా పలకరించుకుంటున్నారు. వయసులో పెద్దవారిని ఏదైనా విషయం అడగాలంటే 'మావో.... ఏంది సంగతా....?' అని పలకరింపుగా మొదలు పెడతారు. అలాగే ఆడవాళ్లు తమకంటే వయసులో చిన్నవాళ్లయిన మహిళలను పిలిచేటప్పుడు 'ఓ...మే కోడలా... ఎట్టావున్నావు?, మీ ఆయనుండాడా? అని పలకరిస్తుంటారు. పట్టణాలు, బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఈ వరసలు, పలకరింపులు వింతగా ఉంటాయి. ఇదిలా ఉంటే ఈ సంస్కృతి, సంప్రదాయాలతో ఏర్పడిన ఊరి వరు సలు కొన్ని గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా పెళ్లి బంధా లకూ దారితీసిన దాఖలాలూ లేకపోలేదు. మొత్తంగా తరాలు మారినా పల్లెలు మాత్రం ఆదే 'వరస'తో ఉనికిని నిలుపుకోవడం విశేషం.

ఊరి ఐక్యమత్యాన్ని తెలియజేస్తుంది



ఊరి వరుసతో కూడిన పలకరింపులు ఆ ప్రాంత ఐక్యమత్యాన్ని తెలియజేస్తాయి. ఇది మన పూర్వీకులు తీసుకువచ్చిన అలవాటు. దీనిని ఇప్పటికీ అలాగే కొనసాగించడం సంతోషం. ఈ ఆనవాయితీ భవిష్యత్ తరాలకు కూడా ఇలాగే చేరాలి. ఊరి గుర్తింపునకు కూడా ఇవి ఉపయోగపడుతాయి.

- అన్నం శిరీష, ఉపాధ్యాయురాలు, సౌత్‌మోపూరు

మా ముందు తరం నుంచే...



వరుసతో పిలుచుకోవడం మా ముందు తరం నుంచే వింటున్నాం. అదే అలవాటు మాకూ వచ్చింది. ఎంత పెద్ద భూస్వామైనా సరే వరుసతోనే పిలుస్తాం. వాళ్లూ అలాగే పిలుస్తుంటారు. బయటూళ్లకు వెళ్లినప్పుడు అక్కడ ఇలాంటి పలకరింపులు లేక మా ఊరి ఉమ్మడితనం తెలుస్తుంది.

- బూదూరు పెంచలయ్య, గొల్లకందుకూరు

అలా పిలిస్తేనే పలుకుతారు



మా ఊళ్లలో కులాన్ని పెద్దగా పట్టించుకోం. మతాలు అంతకంటే లేవు. వరుస పెట్టి పిలవందే పలకరు. చిన్నతనం నుంచే వరుస పెట్టిపిలవడం అలావాటైంది. ఉన్నోళ్లా.. లేనోళ్లా.. అనేది సంబంధం లేదు. అందరం కలిసిపోతాం. వరుసలతో పిలుచు కోవడం అలవాటైపోయింది.

- పల్లవరపు సుబ్రహ్మణ్యం, పాతవెల్లంటి మాజీ సర్పంచ్

పోరుబాటకు ఏడాది

- అమలుకు నోచని వైసీపీ ప్రభుత్వ హామీలు
- కూటమి పాలకులపైనే అంగన్‌వాడీల ఆశలు

ఆత్మకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరు ఆగదని.. కనీస వేతనం సాధించే వరకు నిరసనలు హోరెత్తుతూనే ఉంటాయని.. నినదిస్తూ గత ఏడాది డిసెంబరులో అంగన్‌వాడీలు ఉద్యమాన్ని కొనసాగించారు. గత డిసెంబరు 12 నుంచి జనవరి 24 వరకు నిరవధిక సమ్మె , ధర్నాలు చేశారు. వైసీపీ మినహా అన్నీ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచాయి. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం వారిని బెదిరించి భయ పెట్టింది. ఉద్యోగాలు తొలిగిస్తామంటూ షోకాజు నోటీసులు ఇచ్చింది. సచివాలయం ఉద్యోగులతో అంగన్‌వాడీల బాధ్యతలను నిర్వహింపచేసేందుకు సిద్ధమైంది. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు ఉద్యమం విరమించబోమని అంగన్‌వాడీలు ఆందోళన కొనసాగించారు. చివరకు అంగన్‌వాడీల చేపట్టిన ఉద్యమం 43వ రోజుకు చేరింది. దాంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమ నేతలతో చర్చించి కొన్ని హామీలు ఇచ్చింది. కానీ అవి ఇప్పటికీ నెరవేరలేదు.

అమలుకు నోచని హామీలు

అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 50వేల నుంచి రూ 1.2 లక్షలకు పెంచుతామని, సహాయకులకు రూ. 40 వేల నుంచి రూ. 60 వేల వరకు పెంచుతామని, టీఏ, డీఏలు పెంచుతామని అనాడు వైసీపీ నేతలు హామీ ఇచ్చారు. అయినా ఆ హామీలు అమలుకు నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అంగన్‌వాడీల ఉద్యమం సందర్భంగా టీడీపీ అధినేతలు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ తదితరులు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల కోర్కెలను తీరుస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అంగన్‌వాడీలు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు(ఫైల్)

న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం



అంగన్‌వాడీలకు వైసీపీ ప్రభుత్వ కొన్ని హామీలు ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. అప్పట్లో టీడీపీ నేతలు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి అంగన్‌వాడీలకు న్యాయం చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నాం.

- పీ రాధ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



అంగన్‌వాడీలకు రూ. 25 వేలు కనీసవేతం చెల్లించాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్‌లుగా మార్చాలని, పెన్షన్ అమలు చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించా లని తదితర డిమాండ్లతో గత ఏడాది ఉద్యమం కొనసాగించాం. అప్పటి వైసీపీ ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వారి సమస్యలు పరిష్కస్తారని ఎదురు చూస్తున్నాం.

- కొండమూరి హజరత్తయ్య, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు

భూసేకరణలో పూర్తి పరిహారం చెల్లించాలి

- కందుకూరు అభివృద్ధి కమిటీ ప్రతినిధుల డిమాండు



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే దివి శివరాం తదితరులు

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల కోసం జరుగుతున్న భూ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, నేతి మహేశ్వరరావు, బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం కందుకూరు మాజీఎమ్మెల్యే దివి శివరాం నివాసంలో జరిగిన సమాశంలో వారు పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేపట్టారు. రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలకు ఇండోసోల్ కంపెనీకి భూములిచ్చిన రైతులకు పరిహారం సక్రమంగా అందకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చేవూరులో ఆత్మహత్య చేసుకున్న యువరైతు నక్కల వినోద్‌కుమార్ కుటుంబానికి అన్నిరకాల ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. అలాగే రాళ్లపాడు కుడికాలువ రైతులకు త్వరితగతిన సాగునీరు విడుదల చేయాలని, కందుకూరు బైపాస్ విస్తరణలో భూములు కోల్పోయిన దళితులకు పరిహారం అందించాలన్నారు. ఈ సమస్యపై త్వరలో సబ్ కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో పొడపాటి శ్రీనివాసులు, తోకల వెంకటేశ్వర్లు, రేణమాల అయ్యన్న, చీతిరాల గోపాల్, చింతరబోయిన నరేష్, సంగా రాము, ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.

మీ పనితీరు ఇదేనా!? రోగులకు ఇలాగే సేవలందిస్తారా!?

(5వ పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకుంటూ అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ నిధులలో 30 శాతం నిధులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిజియోథెరపీ విభాగంలో అవసరమైన పరికరాలు లేనందున అత్యవసర రోగులను వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ కాంపోజిట్ రీజనల్ సెంటర్ (సీఆర్‌సీ) సెంటర్‌కు పంపించాలన్నారు. ప్రతి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. చెత్తలో ఆసుపత్రి వ్యర్థాలు ఉంటే తీసుకెళ్లవద్దని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ముందుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులను కలెక్టర్ పరిచేయం చేసుకున్నారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్, అదనపు ప్రిన్సిపాల్ గోవింద్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్లు నరేంద్ర, మస్తాన్‌బాషా, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ విజయభాస్కర్, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలు సక్సెస్

- కర్షకులకు మంత్రి ఆనం కృతజ్ఞతలు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సలహా సంఘాల ఎన్నికలను ఎంతో పాదర్శకంగా, విజయవంతంగా నిర్వ హించినట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం సాగునీటి సలహా సంఘాల ఎన్నికలపై ఇరిగేషన్ అధికారులు, ఆత్మకూరు నియోజకవర్గ సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. రైతులంతా కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి సంఘాల సభ్యులతో కలిసి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తానని చెప్పారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని శ్రేణు లకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు దేశ్ నాయక్, ఎంవీ రమణారెడ్డి, బీవీ రమణారెరడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

మనుబోలు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరుపాళెం గిరిజన కాలనీలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పూజిత, మహిళాపోలీసు సునీత, అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బమ్మ, ఆశా వలంటీర్ రమ పాల్గొ న్నారు.

లంచం ఇస్తేనే రుణం మంజూరు?

- వీవోఏని తొలగించాలని 14 పొదుపు గ్రూపు సభ్యుల డిమాండు
- ఫిర్యాదుపై వెలుగు సీసీ విచారణ

ఉలవపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొదుపు, సీఐఎఫ్, స్త్రీ నిధి లోన్లు మంజూరులో ఇబ్బందులకు గురి చేస్తున్న వీవోఏపై సమాఖ్య సంఘం సభ్యులు వెలుగు సీసీ మురళికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉలవపాడు పంచాయతీలోని వడ్డెరపాలెంలో వినాయక సమాఖ్య సంఘంలో 18పొదుపు గ్రూపులున్నాయి. ఆ సంఘం వీవోఏ సకాలంలో పొదుపు లోన్లు మంజూరు చేయాలంటే లంచం డిమాండ్ చేస్తారు. లేదంటే కావాలనే లోన్ తీర్మాణాలు తప్పులు తడకగా రాయడం బ్యాంక్ అధికారులు సరి చేసుకుని రావాలని తిప్పి పంపడం పరిపాటిగా మారింది. ఈ విషయంపై వీవోఏని తొలగించాని ఇటీవల మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందుకూరు వెలుగు ఏసీ సింహాద్రిని ఆదేశించారు. దీనిలో భాగంగా వెలుగు సీసీ మురళి వడ్డెరపాలెం పొదుపు గ్రూపుల మహిళలతో సమావేశం అయ్యారు.



సమాఖ్య సంఘం సభ్యులను విచారిస్తున్న వెలుగు సీసీ మురళి

సభ్యులు చేసిన ఆరోపణలు ఇలా..

- ధనలక్ష్మీ గ్రూపు సీఐఎఫ్ బ్యాంక్ లోన్ కోసం నవంబర్ 27న దరఖాస్తు చేసుకోని తీర్మానాలు, ప్రాసెస్ మొత్తం చేసి తీరా డిసెంబర్ 5న రూ.లక్ష లోన్ మంజూరైయ్యాక మీ ఖా తాలకు పడాలంటే తనకి, సీసీ సారుకు.. సిబ్బందికి లంచం ఇవ్వాలని లేదంటే లోన్ ఆగిపోతుందని బెదిరించారు.
- అనీషా గ్రూప్ సభ్యులతో పాటు సమావేశానికి హాజరైన మిగిలిన పొదుపు గ్రూపు సభ్యులు కూడా వీవోఏ పెట్టిన ఇబ్బం దుల గురించి పూస గుచ్చినట్లు తెలిపారు.
- వీవోఏకి మద్దతుగా సీసీ మాట్లాడుతున్నాడని పొదుపు మహిళలు నిలదీశారు. విచారణను సీసీ తూతూమంత్రంగా జరిపి ముంగించారు. వీటిపై స్పందించిన సీసీ మురళి సభ్యులు చేసిన పిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

వీవోఏ, సీసీకి సంబంధం లేదు

సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుగుతుందని, సీఐఎఫ్ లోన్ ఆపడానికి వీవోఏకి, సీసీకు ఎలాంటి సం బంధం లేదని తాను స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తానని, విచారణ నివేదికను బట్టి వీవోఏపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- కందుకూరు ఏసీ సింహాద్రి

నార్త్‌కొండాయపాళెం సర్పంచు చెక్ పవర్ రద్దు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నార్త్‌కొండాయపాళెం సర్పంచు కాశె రమణమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు బుధవారం డీపీవో శ్రీధర్‌రెడ్డి నుంచి ఎంపీడీవో కార్యాలయాలనికి ఉత్తర్వులు అందాయి. పంచాయతీ పరిధిలో ముజ్జె లక్ష్మీనారాయణ చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన నిధులను చెల్లించకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో నిధులు చెల్లించాలని వెలువడిన తీర్పును అనుసరించి ఉన్నతాధికారులు అందించిన ఆదేశాలను సైతం ఆమె పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో అలసత్వం ప్రదర్శించడం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని పంచాయతీ నిధులు డ్రా చేసే అధికారాన్ని మూడునెలల పాటు తాత్కాలికంగా తొలగించి ఆ బాధ్యతను ఈవోపీఆర్డీకి అప్పగిస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి.

'బెకామ్' ప్రయత్నాలన్నీ విఫలమే!

- 'రాళ్లపాడు'లో పైకి రానంటున్న గేటు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు తూము కుడి కాలువకు చెందిన స్టాప్‌లాక్ గేటు సమస్య కొలిక్కి రానంటోంది. గేటును పైకి లాగేందుకు 'పోలవరం' బెకామ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం చేసిన ప్రయత్నాలన్నీ ఫలించ లేదు. డీఈఈ పరశురాంరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 మంది సభ్యులు గల ప్రతినిధుల బృందం తూము వద్దకు చేరుకొంది. 10 టన్నుల సామర్థ్యం గల రెండు పుల్లీల ద్వారా గేటును పైకి లాగేం దుకు ప్రయత్నించారు. ఎంతసేపటికీ గేటు పైకి రాకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. అయితే గేటును పగలగొట్టాలనే ఉద్దేశంతో గేటు వద్ద లోపల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకొనేం దుకు ఇద్దరు డ్యాంలోకి దిగి పరిశీలించారు. నీటి ఉధృతి కారణంగా గేటు పగలగొట్టడం సాధ్యం కాదని 'బెకామ్' ప్రతినిధులు తేల్చి చెప్పారు.

మోటార్ల ద్వారా సాగునీరు

రాళ్లపాడు కుడి కాలువ ఆయకట్టు పరిధిలో వరి నారుమడులు, వరినాట్లకు మోటార్ల ద్వారా నీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రాజెక్టు డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గేటు నుంచి 70 క్యూసెక్కుల నీరు మత్రామే వెళుతోందన్నారు. తూము బావి గోడను కూడా పగులగొట్టి 30, సైఫన్ ద్వారా మరో 10 క్యూసెక్కులు మొత్తం 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఆయకట్టు పరిధిలో 8500 ఎకరాలలో వరి సాగులో ఉన్నందున 135 క్యూసెక్కుల నీరు అవసరమవుతుందని తెలిపారు. దీంతో మెగా కంపెనీ ద్వారా 50 హెచ్‌పీ, 75 హెచ్‌పీ పంపులను తెప్పించి గురువారం ఉదయం నుంచి కాలువకు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

'జలకళ' కలేనా?

- పూర్తిస్థాయిలో బోర్లు వేయని గత ప్రభుత్వం
- బిల్లుల బకాయిలతో ఆగిన పథకం

ఓపిక పట్టమంటున్నారు...



జలకళ పథకం ద్వారా 2021 డిసెంబరులో మా భార్య సుజాత పేరుతో బోరు, పంపు సెట్ మంజూరయింది. రెండున్నరేళ్ల క్రితం బోరు వేశారు. సొంతంగా డబ్బులు కట్టి కొనెక్షన్ కూడా తీసుకున్నాం. పంపు సెట్ కోసం ఆత్మకూరు డీడీ కార్యాలయానికి పలుమార్లు తిరిగినా ఇంతవరకు ఇవ్వలేదు. అడిగినా అడిగితే కాంట్రాక్టరు వద్ద గోడౌన్‌లో ఉన్నాయి. ఓపిక పట్టు, రేపోమాపో ఇస్తామని చెబుతున్నారు.

- దుద్దుకూరు శేఖర్, రైతు పెగళ్లపాడు, మర్రిపాడు మండలం

మర్రిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే దుకు వైఎస్ఆర్ జలకళ పేరుతో బోర్లు వేసి పంపు సెట్లు ఇచ్చి ఆదుకుంటామన్న మాటలు గత వైసీపీ ప్రభుత్వంలో నీటి మూటలయ్యాయి. ఈ పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. గత ఐదేళ్లకాలంలో ఆత్మకూరు నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో మూడువేల మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. ప్రారంభంలో అర్హులుగా సర్వేలు చేసి, జియాలజిస్ట్‌ల ద్వారా 1023 బోరే పాయింట్లను గుర్తించారు. 620 మంది రైతుల పొలాల్లో బోర్ల బొక్కలు వేశారు. మిగతా రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. బోర్లు వేసిన కాంట్రాక్టరుకు రూ.2.70కోట్లు బిల్లులు రావాల్సి ఉండటంతో మళ్లీ403 బోరు పాయింట్లు అర్ధంతరంగా ఆగిపోయాయి. మిగిలిన దర ఖాస్తులను మూలన వేశారు. 620పాయింట్లు వేసినా, చేజర్ల మండలంలో ఆరు, ఏఎస్ పేట లో రెండు, మర్రిపాడులో ఒక బోరుకు మాత్రమే మోటార్లు మంజూరయ్యాయి. కానీ వాటిని కూడా రైతులకు అందజేయలేదు. మోటార్లు ఎందుకివ్వలేదని అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం కరెంట్ కనెక్షన్లు ఇవ్వటంలేదు. మీరు సొంతంగా కనెక్షన్లు తెచ్చుకుంటే మోటారు ఇస్తామని తెలిపారు.

ఎదురు చూస్తున్నా...



నా భార్య పేరుతో ఉన్న 3.80ఎకరాల భూమిలో జలకళ పథకం ద్వారా మంజూరైన బోరు రెండేళ్ల క్రితం వేశా. అప్పటి నుంచి పంపుసెట్ కోసం ఎదురు చూస్తున్నా. అధికారులను అడిగితే సొంతంగా కరెంట్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. అప్పు చేశాను. విద్యుత్ అధికారులు మాత్రం రూ. 20వేలు డీడీ కట్టమంటున్నారు. అది ఎలా కట్టాలో తెలియడం లేదు.

- పెంచినాయుడు, తిక్కవరం, మర్రిపాడు

జిల్లాలో రహదారుల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ వేమిరెడ్డి వినతి

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రహదారులను అభివృద్ధి చేయాలని కేంద్ర రవాణా, జాతీయరహదారుల మంత్రి నితిన్‌గడ్కరీకి టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం, మంత్రితో భేటీ అయిన ఎంపీ ఈ మేరకు వినతిపత్రం అందించారు. కావలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. దుత్తలూరు- కావలి రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టు వరకు రహదారిని అభివృద్ధి చేయాలన్నారు. ఈ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, కావలి బైపాస్ రోడ్డుకు సుముఖత తెలిపారని, దుత్తలూరు-కావలి రోడ్డు పనులను వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ వేమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

కావలి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు, పెంచిన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ప్రజా సంఘాల నేతలు బుధవారం విద్యుత్ శాఖ ఈఈ జెసర్లకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, రాధాకృష్ణయ్య, మణి, నరేంద్ర, కమలాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆప్కాస్‌లో చేర్చాలి

కావలి టౌన్, డిసెంబరు 18: మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చేసే డైలీ కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి చేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, పెంచలయ్య, సీఐటీయూ, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన 'గంగపట్నం'

సంగం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పడమటిపాళెం నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గంగపట్నం చంద్రశేఖర్‌యాదవ్ బుధవారం మంత్రి రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. తనకు రెండోసారి పడమటిపాళెం సంఘం అధ్యక్షుడి అవకాశం కల్పనపై కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల దాడి

కావలి రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):తుమ్మలపెంట పంచాయతీలోని రామచంద్రాపురం బెల్టు దుకాణంపై బుధవారం దాడులు నిర్వహించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం అమ్మకాలు చేస్తున్న కేశవరావు పెదపోలయ్య అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 15మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనధికార అమ్మకాలు చేస్తున్నట్లయితే సెల్: 94409 02521, 99593 31263 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్వెటర్ల పంపిణీ



అనంతసాగరం: దుప్పట్లు అందుకున్న విద్యార్థులు

కావలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):రుద్రకోట ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు బుధవారం పట్టణానికి చెందిన మోహన్ రత్నాకర్, పింకి దంపతులు స్వెట్టర్లను పంపిణీ చేశారు. కుమారుడు రయాన్ లారెన్స్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని దాతలు తెలిపారు. హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు సుదర్శన పాల్గొన్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు నెల్లూరుకు చెందిన దాత కేవీ ప్రసాద్ బుధవారం దుప్పట్లు అందజేశారు. దీంతో విద్యార్థులు దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాసులు, గ్రంథపాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

కందుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):స్థానిక జనార్దనస్వామి కల్యాణ మండపంలో బుధవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో 20 మంది సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. వారిలో ఇంటూరి మల్లికార్జున, బాలకోటయ్య పున్నయ్య, సామాను బ్రహ్మయ్య ఉన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్(ప్రతి), సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు (ఆర్టీవీ), అధ్యక్షుడు చిమ్మిరి నరసింహ, మాల్యాద్రి, చెన్నయ్య, కృష్ణారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ఉదయగిరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో మంగళవారం రాత్రి ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి, ఆత్మ పీడీ శివనాగరాజు, ఏపీఓ చెన్నారెడ్డి, ఏసీపీ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అధ్యాపకులు గోపికృష్ణ, రమూనాథ్‌రెడ్డి, సునీత, కిషన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలు సరికాదు'

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన దేశ హోంమంత్రి స్థానంలో ఉండి సాక్షాత్తూ పార్లమెంటులో రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను తక్షణం మంత్రివర్గం నుంచి డిస్మిస్ చేయాలని అఖిల భారత మాల సంఘం జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యల ద్వారా హోంమంత్రి అమిత్‌షా తన కులతత్వాన్ని బయటపెట్టుకున్నారని, దళితుల పట్ల ఆయనకు ఎంత చిన్నచూపు ఉందో నిరూపించుకున్నారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



జలదంకి: సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తహసీల్దార్ ప్రమీల

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ చెంచయ్య అన్నారు. బుధవారం రామాపురం, దక్కనూరు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు మహేష్, మనోహర్, నారాయణ, టీడీపీ నాయకులు అరికెంటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

- సంగం: తహసీల్దారు సెలవులో ఉండడంతో చెన్నవరపాడు రెవెన్యూ సదస్సులో డీటీ ఆధ్వర్యంలో అధికారులు రైతుల అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజనారాయణ, సర్వేయర్లు శివరంజని, సుందర్ పాల్గొన్నారు.
- సీతారామపురం:జయపురంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన సదస్సులో సమస్యలు పరిష్కరించాలని రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు,సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో సదివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- ఉదయగిరి: తహసీల్దారు సుభద్ర పుల్లాయపల్లిలో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకయ్య,వీఆర్వో అనూష, సర్వేయరు రమణ పాల్గొన్నారు.
- దుత్తలూరులో: దుత్తలూరు-1 సచివాలయం పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు నాగరాజు రైతుల, నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- జలదంకి: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జలదంకిలో నిర్వహించిన సదస్సు ను ఆకస్మిక తనిఖీ చేశారు. అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వేగవంతంగా పరిష్కరించాలని తహసీల్దారు ప్రమీలను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రమీల, వీఆర్వో గిరి, ఆర్ఐ శ్రీజ, మధురెడ్డి, చిన్నా, మధుసూదన రావు, రఘు తదితరులు పాల్గొన్నారు.
- కొండాపురం: సాయిపేటలో సదస్సులో 11వినతులు వచ్చినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబరుగా గుర్రం మాల్యాద్రి

- అభినందించిన టీడీపీ నేతలు



గుర్రం మాల్యాద్రిని అభినందిస్తున్న టీడీపీ నేతలు

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబరుగా నియోజకవర్గం నుంచి గుర్రం మాల్యాద్రిని నియమించారు. వలేటివారిపాలెం మండలం నూకవరం మాల్యాద్రికి ఈ మేరకు బుధవారం నియామకపత్రాలు అందాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఉన్న కమిటీలో గుర్రం మాల్యాద్రి సభ్యుడిగా ఉంటారు. నేతలు పార్టీ కార్యాలయంలో మాల్యాద్రిని అభినందించారు తెలిపారు.

సీఎల్‌పురంలో పారిశుధ్య పనులు

బిట్రగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని చెంచులక్ష్మిపురంలో బుధవారం పంచాయతీ అధికారులు, సిబ్బంది పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారు. సిబ్బందితో కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. గత 15రోజులుగా గ్రామంలో దాదాపు 30మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు ఉన్నతాధికారుల ఆదేశాలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఈఓపీఆర్డీ నయీం తాజుహసాన్ తెలిపారు. వీరవెంట ముంతాల వెంకయ్య, బోగి ప్రభాకర్ ఏఎస్ ఎలు ఉన్నారు. అంతర్గత రో డ్లపై వేసిన పేడ దిబ్బలను రైతులకు నోటీ సులు జారీ చేసి తొలగించాలని హెచ్చరించారు.

కబ్జాకు గురైన ఇనాం భూములు ఇప్పించండి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న

బిట్రగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్కచెరువుపాడు కొండబిట్రగుంటలోని ఇనాం భూముల కొందరు కబ్జా చేశారని వాటిని గ్రామస్తులకు ఇప్పించాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం బోగోలు మండలం అక్కరాజువారికండ్రి, చెంచులక్ష్మీపురం గ్రామా లకు చెందిన కొందరు ధర్నా చేపట్టారు. తహసీల్దారు సురేష్‌బాబు కార్యాలయానికి రాకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ భరత్‌కుమార్ కు వినతిపత్రం అందజేశారు.

కేంద్ర బృందం ఉపాధి పనుల పరిశీలన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):కొలొల్లువారిపల్లిలో ఉపాధి పనులను బుధవారం జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఐఆర్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యేంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలోని బృందం భూగర్భ జలాల అభివృద్ధికి రూ.3.20 లక్షలతో చేపట్టిన చెక్‌డ్యాం పరిశీలించారు. అలాగే సాగులేని జామ తోటలను పరిశీలించి సాగుఖర్చు, దిగుబడి, ఆదాయం, మార్కెటింగ్ అంశాలను రైతు గడిపుడి మురళిని అడిగి తెలుసుకున్నారు. బృంద సభ్యులు లోకేష్, లక్ష్మీనారాయణ, డ్వామా పీడీ గంగాభవానీ, ఏపీడీ శంకరనారాయణ, ఏపీవో ఆజంఖాన్, ఈసీఓపీఆర్ నాగూర్‌వలి పాల్గొన్నారు.

- వింజమూరు: ఢిల్లీ నుంచి వచ్చిన సత్యేంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలోని జలశక్తి అభియాన్ బృందం మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, అనంతరం వింజమూరు పంచాయతీలో ఉపాధి పనులతో ఏర్పాటు చేసిన హార్టీకల్చర్, చాకలికొండలో గ్రామకొలనును సందర్శించారు.



ఉదయగిరి: చెక్‌డ్యాం పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

ఏఎస్ పేట, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సర్పంచులు,ఉ ద్యోగులకు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి ర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో ప్రయోజనం

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగులో రైతులు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయడం ప్రయోజనం అని ఆత్మ పీడీ శివనాగరాజు సూచించారు. బుధవారం మండలంలో కూరగాయల పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, ఏఈఓ బోగ్గం సుధీర్‌కుమార్, బీపీఎం కేశవయ్య, వెంకటపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడలు లేని వంతెన



మండలంలోని పోలినేనిపాలెంలో తూమరేరువుపై నిర్మించిన వంతెనకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ఇరుకుతున్న వాగులో పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వానకాలంలో వాగు పొంగే సమయంలో వాహనదారులు వెళ్లే కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ



కావలి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

కావలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్‌శాఖ ఈఈ జెసర్ల పట్టణంలో విద్యుత్‌శాఖ అధికారులు,సిబ్బందితో కలిసి విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెంగళరావునగర్‌లోని ఈఈ కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ ఉదయగిరి రోడ్డు మీదుగా ఆర్టీసీ వంతెన వరకు సాగింది. విద్యుత్ పొదుపుతో పాటు సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంచుకుని వినియోగించుకుంటే విద్యుత్ బిల్లుల భారం తగ్గి విద్యుత్‌ను పొదుపు చేసినట్లే అని ఈఈ తెలిపారు. విద్యుత్ పొదుపుపై ప్రజలలో మరింత చైతన్యం తెచ్చేందుకే వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ కావలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్‌రెడ్డి, కావలి టౌన్, రూరల్ ఏఈలు వసంతరావు, శ్రీనివాసులు రెడ్డి , విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- ఉలవపాడు: వీరేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ వినియోగం, పొదుపుపై అవగాహన కల్పించినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ పొదుపు మార్గాలు, విద్యుత్ చౌర్యం నివారణ, సోలార్ ప్యానెల్, విద్యుత్ ప్రమాదాల నివారణ తదితర అంశాలపై వివరించారు.

ద్వాక్రా రుణాలే కాదు.. ఇతర రుణాలు ఉన్నాయి

- సద్వినియోగం చేసుకోండి
- ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు, మహిళలు స్వయం సంవృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను బ్యాంకు రుణాలను పొందవచ్చని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ సీజీఎం డిప్యూటీ జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్ కోరారు. పట్టణంలోని స్వర్ణ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో ద్వాక్రా సంఘాల మహిళలకు బుధవారం బ్యాంకు రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్వాక్రా సంఘాల రుణాలతో పాటు స్వయంనిధి, పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా తదితర పథకాలతో ఇతోధికంగా సబ్సిడీలు, బ్యాంకు రుణాలు అందజేస్తున్నందున ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కందుకూరు ఎస్బీఐ పరిధిలోని ద్వాక్రా మహిళలకు రూ.15కోట్ల రుణాల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ మెయిన్‌బ్రాంచ్ చీఫ్ మేనేజరు శ్రీనివాస్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరావతి సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్ బీస్వాల, రీజనల్ మేనేజరు సూర్యప్రకాష్, రీజనల్ చీఫ్ మేనేజరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న శైలేష్‌కుమార్

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ



సంగం : మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధిపై బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాలెట్, పీఆర్ ఏఈ రామయ్యఏపీఎం రవిశంకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పాల్గొన్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశక్తి భవనంలో సుస్థిర అభివృద్ధిపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఏపీఎం బాజారుతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను పాల్గొన్నారు.
- సీతారామపురం : ఎంపీడీవో భాస్కర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై రెండవ రోజు నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవి, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ

- జేవీ రమణమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ (పీఆర్)



ఉలవపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మట్టి రోడ్డు లేని గ్రామాలను మూడురోజుల్లో ఉక్కుంగా పల్లె పండుగ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పంచాయతీ రాజ్ ఏఈ (పీఆర్) జేవీ రమణమూర్తి తెలిపారు. అందులో భాగంగా తెలిపితలలో అన్నిగ్రామాల్లో పనులు చేపట్టామన్నారు.

? సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయా.

! మెటీరియల్, వేజీకాంపోనెంట్ ద్వారా ఉపాధి నిధులు మండలానికి రూ.3కోట్లు మంజూరయ్యాయి. మండలంలోని అన్ని పంచాయతీలకు జనాభా దామాషా ప్రాతిపదికన నిధులు కేటాయించాం.

? కేటాయించిన నిధులతో ఎన్ని కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

! మండలానికి కేటాయించిన నిధులతో 5 కిలోమీటర్ల సిమెంట్ నిర్మాణం చేపట్టాం. నెల్లిఠంచిన అన్నిరోడ్ల దాదాపు పూర్తి కావచ్చాయి.

? నిర్మాణంలో ప్రమాణాలు పాటిస్తున్నారా

! ఆయా గ్రామాల్లో నిర్మాణంలో రోడ్డు పనులను సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది నిత్యం గ్రౌండ్ పరిశీలిస్తున్నారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీపడం. సిమెంట్ రోడ్లు నిర్మాణ అనంతరం క్వాలిటీ కంట్రోల్ విభాగం రోడ్ల నిర్మాణ నాణ్యతను నిర్ధారించిన తరువాతే సంబంధిత బిల్లులు మంజూరు అవుతాయి. అవసరం కాంట్రాక్టర్లకు ముందుగానే ఇంజనీరింగ్ అధికారులు నిర్దేశించిన ప్రమాణాల గురించి అవగాహన కల్పించి పనులు చేపట్టేలా సూచిస్తాం.

పదవికి వన్నె తెచ్చిన నేత గ్రంధి యానాదిశెట్టి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నేతలు

కావలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదవులు, పార్టీలు ఏవైనా పదవికి వన్నె తెచ్చిన నేత మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కొనియాడారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం గ్రంధి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో స్థానిక బాబూజీ నగర్‌లోని సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు తటవర్తి రమేష్ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సహకారంతో కావలిలో గ్రంధి విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. అనంతరం అన్నా క్యాంటీన్‌లో గ్రంధి పేరుమీద అన్నదానం చేపట్టారు. మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోట్లూరి శ్రీనివాసులు, బుర్రి రమేష్, తటవర్తి వాసు, తిరుపతి ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్రావు, బీజేపీ నేత సీఎస్ సత్యం పాల్గొన్నారు.

జనసేనలో మత్స్యకారుల చేరిక

కావలి టౌన్, డిసెంబరు 18: పట్టణంలోని జనసేన కార్యాలయంలో బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో మత్స్యకార సంఘం నాయకులు శ్రీను అధ్యక్షతన తుమ్మలపెంట మత్స్యకారులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుధాకర్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో డాక్టర్ రవి, ఏడు కొండలు, రవికుమార్, దాస్, యానాదిబాబు ఉన్నారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ అభ్యర్థులు సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

